2042F3

PRINTED AT THE
VEMKATRAM POWER PRESS,
Artisl'c Printers,
POWERPET- ELLORE-1934.

విజ్ఞప్తి.

పండితలోకమా ! నమస్కారములు.

గ్రంథరచనాభిలాష నేటిదిగాదు. నిరూపక కథలపై నున్నయాసక్తి చరిత్రాత్మకములపై లేదు. అయినను, ప్రయత్నమున నష్టములేదని యీ రూపమున మీయెదుట నీపాత్రము నుంచితిని.

సారంగధరకథ వ్యాప్తిలోనుండు ఫక్కికి విపరీతముగ వ్రాయుట సాహసము గాకపోదు. కాని యిందుల కాధారములు లేకపోలేదు. చిన్ననాటనుండి పెంచి, ప్రవర్తనను గమనించిన తండ్రిగారు సుతు ననుమానించిరనుట నాకు నమ్మకములేనిమాట.

అదియుంగ నిందు, చరిత్రాలందు పినతండ్రివలన నాతఁడు దేశభ్రష్టుఁడయ్యెనని యున్నది. ఆ యొక్కయంశమే నా గ్రంథమున కెత్తుగడయగునని దలంచితిని. కవిజీవితములందు శ్రీ॥ శే॥ కం. వీరేశలింగము పంతులుగారితనిగూర్చి వ్రాసిన ఫక్కి కానందించితిని. అట్టి యమేయప్రతిభాశాలి కథ వ్రాయుట ప్రశంసార్హమని తలంచితిని. కాని ఫలము ! మన యాంధ్రచారిత్ర యసంపూర్ణము. నా యీ కథానాయకునిగూర్చి పలువురు పలువిధములుగ వ్రాసిరి. ఆ వ్రాత

లన్నిటి ననుసరించితిని. కొన్నిచోట్ల యందులకు విరుద్ధముగా వర్తించితిని.

పంతులుగారు 1063 వఱకు రాజరాజే వేంగిని పాలించెనని వ్రాసిరి. ఇది యనుసరించిన నాకథకే భంగమని యాన్నృపుని మరణము 1051 ప్రాంతములందైనటుల వ్రాసితిని. ఆంధ్రలోక ముదారతమొయి క్షమింపదా? 1054 ప్రాంతములందు సారంగధరుఁడు 1040-69 వరకు పశ్చిమ చాళుక్య నాథుడై యాహవమల్ల బిరుదాంకితుఁడగు ప్రథమ సోమేశ్వరు నాశ్రయించినటుల హిందూ దేశచరిత్ర చెప్పుచున్నది. దీనిఁబట్టి పైమాఖ్యనకు సాహసించితిని.

ఆహవమల్లుఁడు 1060 ప్రాంతములందాత్మహత్య గావించుకొనినటుల వ్రాసితిని. (చరిత్రయందిది 1069 లో నసియున్నది.) ఆ చరిత్రయందే యాహవమల్లుని ద్వితీయ సుతుఁడగు విక్రమాదిత్యుఁడు సోదరుని కపటోపాయమున దేశభ్రష్టుడై 1062-70 వఱకు చోళభూమిని పాలించుచుండిన వీరరాజేంద్రు నాశ్రయించినటులున్నది. ఆంధ్రవీరారాధన (పు॥ 23) యందు పూర్వ చాళుక్యులపై విక్రమాదిత్యుఁడు దండెత్తిరా విదేశగతుఁడగు సారంగధరుఁడు పినతండ్రికి సహాయపడినటులున్నది. అయ్యది నా కథకు సపూర్ణముగ విరుద్ధముగ నున్నది.

చరిత్రనుబట్టి 1069-76 వఱకును (నా యభిప్రాయమున) పశ్చిమచాళుక్యుల ద్వితీయ సోమేశ్వరుఁ డేలు

చుండెనని తెలియుచున్నది. అదిగాక కులోత్తుంగుఁడే పశ్చిమ చాళుక్యులపై నెత్తిపోవ విక్రమాదిత్యునివైపు, సేనలు సోమేశ్వరునివదలి పోయినటుల చరిత్రయందున్నది. అందు వలన చక్రవర్తిత్వ మభిలషించిన వీరరాజేంద్రునివిక్రముఁడు వెంబడించెననుట సమంజసముగ నుండును.

అదిగాక 1076 ప్రాంతములందు కులోత్తుంగుఁడు చోళరాజ్యమున కధినాథుఁడయ్యెను. నాయూహ సత్య మైనచో నాఁడవ విక్రమాదిత్యుఁడు 1069 ప్రాంతమునరాజై చోళరాజ్య విషయమున స్పర్థకలవాఁడై యుండెను. 1070 నుండి 1080 వఱకును నీ వీరులిరువురును సమరముల సలుపు చునేయుండిరి. కాఁబట్టి విక్రమాదిత్యుఁడే యాంధ్రభూమిపై నరుదెంచెననుట నే విశ్వసింపనైతిని.

రాజసుందరి రాజరాజున కిచ్చినటు కవిజీవితములందు వ్రాయఁబడి యున్నది. అది కారణముగ నుత్తర కళింగ కథను పూర్వ సంబంధముండిన భాగుండునని వ్రాసితిని. రాజరాజు 1030-77 వఱకు ధరాపాలన మొనర్చెనని యున్నది. అది యాతని తండ్రి వజ్రహస్తుని కాలమైనచో సరిపోవునని తలంచితిని.

1063 లో రాజ్యమునకు వచ్చినవాని దౌహిత్రుఁడు 1077 లో కళింగ ప్రభు వయ్యెనను టెంత సమంజసముగ నుండునో పాఠకు లూహింతురుగాక. ఇది నా మార్పునకు నిమిత్తము.

చరిత్రలందు అసహాయ శూరుడై వేంగి పల్లవ చోళ దేశములకు నాయకుడై యుండిన కులోత్తుంగ చక్రవర్తినిగురించి వ్రాయకుండుట శోచనీయము. చరిత్రకారులకు నాకుఁగలిగిన సంశయములే కలిగియుండినచోఁ జెప్పునదేమి?

చరిత్రాత్మకనవల యని పేరిడుటవలన నిన్నివిషయములు వ్రాయవలసెను. మన దేశ చక్రవర్తుల పాలనా విషయమును దెలియఁగోరుట కంటె ఆంగ్ల చరిత్ర యందలి 'డంకిర్క్' యుద్ధకారణ విధాన ఫలితములఁ దెలియఁగోరు పాఠకులుండిన వారి కాలహరణమునకు క్షమ ప్రార్థితము.

విధేయుడు,

ఉభయభాషా ప్రవీణ

చెన్నుభట్ల వేంకటకృష్ణశర్మ,

కోల్సు హైస్కూలు ప్రధానాంధ్రోపాధ్యాయుఁడు.

కర్నూలు,
1—1—33.

శ్రీరామచంద్రాయనమః.

కులోత్తుంగ విజయము.

ప్రథమ ప్రకరణము.

అది మధుమాసము. మాధవుడు నిజనాయకు నాజ్ఞ శిరమునధరించి యాంధ్రావని ముట్టడించెను. ఆంధ్రులు జననిని స్వాధీనపఱచుకొను టా యనంగుని జైత్ర యాత్రకుఁ గారణము. మనోహరనినదముల ద్విజగణము లొనర్చుచు, వేదపాఠ మొనరించు గోదావరీ తీరవాసుల ద్విజోత్తముల నధఃకరించుచున్నవా యన్నటు లుండినది. మాధవు నాగమన జనిత మోదాతిశయమున వనలక్ష్మి నూతన వికసిత సుమజాలములచే హాస మొనర్చుచుండెను. లోకము నంతయు నిజపాదాక్రాంత మొనర్చుకొనిన పంచశరుఁ డరుదెంచునని రత్నకంబళ ప్రచ్ఛాదితమైనట్లు మేదిని యలరారుచుండెను. చిగురాకు లాం మీన కేతనున కస్త్రము లగుట చాలక, తోరణములై మనో నయనములకే యానందము నొదవించు చుండినవి. మానవకృత శృంగార రసాభాసత నెఱుకపఱచెడినో యన ప్రకృతిశృంగార మేవంక చూచినను ప్రశంసాపాత్రమై, సహస్రాక్షుని యక్షి బాహుళ్యత కీను నెట్టిదైన నందునటు లొనర్చుచుండెను.

పాఠకమహాశయులు గోదావరీప్రాంతమున కరుదేర వలసియున్నది. రాజమహేంద్రవర ప్రాముఖ్యత నిట తెలుపు టనవసరము. మధుమాసమున, అందును ప్రాతః కాలమున, అందును బురోద్యానమునఁ బ్రకృతి యెటు లుండును? ఊహాతీతమగు నద్దాని వర్ణింపఁగడంగుట శక్తి ప్రకటించుటయగు.

అటుతిలకింపుఁడు. గోదావరీ తరంగములపై కలహంసములు తూగుటుయ్యేల లందుండు కవిహంసలక్రియ నొప్పుట పరికింపుఁడు. మధుకరాంగనలు మధువు నపారముగ సేకరింప గలిగితిమని కాంబోలు భర్తల కవ్యక్తమధుర రుతముల దెల్పుచున్నయవి. పరభృత మొండల్లదె నిజాంగన కేదియో రహస్యము నుడువుచున్నయది విలోకింపుడు. అయ్యది సహకారపుఁ గెంజిగురాకును మెసవెనని రసజ్ఞులగు మీరు గ్రహించియుందురు. ఆ నికుంజములు, ఆ లతాంత శకుంత సంతానయుతంబులగు శాఖలు, వీచీ కరంబుల నానందంబుగ తీరశాద్వల ప్రదేశముల స్పృశించు పద్మాకరములు, ఎట్టి భాషాజ్ఞాన రహితునకైన భావకవితను గలిగించున దగుటలేదా!

పోనిండు వాటితోనేమి? అటులా మల్లికానికుంజమును దిలకింపుడు. తూలికాహస్తుడగు యువకుఁ డగుపడుటలేదా? చిత్రభిత్తికాస్థితుండగు ననంగు నధఃకరించు నారూపము మిము ముగ్ధులఁ జేయుటలేదా? ఏలచేయదు? చిత్రరచన

యందు నిమగ్నుఁడగు నాయువకుఁ డచలితేంద్రియుఁడగుట నేఁటికాలపు ఛాయాచిత్రకారుల కెంతటియుల్లాసకారణుఁడై యుండును. అదిగో! ఏమాయెను. చూడుఁడా తూలికను బడవైచి యెటు వికటాట్టహాస మొనరించుచుండెను! వింశద్వత్సర వయస్కుఁడగు నాయువకుఁడట్లు హాస మొనర్చుట కాతని హృదయాంతర్భాగ మెంతటిపవిత్రమై నిష్కల్మషమై యుండనోపు. ఆతఁడాచిత్తరువు నటు బడవైచి వేణువు నూద నారంభించెను. ఔరా! ఏ మాతని గాన విద్యా ప్రభావము? గోపాలబృంద తన్మయకారకుఁడగు గోవిందుని మఱపించు నాతని గానవిద్యావైశారద్యము మాలేఖిని యేమనివర్ణింపఁగలదు. అటుచూడుఁడా ద్విజసంఘ మెంతటి యార్ద్రాభావమును నిజపక్షచ్ఛటావిక్షేపణమున నగుపఱచెడిని. అచేతనములే చిగిర్చెడు నెడ గానతత్త్వవేత్తనుగు పక్షికోటివిషయము చెప్పనేల?

వేణువు నటువైచి యా యువకుఁడొక తాళపత్ర గ్రంథమును గైకొనియె. అయ్యా దేదని విచారింపనేల? వాగనుశాసన విరచిత శబ్దానుశాసనము. మా పాఠకు లాతఁ డెవరైనదియు నూహించియేయుందురు. చతురల నాతఁడా గ్రంథము నటువైచి చిత్తరువుఁ గొనెను. పరేంగితావగాహు లగు పాఠకులాతని మనంబాందోళనాయత్తమై యుండెనని గ్రహించియుందురు.

ఆ యువకుఁ డజాగ్రత్తమెయి తూలికనుపయోగించు టను గాఁబోలు నాచిత్తరువు నూతన శోభను బడసినది.

అది యాతని యుద్దేశమునకు వ్యతిరేక మగుటవలన విసరివైచెను. ఆచిత్తరువు ప్రాంత నికుంజ ముఖప్రదేశమునం బడెను. నీల నీరదాంతర్గతవర్తిని యగు విద్యుల్లతికబలె నొక మోహనాంగి వెలువడి యద్దాని గ్రహించెను. ఆపె యెవరు? అట నెందులకు దాగియున్నది? ఎంత కాలమైనది? ఆచిత్తరువు నేల గ్రహించినది? ఆతని దృష్టిపథమున నేల పడసాహసింపకున్నది ఓ! యీ ప్రశ్నలెందులకు?

ఆవేణుగాన మంతకంతకు మనోహరత నందుచున్నది, ఆఁగినది. దానికిఁగారణము పురుషద్వయమటఁ బ్రవేశించుటయె. ఒకఁడు మధ్యమ వయస్కుఁడు; ద్వితీయుఁడా యువకుని వయసువాఁడు. వారిరువురు యోధవేషముల నుండిరి. దరహాసమొందు వారి దర్శించినంతన మన యువకుని ముఖబింబమునం దుద్యోతమగుట వారాతనికిఁ గూర్చువారని గ్రహింపనగును. అంత యువకుఁడు "విజయా! ఏమి 'నసామ్య త్వర్థరోన్మతః' అను సూత్రార్థము విమర్శింప నరుదెంచితివా! ఆచార్యులవారు".

"రాకుమారా! చాలును. నీవ్యాకరణ పాండిత్యము గాని, గానలోలతగాని, రాజ్యలాభము గలిగింపదు".

"ఆయిన"

"ఇదిగో! కరవాలము."

"అబ్బా! అబ్బా! ఏలయది? నాగుండియ లదరుచున్నవి. గాత్ర మస్వాధీన మగుచున్నది. మిత్రమా! జాగ

రూకుఁడవు గమ్ము. పొరబాటున వదలుదువు సుమా ఆమారణ సాధనము ? ఆవ లుంచుము. క్రియాపరిచ్ఛేదము సెప్పెదను."

"వీరాగ్రణియగు రాజరాజనరేంద్రుతనయుఁ డింతటి భీరుఁడని కలనైనఁ దలంపనైతిని. విష్ణువర్ధన వంశమున కప కీర్తి తేనేల యత్నింతువు ? ఆశాపిశాచా విష్టుఁడగు మీపితృవ్యు నెదురింపుము. చేతగాకున్న వాని పట్టుపెట్ట నాకనుజ్ఞ నొసంగుము."

"విక్రమసింహా! విక్రమసింహా! వాచాదోసమెందులకు ? ఊరకుండుము. నాపితృవ్యునే! నా జనకుని గారాబు తమ్మునే! నావంశములోని వానినే! పట్టుపెట్టుటయే! అయ్యో! నీకు నోరెటులాడెను ? సేనానివగు నీవేయిటులాడిన ఏమననగును ? ఎంతటి దుర్దినమిది ?"

"అయ్యో! ఆ దండకము చాలింపుము. విని విని వేసరిక గల్గినది. నేనిపుడు మీపితృవ్యుఁ నాజ్ఞానుసార మిష్టము లేకున్నను చోళమండలముపై నెత్తిపోవుచుంటిని. మరల నేవచ్చులోపల పితృవ్యమరణమో, వనవాసమో నిశ్చయించు కొనుము. నా తనయుఁడు నా వెంట నరుదెంచువాఁడు."

"అవునా విజయా ! పోదువా ? నరుల జంపుదువా ? ఆచార్యులవారు దెల్పిన భూతదయ—"

"మిత్రమా! ఆచార్యులవా రిపుడే యుండిననీకు బుద్ధి సెప్పియుండెడివారు. మాజనకుల మాట మఱువకు. పోయి వత్తును."

"ఇదిగో! మధురాంతక మగుపడిన నూతన కీర్తనల రచించితినని తెలుపుము."

"ఆఁ—పిఱికిపందయనికూడ తెలుపుదుము"

"సేనానీ! భూతదయ యనునదెఱుఁగవా?"

అందులకుఁ బ్రత్యుత్తరమీయక యా చళుక్యవాహినీపతి తనయునితో నచటు బాసెను. మన యువకుఁడొక దీర్ఘోచ్ఛ్వాస మొనర్చి వారివైపు జూచుచు శ్యామలకోమలతృణకుసుమ ప్రచ్ఛాదిత భూతలమున పరుండెను. ఆతని మానసవీధి నెట్టి భావములు పరుగులాడెడినో చూతమా? వలదు రండు.

ద్వితీయ ప్రకరణము.

విజయాదిత్యుఁడు ప్రాచ్యచళుక్యుల కేలిక. నలువదియైదు వర్షములు సుఖజీవనము నతీతముగ ననుభవించెనను టతని స్థూలకాయతయే చూపుచుండెను. ఆతఁడురూపవంతుఁడే కాని యుర్లగడ్డలవంటి బుగ్గలును, తటాలున నాగిపోయిన నాసికయు నటు లననీయకుండినవి. అతఁడు మహారాష్ట్రాచారముగ వస్త్రముల ధరించుచుండును. స్వభావము కుటిలమైనదేగాని స్వతంత్రత లేదు. ఆ రాజునకు నాలోచనముఁ జెప్పువారనేకులు గలరు. అతని ప్రధానుఁడు నారాయణభట్టు. తంత్రములు దురవగాహములు. ఆ బ్రాహ్మణుఁడే లేకుండిన సోదరుని రాజ్యమును స్వీకరింప నాతఁడు జతన మొనర్చి యుండడు.

ఇప్పుడు విజయాదిత్యుఁడు పల్లవరాజ తనయ వాసంతికపై మరులు గలిగియుండెను. సారంగధరుని చిత్తరువు జూచినంతనె పల్లవుల నాయకుఁడు తన తనయ నొసంగ సమ్మతించెను. ఆ బాలిక రాజమహేంద్రవరమును సముచిత పరివార సమేతయై చేరెను. నిజము, విజయాదిత్యుఁడు వాసంతికను సారంగధరునకై రప్పింపలేదు. తన సతి సింహపురీశు తనయ, మదాలసపై, ససహ్యము కలిగియుండెను. మదాలస కిరువది వత్సరముల వయసు; అచ్చున తీర్చినట్టి యాకారము. మఱి విజయాదిత్యు ససహ్యతకుఁ గారణము? దుర్జనులకుఁ గారణమేల? స్త్రీలోలత చాలదా? అది యటు లుండ మదాలసకు సుతోదయము కాలేదు. తన యనంతరము రాజ్యము సారంగధరునకుఁ బోవుట యాతనికిష్టము లేదు. అందు వలన వాసంతికను వివాహమాడ తలంచెను. ఆపె హృదయము సారంగధరునిపై నుండినది. ఒకటి రెండు మారులా యువకునిఁ జూచియుండినది. చిత్తరువునందలి లోపముల గనుగొనగలిగినది. ఆతని వేణుగానమును వినినది. తన్మయురాలై పోయినది. తన కుండు చిత్రకళానైపుణ్యమున వాని రహస్యముగఁ జిత్రించుకొనినది. ఇక విజయాదిత్యు డాస వదలుకొనవలసినదే.

'వలదనిన పోవుటకు వైదికుఁడా?' అనినటులతఁడు యువతీ హృదయేంగితావగాహి యగు నంతటి రసికుఁడు గాఁడు. వలపులేని కాంతను వదలునంతటి వివేకిగాఁడు. ఆయమ నెన్నియేని మారులు బ్రతిమాలి చూచెను. నిష్ఫల

మనోరథుఁడయ్యెను. ఆ రాకొమరిపై వలపంతకంతకు మించి పోవుచుండెను. ఆమెను బడయనిది తా జీవించియు ఫలము లేదని యెంచెను. మనోదార్ఢ్యము లేనివాఁడగుట బలవంతము సేయఁజాలకుండెను.

వాసంతిక షోడశవర్ష ప్రాయ. రసికుల చేఁబడని సుమరాజమువలె, భ్రమరసందోహ సంచార హీనమగు భానూదయ సమయ వికసిత పయోరుహమువలె రాజిల్లుచుండెను. ఆపె ప్రత్యంగ సౌందర్య గరిమను వర్ణించుట మహాకవి ప్రయోగ పదజాల చౌర్యమగును. ఆ వినీల కుంతలములే మానసికాందోళనమును గలిగింప సమర్థములై యుండ, తీక్ష్ణములై, యువక హృదయ విదారకములై, జితేంద్రియాపజయ కారకంబులగు చూపుల విషయము వలుకనేల? రత్నదీధితుల దిగంతరాళముల వ్యాపింపఁ జేయు నా నునుఁజెక్కులు దర్పణముల నతిశయించుననుట వర్ణనమెటులగును? ఆ చిబుకము యువతీలోకపరాఙ్ముఖునేని యొకసారి పట్టివిడువఁ బ్రేరేపించెడు ననిన చాలదు. అధరము మోహపాశబద్ధుడై నిజప్రియా ముఖబింబ చుంబన ప్రయత్నుఁడగు మాతనయుఁడైన నిది చూచి, యది మాను నందమా? ఇఁక చాలును.

అట్టి రూపజితరతియగు నా వాసంతిక తన గదియం దొకనాఁటి ప్రాతర్వేళ హంసతూలికా తల్పమునం దేదియో తలంచుచు పరుండి యుండినది. స్త్రీ మనో భావముల

నూహింప నారదునంతటి మహాత్ముఁడసమర్థుఁడఁట. మన మనగ నెంత ?

విజయాదిత్యుఁడు శృంగారిత తనుఁడై యటఁ బ్రవేశించెను. సర్ప స్పర్శయుంబోలె నా రాకొమర్తె యదరిపడి నిలచెను. విజయాదిత్యుని హృదయ మొకమాఱు ఆఁగిపోయెను. సహజదీనతాధీన మగు నాతని ముఖము మఱింత తెల్ల బాఱెను. ఎట్టకేలకు దృఢప్రయత్న సంపాదిత ధైర్యుఁడై యారాజు సమీపమందలి యాసనము నలంకరించెను. గొంతు సవరించుకొని,

"యువతీ! మహారాణివి కానేల కోరవు ?"

"నాతో మాటాడవలదని చెప్పియుంటిని."

"నా ప్రేమ మతీత మగుచున్నది."

"ఇంకను గానిమ్ము."

"ఎటులను నిను విడువను"

"ప్రాణముల విడిచినను——"

"ఆఁ——"

"అటులైన నా శవము నీ స్వాధీనమగును లెమ్ము."

"అట్టి ప్రసంగము నొనర్పకు. నీ వసువుల బాసిన యుత్తర క్షణమున నే మనియుందు ననుకొందువా ? వాసంతికా ! నీ వెఱుఁగవు గాని నా ప్రతి రక్త బిందువును నీ యాకృతిని ధరించి యున్నది."

"అయ్యా! ఈ ప్రసంగమునువదలి యావల కేఁగుము."

"నీ పరిష్వంగసుఖ మనుభవించనిది యీవల కేఁగుటకు నా పాదములు కదలినగదా ?"

"నా పరిజను లెటనుండిరి ?"

"ఉండవలసిన చోటనే"

"వారినేల పంపితివి ?"

"నీ బోఁటి సౌందర్యగరిమ నందియుండమి"

"అధిక ప్రసంగము వలదు. అసహాయ నాయాస పెట్టుట రసిక లక్షణము కాదు"

"ఆ రసిక లక్షణమే యిట్లు ప్రార్థింపఁ జేయుచున్నది. కాకుండిన——"

"ఆఁ——"

విజయాదిత్యుఁడు నిలిచెను. ఆ బాలికను సమీపించెను. ఆమె చటాలున శయ్యను దాఁటెను. అతఁడు దాఁటుటకు కొంతయాలస్యమయ్యెను. కేళీలోలులగు బాలబాలికలవలె వారు కొలఁది దూరము పరుగిడిరి. వాసంతిక యాక్రూరకర్మున కుఁజిక్కెను. నిర్దయా స్వాంతుఁడగు వ్యాధుని కరగతమగు పికాంగన భాతి యాసుమకోమలి యొక యఱచి పఱచి మూర్ఛిత యయ్యెను. ఆమెను శయ్యపైఁ బడవైచి తుట్టె పెదవులతోఁ గపోలమును, నయనములఁ, జెక్కిళుల, చుబుకమును జుంబన మొనర్పనెంచి తలవంచెను. పెదవులకును గపోలమునకు నంతరమంతగ లేదు ? అంతలో నాతని వీఁపున కేదియో గ్రుచ్చుకొనియెను. గుండియలు ఝల్లుమన వెన్నె

ముకను జక్కచేసికొనియెను. తిరుగలేక వెనుదిరిగెను. ఆతని హృదయ మాఁగిపోయెను.

ఒకవ్యక్తి రక్తాంబరధారియై నిలచియుండెను. ఆతని నయనములును ముఖమందలి కొంత భాగమును గప్పఁబడి యుండెను. ఆతఁడు యువకుఁడనియు, బలిష్ఠకాయుఁడనియు, పంచవింశ ద్వర్షుఁడనియు నా తడబాటు నందిన విజయాదిత్యుఁడు ఊహించుకొనియెను. ఆతని హస్తగతముగు నిశిత కరవాలము తన హృదయమంత వేగముగ కొట్టుకొనుటకుఁ గారణమని రాజు కడ కెఱుంగఁ గలిగెను.

"అసహాయులగు నబలల నలమట పఱచు టెన్ని దినములనుండి చళుక్యరాజులు నేర్చిరి?"

"నీ వెవరు?"

"అధర్ముల పాలిటి యముఁడను, నన్ను వనకేసరి యందురు. ఇంకను నా పరిచయము కావలయునా?"

"నీ విటనుండి పోవలయును"

"నేను పోవుదును. ముందా యువిదను క్షమింపఁ గోరుము."

"అది నీచే కాదు"

"అవివేకీ! పురుషునకుఁ జేతకాని దేది?"

వాసంతిక కన్నులఁ దెఱచెను. ఆ దృశ్యము నంతలో గ్రహింపఁ గలిగెను. ఆప్రచ్ఛన్నవ్యక్తి తనను రక్షింప నరుదెంచిన వాఁడని తలంచెను. చటాలున లేచి యాతనిఁజూసి, "మహాభాగా! రక్షింపుము, అనాథను" అనెను.

"వనితా! భయపడకుము. ఇంకను చాళుక్య రాజ్యలక్ష్మి ధర్మావలంబనమున ననాథ కాలేదు."

ఆ ప్రచ్ఛన్నవ్యక్తి వికటాట్టహాస మొనరించి "అంతేనా! నీచేతఁగాదా! కలహము నీపనికాదా! పాపము మాఁరాజ్య రమానాథుఁ డింతటివాఁడా!" అని పలికెను.

"వాచాటా! ఊరకుండుము. ఎవరక్కడ వామనా! హరిహరా! రండు రండు."

"ఇరువురేనా! ఇంకను నలువుర, కాదు పదుగురఁ బిలువుము. పిఱికిపందా!"

అంతలో కవాటమును ద్రోసికొని బలిష్ఠకాయు లిరువురు కృపాణపాణులై లోనఁ బ్రవేశించిరి. వాసంతికను వెనుకకు ద్రొబ్బి యా వనకేసరి కరవాలమును ఝళిపించెను. రంధ్రములనుండి యగుపడు నయనములు నిప్పుకలఁ గ్రక్కు చుండెను.

ఖడ్గముల సంఘట్టనారవంబు వనకేసరి స్వప్నజనిత తన్మయతనుండి వాసంతికను మేల్కొల్పెను. వామనుని కర వాల మెగిరిపోయి శయ్యాదాపుననుండు విజయాదిత్యు కరము పైఁబడెను. అందులకాతఁడు బాలునివలె కెవ్వున కేఁక వైచెను. వనకేసరి వామనుని పదతాడనమునఁ గ్రిందపడవైచి, హరిహరునిఁ దగిలెను. వారిరువురు కొంతవడి పోరాడిరి. కరవాల ప్రచాలనమున నసమాన చాతురీ ధురీణుఁడగు వన కేసరి వానిఁ గాయపఱచెను. అంత స్వేదబిందు సందోహ

పరివ్యాప్త కపోలుండగు విజయాదిత్యునిబట్టి వాసంతిక కడకుఁ గొనివచ్చి క్షమింప గోరుమనెను. బలవంతముపై నా రాజనామధారి యటు లొనరించెను.

వనకేసరి చటాలున గదిని బాసిపోయెను. వామనుని వాని వెన్నాడఁదెల్పి చాళుక్యపతి యాగదిని వదలెను. గాయంబునఁ గాయంబువివశంబయిన హరిహరుఁడు కొలఁది కాలమునకుఁ బిదప నటనుండి తొలగింపఁబడెను. వాసంతిక మాత్రము విచారానందములలో దేని బొందవలయునని యాలోచించుచు కూర్చుండెను.

తృతీయ ప్రకరణము.

మదాలస రూపవతియని చెప్పియుంటిమి. ఆయమ వివాహమగునప్పటికి, యశోకాయమున నేఁటికిని జీవించి యుండు రాజరాజ విష్ణువర్ధనుఁడు బ్రతికియుండెను. సారంగధరుఁడప్పటికి పదునెన్మిది వత్సరములవాఁడు. ఆయమ హృదయమునంజాతనిమూర్తి చిత్రింపఁబడియుండినది. వాసంతికను బాలె యామెను రాజరాజు మోసగించెనందురు. కాని యది విశ్వసనీయముకాదు. సోదర వాత్సల్యమున నటు లొనర్చి యుండినను దోసమున సాహసమగును. ప్రథమకళత్ర వియోగము ననుభవింపలేకుండిన విజయాదిత్యున కంతటి రూపవతిని సమకూర్చినగాని మనోవ్యాకుల మడంగదని యాతఁడొకవేళ తలంచియుండును. ఎట్లైననేమి? మదాలస

యిపుడు రాణియైనది; సంతసములేదు; భర్త్రుతిరస్కృత ప్రణయయగు టంగులకు నిమిత్తముకాదు. దినదినమున కభివృద్ధియగు మనోవికార మందులకుపూట. కర్మభూమి యందు జనించి, పూర్వజన్మకృత కర్మ పరిపాక సమాసాదిత భర్తవలన ఆహ్లాదము పొందకుండు టామెలోపమే. అది యొక్క[illegible]యేకాదు. అధికారవాంఛ యామెకడ సంపూర్ణ ముగఁ గలదు. భర్త మనోదార్ఢ్యములేని వాఁడగుట నతని (వేలిపై) దిప్పుచుండెను. నారాయభట్టు సమీపమున లేనపు డాబిడనాథునిపై సంపూర్ణాధికారము కలదగుచుండెను ఎంద ఱామె కృపవలన నున్నతోద్యోగములు నందిరో దైవమున కెఱుక. ఎందఱుకోపమునకుఁ బాత్రులై యేదోగతి నందిరో తెలియదు.

మదాలస విచిత్రాంబరముల ధరించుటయం దాసక్తి కలది. ఒకదినము ధరించిన యంబరముల, భూషణముల రెండవనాఁ డామె ధరింపదు. అందువలన నామె చిత్రాంగి నాఁబడుచుండినది. మహామంత్రి తన యేలికతో ప్రసంగించునపుడు, చిత్రాంగీదేవియనియే వ్యవహరించు చుండును. ఇఁక రసికాగ్రణి రాజపుంగవుఁడు మదాలసయని యేలపిలుచును ?

చిత్రాంగి కాదు-మదాలస తన పేరు మాఱుపేరు సార్థకమగునటు చిత్రించుకొని యరుణోదయము కాకమునుపే పురోద్యానవాటిక చేరం జనెను. ఆయమ పుష్పాపచయ వ్యాజమున పోవుచుండుటలేదని మాత్రము చెప్పవచ్చును.

రాజపత్ని యచటు చేరునప్పటికి బాలభానుఁడు నిజకరములచే బ్రకృతిని వియోగ జనిత తాప విదారకముగ స్పృశించుచు దరహాస మొనర్చుచుండెను.

ఆమె పద్మాకరమును డాయునప్పటి కొకయువకుఁ డార్ద్రవస్త్రముల వదలుచుండెను. ఆ తలోదరి యొకవిశాల వృక్షముమాటున దాఁగెను. ఆ యువకుఁడు సముచితముగ నలంకృతుఁడై యొకతరువు నాశ్రయించి యప్పుడుదయించు బాల భానునకు స్వాగత గీతమును వేణువుపైఁ బాడ నారంభించెను. వచ్చిన కార్యము మాని మదాలస నిలచి పోయెను. గానవిద్యాసౌలభ్య మెఱింగిన యాబిడ తన్మయ యగుట వింతకాదు.

అటు నొకటి రెండు గడియల కాలము గడచి పోయెను. ఆ మురళీనినాదమును కుసుమతతిజనిత సౌగంధావహారియగు గంధవహుఁ డుత్సుకతతో నాతురతనందనివాఁడై మోసికొని పోవుచుండెను. దానిఁ జాల దూరము గొని పోయెనో, నడుమన వదలివైచెనో విచారించు నవసరము మనకెందులకు ?

మదాలస యిటు సారంగధరునితో మాటాడు జతన మున నరుదెంచి గానమునకు ముగ్ధయై నిలిచి పోయిన దినము లసంఖ్యాకము లనఁజెల్లు. ఈనాఁడు కార్యసాఫల్యము కానిది వెడలిపోవ నాబిడ సంకల్పముకాదు. మఱియొకసారి ముందున కడుగిడెను. ఆచార్యున న్నుపకృత ప్రార్థనాశ్లోకము

నొండతఁడు మధురముగ పాడ నారంభించెను. దాని వినుచు మరల వెనుక కేఁగెను. పదిపదునైదు విగడియల కాలము గడచి పోయెను. ఎట్టకేల కతఁడు తాళపత్రగ్రంథమును గైకొనునప్పటి కతని దృష్టిపథమున నామె పడెను. ఆ యువకుఁడు చకితుఁడై నిలచి, "జననీ! నమస్కారము. వనవిహారమున కరుదెంచితిరి కాఁబోలును" అనెను.

మదాలస మనోహరముగ నవ్వెను. ఆయమ హాసము నకుఁ గారణ మెఱుంగని సారంగధరుఁడు మందహాసమున మోముదామరను మఱింత దర్శనీయ మొనరించుకొనెను. ఒక నిముసమునకు పైగా నటుగడచిన మీఁద నాయువకుఁడు ప్రశ్నాదృక్కులతో "ఏలనవ్వుచుంటిరి?" అనెను. మదాలస నవ్వాపుకొని దరహాస జ్యోత్స్న ముఖేందు మండల మరీచి జాలముగ బర్వుచుండ "సారంగధరా! సమవయస్కుఁడగు నన్నటు ప్రబోధించుట విపరీతముగఁ దోఁచినది" యనెను.

"వయసిందు కారణము గాదు."

"పాండిత్యమా!"

"కాదు. పితృవ్యపత్నీత్వము"

"ఆఁ.......అటులనా మీ పినతండ్రిపై నీకంత గౌరవమా?"

"రాజచంద్రుని సతి యింతటి ప్రాతఃకాలమున నిదుర మేల్కాంచుట చళుక్యరాజ్యవృద్ధికిఁ గారణమను కొందును"

"భవిష్యన్నృపతి యరుణోదయమున మేల్కాంచుటో"

"జననీ! నాకు రాజ్యవాంఛ లేదు."

"అదేల? విక్రమసిం......" అని నాలుక కఱచుకొనియెను.

"విక్రమసింహుఁడు మా పినతండ్రిని తొలగింపఁ గోరుచున్నాఁడు గాని జననీ! నాకది యిష్టములేదు. మా పినతండ్రి కొన్ని విషయములం దన్యాయముగ ప్రవర్తించుచుండినను మీ సామర్థ్యాదికములఁ జూచియూరకుంటిని."

"ఎంతయుఁ గృతజ్ఞురాలను. సారంగధరా! నా సామర్థ్యమును జూచియేనా?"

"అవును నిస్సందేహముగ"

"పోనిమ్ము. మొన్న మీ పినతండ్రికి వాసంతిక విషయమున బుద్ధిసెప్పిన దెవరు? నీవు కాదా?"

"వాసంతిక యెవరు?"

"పల్లవరాజతనయ. నీకు పత్నిగ రప్పింపఁబడిన సుందరాంగి."

"మీరే పిలిపించితిరా?"

"ఏవరైన నేమి? మీ పినతండ్రి ననుచరులతో శిక్షించినది నీవే కాదా! నిజము దెలుపుము"

"నేనే! పినతండ్రినే! శిక్షించుటయే! మీరు విశ్వసింతురా?"

"అటు లొనర్చుట విశ్వసించుటటులుండ సమ్మతింతునుగూడను."

"మీకు సమ్మతమైనచో నదిధర్మబద్ధమై యుండును. ఆ విషయము వినఁదగినదైన చోఁ దెలుపఁ గోరెదను."

"ఏమియున్నది. వాసంతిక రూపమునకు ముగ్ధుడై యతఁడు బలవంతపఱుపనుండ ప్రచ్ఛన్నవ్యక్తి యాతనిని శిక్షించెను. అయ్యది నీవచేసియుందువని నే నానందించితిని"

"మీ యానందమునకుఁ బాత్రుడ కానందులకువిచారించుచుంటిని."

"సారంగధరా! నిజము. నాయానందము నభిలషింతువా?"

"జననీ! మీ యానందమే నాకు వాంఛనీయము"

"ఆ సంబోధనము మానుము. నను చిత్రాంగీ యని సంబోధింపుము."

"పాపము శాంతించును గాక! నానోట నటులెన్నటికిని రాఁజాలదు."

"అది నాయానంద కారణమైనచో"

రాకొమరుడు నిరుత్తరుడయ్యెను. అతనికామె ప్రకాశిని చిత్తవృత్తి సరిగా బోధపడకపోయెను. ఒక్కొక్కప్పు డామదాలస తనను జూచిన చూపులు స్మృతిపథమునందు రానతడు చకితుడై పోవుచుండెను. ఒకంత యవగాహనమైనంత నతఁడు తన యూహ నిరాధారమని తలంచెను. ఎటులేని యామె హృదయము గనుగొన వాంఛలేని వాఁడగుటనతడు సంభాషణాధోరణిని మార్పఁ దలఁచి "మాతా! కుసుమా

పచయమునకు వచ్చితిరి కాబోలును గందు, రమ్యములగు సుమజాలమును సేకరింతము" అని పలికెను.

"సారంగధరా! నను సంతుష్టి పఱుప నంతగ యత్నింపదలంతువేని సునాయాసముగ —"

"అటుచూడుఁడా పుష్పము భ్రమరము సమీపించియు వదలిపోవుచున్నది."

"అది సంపెంగ"

"మధుకరాంగనల కది భోగబాహ్యముగదా!"

"సారంగధరా! నీయూహ గంభీరమైనది."

"అందలి గాంభీర్యమును గనుఁగొనఁ గలిగిన మీశక్తి ప్రశంసాపాత్రము."

"మీయభిప్రాయ మంతియేనా?"

"మీరు గ్రహించితిరికదా!"

"సారంగధరా! ఒక యనాగరికుని కడ ననుభవయోగ్యమగు నట్టిదియు, వాని కెఱుకపడని నట్టిదియు పదార్థము, కాదు సుమ మున్నదనుకొనుము. దానిఁగొని యథాస్థానమునం దుంచుట రసికునకు గర్తవ్యము కాదా?"

"జననీ! అదేటిమాట. రసికుఁడు వివేకి కావలయు. తన కలభ్యమగు సుమముపై విరక్తి బూనవలయును. ప్రాప్త లాభమును మించి యభిలషించువాఁ డవివేకి."

"నిజముగ బ్రాప్తలాభమును మించిన దనుకొను వస్తువు సులభసాధ్యమైన"—

"దానిపై వాంఛయే లేకుండిన"—

" వాంఛలు కోసివేసికొన వలసినంతటి యావశ్యకత మేమి? మన మేమి కందమూలాదికముల జీవించువారలము గాదుకదా!"

"పోనిండు. ఇపుడా కాకదంత పరీక్షతో నవసరమేమి?"

" నేనుండుస్థితియందే నీవుండిన-సారంగధరా! ఇటుల నీవు విచారింపుము. అసువులైన నీకొఱకు నర్పింపసిద్ధపడి యుంటిని."

" జననీ! మీరిటు నను విషమ పరీక్షయందేల యుంతురు?"

" విషమశరపరీక్షకు లోబడిన నేనేమిచేయను?"

" మీరిటు లాడరాదు"

అతఁడచటు బాయనుండ నాపి,

" సారంగధరా! ఇటువినుము నీ యాకృతిని"

" అమ్మా! వలదెందుల కీ వ్యర్థప్రసంగము. వాచా దోషమే యమయాతనల నొసంగును. దుర్వాంఛ మొదటనే రూపుమాపుట సమంజసము."

" ఇది నేఁటివాంఛ కాదు. వత్సరద్వయ మిది నన్నున్మత్తను గావించినది. ఇక నాపరానిస్థితి కరుదెంచితిని."

" అమ్మా! దాని కొక సదుపాయముకలదు. నా యందలి లోపముల మీరు గ్రహింపుడు. ఏవగింపుగలుగు నుపాయము వెదకుఁడు."

"అది సాధ్యమా! సారంగధరా! సోమునికడ నైన లోపము గలదుగాని నీకడనున్నదా! అయ్యో! అదియే కదా! నా యీ మనోవ్యథకుఁ గారణము."

"తల్లీ! క్షత్రవంశ సంజాతుఁడనై పిఱికి పందనై యుంటిని కదా! చాలదా!"

"అదానికి భూతదయ కారణముగదా! ఓయీ! రూపాతిశయ నిమిత్త యువతీ హృదయ చోరా! ఏల యేచెదవు?"

"అమ్మా! అమ్మా! వల దూరకుండుము. ఆవాంఛ నణచి వేయుము."

"నాకు సాధ్యము గాదు."

"తల్లీ! ననుక్షమింపుము." అని యచటు బాసి వెడలి పోయెను.

చతుర్థప్రకరణము.

రాజమహేంద్ర వరమునకు పది క్రోసుల దూరమున నొక పర్వత మున్నది. అయ్యది దుర్గమారణ్యములతో నిండి యుండినది. ఆగుట్టపై నొక కాళికాలయ ముండినది. అట నరబల్యాదులు రహస్యముగనో బాహాటముగనో జరుగుచుండినవి. విజయాదిత్యుని ప్రభుత్వ మారంభమైనప్పటినుండియు నా యరణ్యము రక్ష సింహుఁడను చోరనాయకుని యాధీనము నందుండినది. రా

మహేంద్రవరము నుండి కళింగదేశమందలి మహేంద్రగిరికిఁ బోవు మార్గమున పథికులు ధన, ప్రాణములఁ గోలుపోవు చుండిరి. ఎటులైననేమి ? రత్నసింహాసనము వేంగిదేశమున నాబాల వృద్ధమున కెఱుకయై యుండెను. ఆంధ్రప్రభువు వాని నడంప నెట్టి యత్నములుగాని చేసినటులగుపడదు.

ఒకనాటి ప్రాతఃకాలమున నైదాఱు గడియలకుసరి కాయడవియందలి యొక విచిత్రప్రదేశమున నొకజనసంఘము విడిసెను. వారు ప్రయాణీకులు గారు. అది వనభోజనమున కరుదెంచిన విజయాదిత్యుని సంఘము. అందు మదాలస వాసంతికా ప్రభృతులగు స్త్రీజనమును సారంగధర ప్రభృతులగు రాజవంగడము వారు నుండిరి. వారిసంఖ్య యిరువదికి పైగానుండును. పరిజనలోక మేబదిమందియు, రథము లశ్వములు నుండినవి. నిర్జనమగు నా ప్రదేశము జనుల కల్లోలముతో నిముసమాత్రమున నిండిపోయెను. రాజ బంధువులగు పురుషులు ప్రకృతినిర్మిత కాసారమున స్నాన మొనర్చుటకో, విలునంబులఁగొని క్రూరమృగ విదారమునకో బయలు దేఱిరి. సారంగధరుఁడు విశాలమగు మావి వృక్షమునఁడాసి నూతనవేణువు నూద నారంభించెను. పరిజనులు నిజ కర్మలందు నియుక్తులై యుండిరి. మహారాజు విజయాదిత్యునికై యొకరిద్దఱు వేచియుండిరి.

రాజాంతఃపురజనము మఱియొక కాసారమున, సేవకులచే పరిశోధింపఁబడి, జలకేళికై వెడలిరి. కాని

యూ కార్య మారంభింపఁబడ లేదు. మదాలసా వాసంతిక లడవి జాతి సుమముల సేకరించు వ్యాజమున వెడలిరి. వారల నెమకుచు నితర స్త్రీజన మిటునటు తిరుగుచుండెఁ వాను సహారిహారులు పురినుండి యరుదెంచి మహారాజుగారు రాజ కార్యపు టవసరముబట్టి రావీలులేదని తెలిపిరి. అటునుండినది పరివార మేయగుట విచారము కాని, యానందము కాని వ్యక్తపడద య్యెను.

సారంగధరుడేదియో పద్యమును బ్రకృతిపై గాఁబోలు రచించుచుండెను. అంతలో వెనుక నేదియో శబ్దమయ్యెను. అతఁడు చకితుఁడై వెనుదిరిగెను. వనలక్ష్మి ద్విరూపయై వచ్చెనా యని నటుల మదాలసా వాసంతికలట ప్రత్యక్షమైరి. సారంగధరుడు తెచ్చికోలు దరహాసముతో వారలకు చూపులతో స్వాగతమొసంగెను. వారాతని డాసి యొక యున్నత శిలపై నధిష్ఠితలైరి.

“సారంగధరా! మొన్నటిదిన మటు హుటాహుటిని వెడలిపోయితివి. నీ వేణువు నటనే వైచి వెళ్లితివి. అది నీకొసంగ నీనాలుగు దినములనుండి యత్నించితిని గాని ఫలము లేకపోయెను.”

“మీ రద్దానిపై గాన మొనర్తు రనుకొంటిని. మీకడనే యుండనిండు. నే మఱియొకటి జేసికొంటిని.”

“అయిన నిది నేనే గైకొందునా?”

“నే ధన్యుఁడనని తలంతును.”

"రాకొమారా! నను సంతోషపఱుప నెందులకింత యత్న మొనరించుచుంటివి?"

"తల్లుల సంతృప్తిపఱచుట పిల్లల బాధ్యతకదా!"

"అబ్బా! మరల నా దండకమే? ఇదిగో వాసంతిక! నీ వానాడు రక్షించిన దీ సుందరాంగినే!"

"నా కెందులకా ఘనత. రాకుమారీ! మా పిన తండ్రిని వరింపని కారణము?"

వాసంతిక లజ్జావనతవదనయయ్యెను. ఆయమ సారంగ ధరుని తనివితీర జూడ గలిగి నందుల కెంతయేని సంతోష పడుచుండినది.

"రాకుమారా!"

"తనయా! యనుడు నా కెంతయు సంతసముగలుగును"

"సారంగధరా! నీతో మాటాడ నెంచిన నన్నెందుల కిటు లవరోధించెదవు?"

"నే నవరోధించుటే! మాతా! అదేటిమాట. మీ సంభాషణమున కే నెపుడు నెదురుచూచుచుందును.

"అది యుండనిమ్ము. నీ పినతండ్రి కెందరు భార్య లుండవలయునని యెంతువు?"

"ఎందరేని యుండవచ్చును."

"ఎందులకు?"

"రాచకార్యముల నిమగ్నులగువారి కనేక ప్రియ లుండుట మనశ్శాంతికరము."

“అందులకొక గ్రంథమును వ్రాయకపోయితివా ?”

“తండ్రిగారి యాజ్ఞయైన నటులే యొనర్తును”

“నీవెందఱ వివాహమాడుదువు ?”

“అమ్మా! పితృకిపందకు వివాహమెందులకు ?”

“ఎవరని” మృదుమధురముగ వాసంతిక యొక క్రగంటిచూపు విసరుచు ననెను.

అందులకు సారంగధరుఁడు దరహాసముఖుడై

“రాకుమారీ! పురమందెవరినడిగినను తెలుపుదురు.”

“రాకొమరునకు సేన, సేనాని సహాయముండ నేమి కావలయును ? రసికత యువతీ, మానసాపహరణక్షమంబగు సౌందర్యగరిమ యుండవలయును.”

సారంగధరుఁడు బిగ్గఱగ నవ్వి “అమ్మా! ఏమి మీ వాత్సల్యము ? నన్నెటులేని గొప్ప సేయుచుంటిరి. మీరు తెలిపిన రెండుగుణములు శత్రురాజుల నెదిరింపఁజాలవు.”

“అమ్మా! యను సంబోధన మొక్కటి యాపివేయరాదా ! నిను వేడుకొందును.”

“అయ్యది విధేయతను జూపదా” అని వాసంతిక మరల యొక హాసముతో ననెను. మదాలస తీక్ష్ణవీక్షణమొకటి బఱపెను. రాకొమరుఁడది చూచియు జూడనటులుండెను. మదాలస యేదియో పలుక నోరుదెఱచెను.

అంతలో బలువు రబల లఱచినటు వినబడెను. ఆముగు రటుచూడ నొక స్త్రీమూర్తి నీటిపై కరుదెంచి మరల

మునిఁగెను. రాకుమారున కదేమని గోచరించిన మాత్రమున తటాలున వారల వదలి పఱువిడి యా కాసారమునందుఁ జొచ్చెను.

ఆతఁడు మునిఁగి పదునైదు నిముసములు గడచెను. బుద్బుదచయ మొండె యాజలోపరిభాగమునఁ గాన్పించుచుండెను. ఆవలిభాగమునందలి స్త్రీజనమును నీవలి రాజపుత్రికాద్వయమును నిశ్చేష్టులై నిలచియుండిరి. మదాలస దృఢాంగియు, ప్రౌఢయు గాకపోయినచో మూర్ఛిల్లి యుండెడిదే! వాసంతిక తీరమునఁ గూలఁబడి యుండినది. ఆమె ముఖము తెల్లబాఱియుండెను. ఆ గుండెల దడ యొట్టి వారికేని విననగుచుండెను

అంతలో నా రాకుమారుఁ డా నీటమునిఁగిన బాలికను నడుముబట్టుకొని యెత్తి యొకింతవడికి శిరమును నీటిపైకిఁ బెట్టి వాయువును నాసికారంధ్రములనుండి తీసికొని యచేతనయగు బాలికను మూఁపునఁ ధరించి యొకచేత నీదుచు నా స్త్రీజనమున్న వైపునఁ గేఁగెను. వాసంతిక నయనములు త్రేజితములై పోవుచుండెను. మదాలస యానందము వర్ణింపరానిది. వాసంతిక యటపడియుండిన వేణువునుగొని ముందా తీరమునుఁ గూర్చి పరుగిడ నారంభించెను. మదాలస నీటదుమికి యాతీరమును ముందుగాఁ జేరెను. రాకుమారుఁడు "మీరటుచేసియుండరా" దని యా యచేతనయగు బాలికను సచేతన నొనర్ప యత్నములు సేయుచుండెను.

ఇంతలో వాసంతిక రోజుచు నట కరుదెంచి "రాకుమారా! ఇది మా దేశమున భీరువులొనర్చుపని కాదు" అనుచు మనోభావమునంతయు వెడలఁగ్రక్కెను. ఆ బాలిక యొక్కింత చైతన్యముఁ బడయునంతలో నశ్వముల డెక్కల శబ్దము విననయ్యెను. వారిజాక్షులు వారిజములఁ బోలు ముఖములటుద్రిప్పిరి

నిసిత కరవాల పాణులగు ననుచరులతో రత్న సింహుఁడు సాక్షాత్కరించెను. అతఁడు భీకరాకారుఁడనిన చాలదు. ముఖమంతయు శ్మశ్రుపరిశోభితమై యుండెను. పై పెదవి చిన్నదగుటవలన దంతము లగుపడుచుండినవి. విశాలమగు వక్షమునకు శార్దూలచర్మము కట్టబడియుండెను. తలపాగయు, కట్టుబట్టయు, రక్తిమములై యుండినవి.

వాని యనుచరు లిరువదిమంది యుండిరి. వారును రక్తాంబరధారులై యుండిరి. వారిఁ గాంచినంత నార్ద్ర వస్త్రము లనియైన గణింపక రాకుమారుఁడు కెవ్వన నఱచి యటనుండి పలాయితుఁడయ్యెను. వానివెన్నాడ నిరువు రాశ్వికులు వెడలిరి. కాని యాతఁడొక యున్నత ప్రదేశమునుండి దొరలినటులఁ జూచి యసువులఁ బాసి యుండునని తమ నాయకునితోఁ జెప్పిరి. ఆ మదవతుల యలబలము కాని చోరుల యమానుష క్రూరతగాని వర్ణింపనేల? వారిజాక్షుల నందఱ బంధించి యశ్వముల నెక్కించి వారు ప్రక్కన నడచుచుండిరి. వారు బంధితులై వృక్షములకుఁ గట్టబడిన

చళుక్య పరివారమును సమీపించినంతన మదాలస విషయ మును గ్రహించెను.

"ఓరీ! నన్నెవరినిగాఁ దలంచితివి. తక్షణమె మము విడువకుండిన సైన్యసహాయ మింతలో నరుదెంచి నిను మట్టుపెట్టును" అని గంభీరముగ, క్షాత్రవంశోచితముగఁ బలికెను.

రత్నసింహుడాపెను దరహాసముచే మరింతవికారముగు చూపుతోఁ జూచి "ఓరీ! అభీరుఁడగు రాకొమరుని యసువులతోఁగాని నిర్జీవునిగఁ గాని పట్టుకొనిరండని యట నొకచో విశ్రమించి బంధిత వనితాలోకమును కాముక దృక్కులతోఁ జూడ నారంభించెను. మదాలస మాత్రము రక్తారుణితనయనయై చుఱచుఱఁ జూచుచుండెను. ఇతరు లవనతివదనలై యుండిరి.

అటులొక పదునైదు నిముసములు గడచు నంతలో నైదారుగురు రాజబంధువులు పదుగురు చోరులచే బంధింప బడి కొనిరాబడిరి. బంధితులగు వనితలఁ జూచినంతవారి నయ నము లరుణములయ్యెను. బంధిత కిశోరము లేమి చేయగలవు! వారి పరుష భాషణము లాగకముందే మరల నశ్వపద ఘట్టనము విననయ్యెను.

అట నరుదెంచున దెవ్వరును గాదు. మన వనకేసరి. ఆ యున్నతాశ్వము నధిరోహించిన యా వీర పురుషుఁడు దర్శనీయుఁడై యుండెను. తూణీరద్వయ బాణాసన పరికల్పిత

సౌందర్యాతిశయాకృతి నటనున్న వనితాజన మొకపరి చూడఁజాల కుండలేక పోయెను. కరవాలము వెలుపలకుఁ దీయబడినదై వల్మీక వినిర్గతాశీవిషంబుబలె విరాజిల్లు చుండినది.

నయనముల నుండి యగ్నికణంబు లురల నతఁడు "ఓరీ! ఇంటిపట్టు జూచుకొని మొఱుగు గ్రామ సింహము నీకంటెను మేలుకదా? అబలలఁ బట్టగలిగితినని గర్వించితివి కాఁబోలును. నీచా! నీపై కత్తి నెత్తుటయు న్యూనత యనిపించెడిని."

రత్నసింహుఁడు ప్రత్యుత్తరము నోసంగఁ డయ్యెను. అటనుండి నిలచి ఖడ్గమును దెఱకెను. వనకేసరి యశ్వమునుండి దుమికి వాని కరవాలము నూడగొట్టెను. దృఢతరముగఁ బట్టుకొనిన కైదువెటు లంతలో నూడిపోయెనా యని విచారించు లోపల నా యువకుని ముష్టిఘట్టు తాకుట నా చోరనాయకుఁడు క్రింద పడియెను. కనుమూసి తెఱచు నంతలో వనకేసరి యితరులపై కేగెను. వారు సంసిద్ధులై యుండినను పరాక్రమాతిశయముగల నాయకునిపాటు చూచి నిర్వెఱనందియుండుటను వనకేసరి నెదిరింప సాహసింపరైరి. కాని యాతని కరవాలమునకు నిజకరవాల మడ్డు నొడ్డుటగాని, యందువలన క్షతగాత్రు లగుటగాని వదలని వారైరి. ముప్పదుగురు చోరులలో పదుగురు నేల నలంకరించిరి. పదుగురకు పైగా పలాయన మంత్రము పఠించిరి. రెండు గడియలకాలము గడచిపోయినది.

మిగిలినవారు రోష మంతకంతకు ముప్పిరిగొన నొక్కింత దీవ్రముగ ననువులపై నాసవదలి పోవుచుండిరి. రత్నసింహుఁడు చిన్నగా లేచి కరవాలహస్తుఁడై వెనుక పాటున నరుదెంచెను. మదాలసా వాసంతికలు హెచ్చరిక నిచ్చునంతలో వాఁడు బలముగ కరవాలముతోఁ గొట్టెను. వనకేసరి యొక కంట కనిపెట్టుచుండుట నా వాలుమీఁద పడఁబోవు నపుడు ప్రక్కకు దొలఁగి ఖడ్గపతన వేగమున వ్రాలిన వాని వీపును పిడికిట పొడచెను. చోరనాయకుఁడు క్రిందపడుచు తన పరివారములో నొకఁడు వనకేసరిపై విసరిన చుఱియ కంఠ సమీపమున గ్రుచ్చుకొన రక్తసిక్తాంగుఁడై క్రింద పడియెను. అప్పటికి జీవితముతో నున్న నలుగురు పరుగిడిరి.

రత్నసింహుఁడు వనకేసరిని జూచి యవసాన దశ వచ్చినదని తెలుపుచు తనకడ నుండిన యొక తాళపత్రము నొసంగెను. అయ్యది గాంచిన వనకేసరి స్తంభితుఁడై పోయెను.

"ధర్మదేవతా! నీవెటదాగితి" వని మదాలస కట్లను విప్పి యామెకాపత్రమునొసంగి యశ్వారూఢుఁడై యథేచ్ఛఁ జనియెను.

మదాలస మనోభావము వర్ణనకతీతమై యుండినది. ఆ మెయొకరిద్దఱకట్లనువిప్పి రాజధానిగూర్చి ప్రయాణము కా నాజ్ఞాపించెను. అంత నొకరిద్దఱు సారంగధరునకై వెదకి యొకగుల్మమునందు పంకిల శరీరుఁడై చిక్కుకొని యుండుట

గాంచి వడకెడు స్థితియందుగొనివచ్చిరి. అందఱును పయనము సాగించిరి. వాసంతిక చిత్రపటము నొకదానిఁజించి పారవైచెను.

ఇటఁ గథాధోరణి నాపి యాంధ్రదేశచరిత్ర నొకింత చదువరుల కెఱుక పఱుపవలసిన బాధ్యత యున్నది. ఆంధ్రదేశచరిత్ర సమగ్రముగ లేదు. అందు చాళుక్యులు కాకతీయు లాంధ్రావని నాక్రమించు నంతవఱకును పాలించుచుండిరి. వీరేడవ శతాబ్దాదినుండి పదుమూడవ శతాబ్దమధ్య కాలము వఱకును మనభూమినిఁ బాలించిరి. వీరినిగుఱించి యెఱుంగుటకుముందు వీరికి మూలపురుషులగు పశ్చిమ చాళుక్యుల గుఱించి కొంత తెలిసికొను టవసరము కాదు.

చాళుక్యులు చుళుకమునుండి పుట్టినవారగుట నటు పిలువఁబడిరట. వారు నాలవ శతాబ్దమున ప్రస్తుత బొంబయి రాష్ట్రమందలి యుత్తరభాగమును నైజాము రాష్ట్రమునందలి కొంతభాగమును నాక్రమించియుండిరి.

రాజపుత్రస్థానము నందలి రాథోడులు వింధ్యను దాటి చాళుక్యుల రాజ్యపరిసరముల కధికారులై యుండిరి. వీరు క్రీస్తుశకారంభము నుండియే వచ్చియుండిరని చరిత్ర చెప్పుచున్నది. వీరైదాఱు శతాబ్దములలో చాళుక్యులను సామంతులుగ నొనర్చుకొని యుండిరి. సామంతులైన చాళుక్యులు వాతాపినగరమునందుండిరి. రాథోడులు రాష్ట్రకూటు లనఁబడుచు మయూరఖండిని ప్రధానపట్టణముగ నేర్పఱచుకొని యుండిరి. ఇది ప్రస్తుత నాసికమండలమునందుండినది.

క్రీ. శ. 550 ప్రాంతములం దీ రాష్ట్రకూటు లుత్తర హిందూస్థానము నందలి రాఘులతో కలహించుటంబట్టియు నంతః కలహముల నందియుండ, నిజ రాజ్యమును బోగొట్టుకొను స్థితియందుండిరి. అట్టిచో వాతాపియందుండిన జయసింహుఁ డదను నెఱిగి పౌరుషాతిశయమును బ్రకటించి సర్వరాజ్యమును లోఁబఱచుకొనియెను. ఇతని తనయుఁడు కీర్తివర్మ జనకుని విజయముల సంపూర్ణమొనర్చి చాళుక్య రాజ్యము సుస్థిరమొనరించెను. ఈభూపాలుని యనంతరము ప్రథమ పులికేశనుఁడు రాజ్యభారము వహించెను. ఇతఁడు సత్యాశ్రయాది బిరుదములవహించి పెక్కు ప్రదేశముల చాళుక్యరాజ్యరమ వీక్షణములోనికిం దెచ్చెను.

క్రీ. శ. 567 ప్రాంతమున కీర్తివర్మరాజై చతుర్వింశతి వత్సరములు ధరాపాలన మొనరించి యుత్తర కొంకణా కర్ణాటకదేశముల దన యాతపత్రమునకు లోఁబడఁజేసెను. ఇతని యనంతరము దురాశాపీడితుఁడగు మంగళేశుఁడు రాజ్యము నాక్రమించెను. ఇతడు పరాక్రమవంతుఁడు. పెక్కు యుద్ధములొనరించి యశము నొందెను. తదనంతరము క్రీస్తు శకము 611-34 వఱకును చాళుక్యరాజ్యరమ పరాక్రమశాలి యగు ద్వితీయ పులికేశి యధీన యయ్యెను. ఈతడు చక్రవర్తినా బఱగెను. వనవాసి రాజధానిగనేలు కాదంబు లను లోఁబఱచుకొనెను. గాంగులు, అలుపులు కప్పముగట్ట నొప్పుకొనిరి. కొంకణము మాళవ ఘూర్జరముల నితడు జయించెను. శ్రీహర్ష సార్వభౌము నర్మదాతీరమున నోడించి

యశోవిరాజితుఁడయ్యెను. ఇతఁడు దా నందిన విజయములతో దృప్తినందక పల్లవుల జయించి వేంగీదేశము నాక్రమించెను. ఆ నూతన సంపాదిత భూమికి తన సోదరుఁడగు కుబ్జ విష్ణువర్ధనుని క్రీ. శ. 612 సంవత్సరమున బౌద్ధుల యధీనమున నుండు వేంగీపట్టణమున నిలిపెను.

కాని పల్లవులు వేంగీదేశమును గోలుపోయినందునఁ గలిగిన యవమానమును సహింపలేక నరసింహావర్మ నాయకత్వమున వాతాపి నాక్రమించి దాని దహించివైచిరి. రాజాధిరాజ పులికేశి మరణించెను.

అటు తరువాత చళుక్యప్రభువులు క్రీ. శ. 750 వఱకును పల్లవులతో బోరుచునేయుండిరి. జయాపజయములు క్రమముగ కలుగుచునే యుండెను. కీర్తివర్మ యుద్ధముల వలన బడలినవాఁడై సేనానులలో సమర్థుఁడు రాష్ట్రకూట వంశస్థుఁడునగు దంతిదుర్గునకు నధికారమొసంగుట నాతఁడు సమయ మదియని చాళుక్య రాజ్యమును స్వాధీన పఱచుకొనియెను.

సోదరుని మరణానంతరము వేంగీదేశ పాలకుడగు కుబ్జ విష్ణువర్ధనుఁడు స్వతంత్రుఁడయ్యెను. అప్పటినుండియువీరు పూర్వ చాళుక్యులనియు, పశ్చిమ చాళుక్యులనియు వ్యవహరింపబడుచు వచ్చిరి. కుబ్జవిష్ణువర్ధనుని సంతతివారు రాష్ట్రకూటు లొనర్చిన యన్యాయమునకు పలుమారు దండెత్తి వారి నోడించిరిగాని తమవారి యౌన్నత్యమును ప్రతిపాదింప

జాలకపోయిరి. రాష్ట్రకూటులు రెండున్నర శతాబ్దముల రాజ్యపాలనమును నిరంకుశముగ సాగించిరి.

పంచమ ప్రకరణము.

క్రీ. శ. 977 ప్రాంతమున మొదటి జయసింహునివలె తైలపుఁడను శూరశిఖామణి చాళుక్యరాజ్యమును మరల స్థాపించెను. గుజరాత మొకటియే యితనికి లోఁబడలేదని చెప్పెదరు. మాళవము నితఁడు జయింపఁగోరి తద్రాజ్య రమానాథుఁడగు ముంజునితో పోరి యోడిపోయెను. దైవోపహతుఁడగు నా ముంజభూపతి నది నుత్తరించుచుఁ జిక్కి మరణించెను. అంత నితనికి ప్రాగ్భాగమందలి చోళులతో విరోధము పొసఁగెను. ఇతనికిఁ బిదప నరుదెంచిన సత్యాశ్రయుఁడు విక్రమాదిత్యుఁడు జయసింహుఁడును చోళులతోఁ బోరాడుచునే యుండిరి. జయసింహుని కుమారుఁ డాహవమల్లుఁడు 1040-69 వఱకును చళుక్యులఁ బాలించుచు చోళదేశము నేలు రాజాధిరాజుతో వైరమూని యుండెను. ఇతనికి సోమేశ్వరుఁడనియు విక్రమాదిత్యుఁ డనియు నిరువురుతనయు లుండిరి. వీరిని గుఱించి ముందు వ్రాయబడును, గాన పూర్వచాళుక్యుల గుఱించి కొంత తెలిసికొందము.

పైఁ జెప్పినటుల కుబ్జవిష్ణువర్ధనుఁడు మూలపురుషుఁడుగ నేర్పడిన పూర్వచాళుక్యులు రాష్ట్రకూటులతో విరోధము

కలిగియుండిరి. వీరికి పల్లవులవలన బాధయంతగ లేకుండినది. ఉత్తరమునం దుండిన కళింగులతోఁ గూడ వీరు మైత్రి పాటించుచుండిరి. అందువలన నూతన స్థాపితమగు చళుక్య రాజ్యము సుస్థిరమైపోయెను. వీరు వేఁగీదేశమును వేంగి పట్టణము రాజధానిగ నొనర్చుకొని పాలింపసాగిరి.

కళింగమందలి కొంతభాగము వీరికిప్రాప్తించుటం బట్టి పదునాఱవనృపతి అమ్మరాజు విష్ణువర్ధనుఁడు రాజధానిని మార్చెను. క్రీ. శ. 918-25 వఱకును బాలించిన యీతఁడు రాజమహేంద్రుఁడను బిరుదమును గాంచియుండెను. అద్దాన గోదావరీతీరమునందు నూతనముగ నిర్మితమైన పురము నకు రాజమహేంద్రవరమని పేరిడిరి. అప్పటినుండి క్రీ. శ. 1072 ప్రాంతము వఱకును పూర్వచాళుక్యుల కిది రాజ ధానియై మహావైభవోపేతమై యుండినది.

పశ్చిమచాళుక్యులు మరల నున్నతస్థితి కరుదెంచిన పిదప పల్లవులతోఁ గలహించుటమాని చోళులతోఁ బోర నారంభించిరి. ఆసమయమునందు పూర్వచాళుక్య నాయకుఁ డును నిరువదియొకవ రాజునగు కీర్తివర్మ (1003-1015) చోళనాయకుఁడగు రాజరాజుతో సఖ్యమొనర్చెను. అందు వలన చోళులు పశ్చిమచాళుక్యుల నోహటింపవెనుదీయరైరి. మన పూర్వచాళుక్యుల వర్తకవిషయమునందు ముందంజ వేసిరనుట ఆసాము, అరకాను దేశములందు వీరి నాణెములు లభించుటయె ప్రబలసాక్ష్యము నొసంగుచున్నది. ఈకీర్తివర్మ బంగారునాణెము లట గనుగొనఁబడినవి.

కీర్తివర్మ తన సోదరుఁడగు విమలాదిత్యునకు రాజ రాజు తనయను కుండవాంబాదేవిని వివాహ మొనర్చెను. అద్దాన నీరెండురాజ్యములు దృఢతరమైత్రి కలవై యుండెను.

వీరిరువురకు మధ్యనుండు పల్లవులు విరోధభావము నూనక సౌమనస్యతతోఁ గాలము గడుపుచుండి, ఒకవేళ నిట్టి సంబంధము నభిలషించి యది వ్యర్థమగుటను గాబోలు పశ్చిమ చాళుక్యులు చోళులతో గలహింప మానరైరి. ఏదియెట్లున్నను చోళపతితనయను విమలాదిత్యుఁడు వివాహ మాడబట్టియే మన యాంధ్రభారత కృతిపతిజన్మ మాంధ్ర దేశమునం దయ్యెను. విమలాదిత్యుఁడు తన మామగారి నామమును దనయునకుఁబెట్టెను. అందువలన నతడు రాజ రాజ విష్ణువర్ధనుఁడనియు, రాజరాజ నరేంద్రుఁడనియు వ్యవ హరింపబడుచుండెను. ఇతని సోదరుఁడు విజయాదిత్య విష్ణు వర్ధనుఁడు. అతని పరిచయము చదువరుల కొసంగబడెను.

క్రీ. శ. 1015-1022 వఱకును విమలాదిత్యుఁడు ధరా పాలన మొనర్చి యువకుఁడగు విజయాదిత్యుని రాజరాజు నధీనము నను౦చి లోకయాత్ర చాలించెను. రాజరాజు మాతులుఁడగు రాజేంద్రచోళుని తనయను అమ్మంగదేవిని వివాహమయ్యెను. నాటినుండియు సోదరులకు వైమనస్య మారంభమయ్యెనుగాని భీరుఁడగు రాజసోదరుఁ డేమియుఁ జేయలేకుండెను. ఈ రాజరాజు 1022 సంవత్సర మాగస్టు పదునాఱవతేది తన ప్రభుత్వము నారంభించెను. ఆతడు

ప్రభుత్వమునకు వచ్చిన పదిసంవత్సరముల కా రాజచంద్రు నకుఁ బుత్రోదయ మయ్యెను.

పూర్వచాళుక్యులలో నిరువదియొకటవ పురుషుఁడగు యుద్ధమల్లుని కాలమునందే తెనుఁగు పద్యరచన వ్యాప్తిలో నుండెనని యాతని దానశాసనములవలన దెలియనగును. క్రీ. శ. 843-844 లో రాజ్యపాలన మొనర్చిన యెదవ విష్ణు వర్ధనుని కాలమునందు శాసనము లాంధ్రమున వ్రాయబడెను. కాఁబట్టి మనభాష యేడవ, ఎనిమిదవ శతాబ్దములందు వ్యవహారమునందుండెనని యూహింపవలసి యున్నది. ఏది ఎటులున్నను తోఁచినది, పది శతాబ్దములందు పద్యరచన బహుళమై యుండవలయును. అందువలన నాభాష పండితులు, సంస్కరింపదగియున్నదని పదవశతాబ్దాంతమునందు దలంచి యుందురు. అందున ప్రథమాచార్యుఁడగు నన్నపార్యుఁడు 1048 వ వత్సరమున శబ్దానుశాసనమను గ్రంథమును రచించెను. శాస్త్రముల జనుప దనకడ నుండిన విద్యార్థులకది పాఠము సెప్పియుండెను. రాజరాజు తనయుఁడు కులోత్తుంగుఁడను నామాంతరముగల రాజేంద్రచోళుఁడును నన్నపార్యునికడ విద్యార్థియై యుండెను. ఆచార్యులవారు సహజ జ్ఞాన పరిశోభితుఁడగు నా రాకొమరునకు శబ్దానుశాసనమును పాఠము సెప్ప నారంభించెను. రాజసుతుఁ డేకసంతగ్రాహి యగుట నత్యంత సులభముగ వ్యాకరణము నభ్యసింప సాగెను. అది గాంచి యాచార్యుఁడు మహేశ్వరు నంతటి

వ్యాకరణశాస్త్రజ్ఞానము గలవాఁడని తలంచియో యాతని వంశమున నాదిపురుషు నతఁడు దలపించెడు ననియో సారంగధర శబ్దమున బిలువసాగెను. అంతఃపురమునందును రాజకీయ వ్యవహారమునందు ప్రవేశముగలవారి సంఘము నందును రాచబిడ్డఁడు సారంగధరుడనియే పిలువఁబడు చుండెను. 1050 ప్రాంతములందు శబ్దానుశాసనమునందు పెక్కురు సుశిక్షితులౌట జరిగెను. ఇందులకుఁ గారణ భూతుఁడు రాజరాజనరేంద్రుఁడు. ఆ రాజచంద్రుఁ డాంధ్ర భాష నభివృద్ధినొందింప బద్ధకంకణుఁడై యుండెను. భాష క్రమశిక్షితమైనంత కావ్యావశ్యకత యా భూనాథునకు దోఁచెను. బౌద్ధమత మొకప్పుడిట వ్యాప్తియందుండినది. బ్రాహ్మణమతాభిమానియగు నీ నృపశేఖరుఁడు తత్సంబంధ గ్రంథము లుండిన బాగుండునని వ్యాసభారతమును దెనిగింప నాచార్యుల హెచ్చరించెను. నారాయణభట్టు అధర్వణా చార్యాదులగు పండితవతంసులుండ తనపై నభిమానంబు పేర్మి నడిగెనని తలంచి యందులకుం గడంగెను. ఆ విషయమునకుఁ బండితసంఘ మీర్ష్యాసక్తము కాకపోలేదు. వారును నిజవిద్యావైశారద్య ప్రకటితమగునటు లందందు కొన్ని భాగములనో, కొన్ని పర్వములనో యాంధ్రీక రించిరి. లక్షణగ్రంథము వ్రాసిన యా యాచార్యవర్యు గ్రంథము ప్రశస్తి కరుదెంచెను.

రాజరాజవిష్ణువర్ధనుఁడు 1051 వత్సరమున రాజేంద్ర చోళుని సోదరుని హస్తములందుంచి ముంజుని సమ్మాన

సింధిలునివలె దివంగతుఁడయ్యెను. ఆచార్యవర్యుఁడు నన్న పార్యుఁడు సర్వోత్సాహముల గోల్పోయిన వాఁడయ్యెను. చిత్తమున్నత్తమైపోయెను. సర్వవిధ సత్కారములు గావించు ప్రభుసత్తముఁడీ పృథివి వదలిన నాలుగైదు మాసములలో పర్వత్రయాంధ్రీకరణ మొనర్చి నాకలోకమున తనయేలికను జేరబోయెను.

విజయాదిత్యుని ప్రభుత్వము వత్సరము గడచులోపల నతనికి కపటతంత్ర విశారదుండగు నారాయణభట్టు మంత్రిత్వమును రాజేంద్రునండి రాజ్యమును గైవసమొర్చుకొను నభిలాషయు మించెను.

షష్ఠమ ప్రకరణము.

పూర్వచాళుక్యుల రాజ్యము సింహపుర ప్రాంతముల వరకు వ్యాపించి యుండినది. అటనుండి కంచి వఱకును పల్లవుల పాలనముండెను. అంతకు దక్షిణదేశమును చోళులు పాలించుచుండిరి. వీరు ఉరయ్యూరు ప్రధాన పత్తనముగ ధరాపాలనము నొనర్చుచుండిరి. వీరు సూర్య వంశజులని చెప్పుకొనుచుఁ జంద్రవంశజులగు చాళుక్యులతో సంబంధము నొనర్ప సమ్మతించిరి.

క్రీ. శ. 98౫-1013 వఱకును చోళదేశమును రాజరాజు పాలించుచుండెను. ఇతనికి రాజేంద్ర చోళుఁడను తనయుఁడును, కుందమాంబయను తనయయు నుండిరి. ఈ కుందమాంబను కీర్తివర్మ తనసోదరుఁడగు విమలాదిత్యునకు

వివాహమొనర్చెను. రాజేంద్రచోళుఁడు పూర్వచాళుక్యులతో సఖ్యసంబంధములు గలిగియుంట పశ్చిమ చాళుక్య నృపతియగు విక్రమాదిత్యునకు (1008-40) సంకట ప్రాయముగనుండెను. అద్దాన నతఁడు నిష్కారణముగనే చోళులపై నాహవమొనర్ప తలంచెను. ఆరాజు తలంచిన విరోధకారణము వలయునా! గాంగుల భూమిని కొంత యాక్రమించిరను నెపమున సోదరుఁడగు జయసింహుని నపరిమిత సైన్యసమేతు నొనర్చి గాంగులకు సహాయపడ నాజ్ఞాపించెను. 1035 ప్రాంతములనుండి చోళ పశ్చిమ చాళుక్యులకు తీరని వైరము సంప్రాప్తమయ్యెను.

విజయసింహుని కాలమంతయు నిష్ఫలవైరముతోడనే గడచిపోయెను. 1040 లో యాతని తనయుఁడు సోమేశ్వరుఁడు పెదతండ్రి రాజ్యమున కధినాథుఁ డయ్యెను. ఇతఁడొక పది వత్సరములు జయాపజయముల నందుచు జన, ధన వ్యయము గణింపక పోరుచుండెను. పూర్వచాళుక్యులకు నాయకుఁడైన విజయాదిత్యుని మనోభావముల నెఱింగినవాఁడును, తంత్రావాపసమర్థుఁడునగుట నాహవమల్ల బిరుదాంకితుఁడగు ప్రథమ సోమేశ్వరుఁడు అతనిని రాయబారి నంపి తనవైపు త్రిప్పుకొనెను.

అప్పటికి చోళరాజ్యము రాజేంద్రునిచే పాలింపఁబడుచుండెను. ఈ నరనాయకునకు రాజాధిరాజు, రాజేంద్రుఁడు, వీరరాజేంద్రుఁడు నను ముగ్గురుపుత్రులును, అమ్మంగ దేవియను

తనయయు నుండిరి. అమ్మంగదేవి రాజరాజున కొసంగబడెను. క్రీ. శ. 1013-1042 వరకును రాజ్యభారము వహించి యతఁడు లోకయాత్ర చాలించెను. అతని జ్యేష్ఠతనయుఁడు రాజాధిరాజు 1012-1052 వరకును ప్రజాపాలన మొనర్చుచు నాహవమల్లు నోహటించుచుండెను.

ఆహవమల్లుడీ నిష్ఫలసమరము నంతమొందింపదలచి విజయాదిత్యుని సహాయమును గోరెను. పూర్వచాళుక్య నృపతి యపారసైన్యముతో విక్రమసింహుని సహాయపడ నంపెను. విక్రముఁ డసమ్మతితోఁ దనయునితోఁ బోయి పశ్చిమ చాళుక్యులతోఁ గలిసెను. అపారమగు నీవాహిని తనపై వచ్చుచుండుట నెఱింగి రాజాధిరా జుచితసేనతో బయలు దేరి కొప్పమనుచోట ప్రత్యర్థి నెదుర్కొనెను. పోరు ఘోరముగ జరిగెను. ఇరువాగులవారికిని సైన్యనష్టము కలిగెను. పూర్వచాళుక్య సేనాని విక్రమసింహుఁడును రాజాధిరాజును ద్వంద్వయుద్ధ మొనర్చుచు మడసిరి. ఎవరి సహాయము రహస్యముగ నభిలషించి సారంగధరునకు మేలు సేయదలంచెనో వారినే యోహటించి హత మొనర్చి విక్రముఁడు హతుఁడయ్యెను. విధికార్యము లెంతటి గభీరము లైనవి ? ఈవిషయములు 1052 వ సంవత్సరాంతిని జరిగినవి. హతశేషమగు సైన్యముతో విజయసింహుఁడు రాజమహేంద్రవరమునుం జేరెను.

రాజాధిరాజు సోదరుఁడు రాజేంద్రుఁడు. తన పితామహుఁడు రాజరాజు పశ్చిమచాళుక్యుల ముప్పుతిప్పలు

పెట్టి మూఁడుచేఱలనీరు త్రాగించిన విషయము దలంచి సముచిత సైన్యసమేతుఁడై యెదిర్చి, యాయరిబలమునుతేఱిమి వైచెను. అంత నొకటిరెండు మాసములెట్టి యుద్ధప్రయత్నములుగాని జరుగకుండెను. వాహినీపతులొక్కింత విశ్రాంతి నంద నెంచుచుండిరి. రాజేంద్రుఁడు చోళభూమి కేలిక యయ్యెను. ఆ వీరవరునిసోదరుఁడు వీరరాజేంద్రుఁడు సర్వ సేనాధిపత్యమును వహించి నరపతికిఁ గుడిభుజమై యలరారుచుండెను. పూర్వచాళుక్య నాయకుఁడు విజయాదిత్యుఁడు వీరరాజేంద్రునిచే ప్రేమింపబడు వాఁడగుట నాతని యాధిపత్యమును గమనించి మైత్రియొనర్చు ప్రయత్నముల నొనరించుచుండె. వీరరాజేంద్రుఁ డధికారనామకక్షీర జలపానమున తృష్ణాతీతుఁడై చోళరాజ్యలక్ష్మినాక్రమింపనభిలషించుచుండెను. విక్రమసింహుని పరాక్రమము తన జ్యేష్ఠభ్రాత విషయమున గాంచినవాఁడగుట చేతను పూర్వచాళుక్య సేనాప్రాబల్యత నెఱింగినవాఁ డగుటవలనను విజాయాదత్యుని సహాయ మభిలషించెను. ఇరువురకును రాయబారములు జరుగుచుండెను. చారిత్రకవిషయములింకఁ జాలును.

సప్తమప్రకరణము.

పల్లవరాజ బంధువుఁడు నరసింహవర్మ విక్రమసింహపురమును బాలించుచుండెను. విజయదశమి నాఁడతఁడు రాజకుమారుల ధైర్య, శౌర్యముల పరీక్షించి రాజ

నారాయణ బిరుదము నొసంగదలంచెను. ఆకాలమునందు బల్లవులతో నేరికిగాని వైరముండక పోవుటను గాంగులు, పాండ్యులు, చోళులు, బనవాసులు, కాదంబులు, పూర్వ పశ్చిమ చాళుక్యులు నాహ్వానింపఁబడిరి.

నరసింహవర్మ తనయుఁడు, మదాలస సోదరుఁడు మధుసూదనవర్మ మహాపరాక్రమశాలి. అతఁడస్త్రచాలనము నందేమి, హయశలాఘువమునందేమి, మల్లయుద్ధమునందేమి యాఱితేఱినవాఁడు. దానివలననే నరసింహవర్మ రాజనారాయణ బిరుదమును దప్పక తనయుఁడందఁగలఁడని విశ్వసించి యుండెను. దక్షిణ భారతరాజకుమారులముందు నిజతనయు పరాక్రమాతిశయమును ప్రదర్శింపవలయునను స్వార్థపరతంత్రత యా భూజాని యందియుండక పోలేదు.

ఒక విశాల సమప్రదేశమున రంగ మేర్పఱుపబడెను. అస్త్రవిద్యా ప్రదర్శనము, మల్లయుద్ధము, లక్ష్యభేదనము మొదలగు వాటియందు సమర్థుఁడగు పురుషుఁడు రాజనారాయణ బిరుదమునకర్హుఁడుగ భావింపబడెను. ఒక వర్తులమును గీచి మధ్య నావీరుఁడుండ వర్తులరేఖపై నిలచిన యేబదుగురు భటులు పదినిముసము లెడతెఱిపిలేక విసరు ఫలముల ఖడ్గసహాయమున రెండుగా నఱుకవలయును. భారతకాలమునాటి మత్స్యయంత్రము బోలినది యొకటి కాసారమునందు ప్రతిఫలించు వృక్షమును గాంచుచు నద్దానిపై దిరుగుచుండు చక్రమును గ్రిందబడగొట్టవలయును

నూఱుగజముల దూరమునందు చక్రమొకటి త్రిప్పుచుండ నద్దానిచుట్టును గట్టబడిన వస్తువులలో నిర్దేశింపఁబడిన దానిని శరముతోఁ గొట్టవలయును. ఆటంకము లెక్కుడుగ నుండు నొక దశయోజన ప్రదేశమున కేఁగి రావలయునను కార్యక్రమ మాహ్వాన పత్రములందు లిఖించి యంపబడెను. పెక్కురు రాకొమరులును, భటాగ్రేసరులును దమకవి శక్యము కావని యెఱింగియు జూడనైన గల్గుదుమను నభిప్రాయముతో నట కరుదెంచిరి.

ఆహవమల్లుని తనయులు సోమేశ్వర విక్రమాదిత్యులును, కంచీపాలకుని తనయుడు, కీర్తివర్మ, గాంగులరాజు కర్ణుఁడు, కాదంబ నృపసోదరుఁడు బిందుమాధవుఁడు, పాండ్య నృపతితనయులు హరిహర సాంబులు నరుదెంచి యుండిరి. రాజమహేంద్రవరమునకు నాహ్వాన మంపబడెను. విజయాదిత్యుఁడు సారంగధరుని పొమ్మనియెను గాని యతఁడు మహేంద్రగిరియందలి గానవిద్యాప్రవీణ సమ్మేళనమున కాహ్వానము వచ్చియుండుట నట కేఁగక తప్పదని దశరాత్రము లారంభింపక పూర్వమే బయలుదేరెను. విజయసింహాది వీరకుమారులు మాత్రము పయనమైరి.

మదాలస చోరనాయకునితో సంఘటన మైనప్పటి నుండి భర్తృదర్శనమే యొనర్పక జనకుని సందేశమంది వాసంతికతోఁ సింహపురిఁ జేరనరిగెను. పోవుటకు ముందు వేయి విధముల సారంగధరుని రాఁగోరెను గాని యా రాచబిడ్డఁడు మహేంద్రగిరికి పోకతప్పదని దృఢముగ దెలిపెను.

నవరాత్రములు సింహపురియందు మహావైభవముగ జరిగినవి. ఆయుధపూజాదులు మిగుల నాడంబరముగ జరిపిరి. రాకుమారులు సమీప దుర్గమారణ్యముల కేఁగి వన్యమృగముల నుక్కడగించి నిజ పరాక్రమంబులఁ బ్రకటించుకొనిరి. విజయుఁ డసమాన వీరుఁడగుట కొందఱు గ్రహింపఁగలిగిరి. విజయదశమినాఁడా పురము దర్శనీయమై యుండినది. శూరకుమారులే శతసంఖ్యాకులై యుండిరి. ప్రేక్షకలోకము లెక్కింప వీలుకానిదై యుండెను. వీథులందు నడచుటయే కష్టముగ నుండినది. అరుణోదయ మగునప్పటికే నరసింహవర్మ యాత్మజునితో మంగళతూర్య నినాదములతో రంగస్థలమును జేరెను. నన్నపార్య విరచిత భారతము నందలి కుమారాస్త్ర విద్యా ప్రదర్శనమును దలపించెడు యా రంగస్థలము వీరకుమారులతో నిండియుండినది. ఉన్నతాశ్వములపై నెక్కి యా శూరులెంతయు జూడ నొప్పుచుండిరి. మొదట పది యోజనము లాటంకములుగల దూరముల నశ్వములపై బోయివచ్చుట జరుగ భూజాని యాజ్ఞాపించెను.

ఆరాజుగా రాజ్ఞాపించిన మాత్రమున విద్యుచ్ఛక్తిచే ద్రోసివేయఁబడిన వస్తుజాలమువలె బిరుదు నాకాంక్షించు వీరులు వారువముల నదల్చిరి. ఆ యాజానేయములు కంచెల నెగురుచు కాలువల నుత్తరించుచు పంక ప్రదేశముల దాటుచు పరుగిడు చుండినవి. ముందుబోయిన యతఁడు వెనుబడు చుండెను. వెనుక నరుదెంచిన వాఁడు ముందువ

కేఁగుచుండెను. కొందఱు వారువముల నుండి దొరలు చుండిరి. కొందఱు పడబోవుచు సుస్థిరులై యుపవిష్టులగు చుండిరి. దాదాపు శతసంఖ్యాకులగు నా యువకులలో నిరువదిగురు మాత్రము తిరిగి రాఁగలిగిరి. అందు విక్రమాదిత్యుఁడును మధుసూదనవర్మ విజయులు మాత్రము సమముగా రాఁగలిగిరి. తదితరులు వెనుఁబడిరి.

ఖడ్గచాలనమునం దగ్రస్థానము బడయ వింశతి శూరులు ముందున కరుదెంచిరి. అందులోఁకూడను విక్రమ, మధుసూదన, విజయులే విజయులైరి. విక్రముఁడు పది ఫలములను, మధుసూదను డెనిమిదింటిని, విజయుఁడు పండ్రెండింటిని కొట్టజాలక పోయిరి. ఇతరులు పది పనునైదు ఫలముల మాత్రము కరవాలమున నఱుకఁ గలిగిరి.

అటుపిదప నీరమునఁ జూచుచు వెనుభాగమునం దుండు వృషాగ్రచక్రమును బాణమునఁగొట్ట యత్నించిరి. అందుల కరుదెంచిన మేటి విలుకాండ్రలో నొకఁడైన సమర్థుఁడు గాకపోయెను. నరసింహవర్మ తన యత్నము నిష్ఫలంబగునని భయపడసాగెను. పిదప లక్ష్యభేదనమొనర్ప నా సోమనాథుఁడానతిచ్చెను. అందులో మధుసూదన విజయులుమాత్రము లక్ష్యమున కొక్క నాలుగంగుళముల దాపున గొట్టఁగలిగిరి.

సింహపురాధినేత యదంతయుఁజూచి కరవాలముతో నంతు బదుగుర ముందునకు రా నాజ్ఞాపించి దంద్వయుద్ధ

మునకు డీకొనఁగోరెను. ఆ యుద్ధమునందు విజయుఁడగువాని కా బిరుదమొసంగఁ బడుననియు కరవాలముతో ప్రత్యర్థిని మువ్వూరు తగిలిన వాఁడు జయించినటుల నిరూపింపఁబడు ననియుఁ బ్రకటించెను. మంత్రి మల్లయుద్ధమును జ్ఞాపక పరుప కొంతవడి యోచించి వాలుయుద్ధమును ముగిసిన పిదప నది యగునటుల నిర్ణయించెను.

అయిదు తెగలుగ వారు ద్వంద్వయుద్ధము నారంభించిరి. గాంగుల నాయకునితో మొదటినుండియు వచ్చిన మూఁగురు మాత్రము నిలచిరి. అయిదవజత చాలించు కొనెను. మధుసూదనవిక్రములును, కర్ణవిజయులును విశ్రాంతి గొనిన పిదప పోరునట్లు రాజాజ్ఞాపించెను. ఆవిశ్రాంతి సమయమునందు తదితరులు మల్లయుద్ధమొనర్ప బాగుండునని మంత్రిగారు వలుక నరసింహవర్మ సమ్మతిఁజూపెను. అది యొక రెండు ఘడియలకాలము జరిగెను. అందు బిందు మాధవుఁడగ్రస్థాన మందెను.

వీరోత్తములగు నలుగురకు ద్వంద్వయుద్ధ మారంభ మయ్యెను. వారి విద్యాకౌశలమున కటనుండువారు ముగ్ధులై పోయిరి. నరసింహవర్మ తాటాకుకట్టఁబడిన యొకశరముతన పాదములకడ బడుటయు దనయుని విద్యాకౌశల దర్శన ముగ్ధుఁడై తెలియకుండెను. మధుసూదన విజయులు జయ మందిరి. అంత నారాజ్ఞాగణి యచ్చెరువుమొయి శరమును బరికించి మంత్రి నది పరిశీలింపఁ గోరెను. ఆ శరము నా సచివుఁడు పెఱుకుటే శ్రమ యనుకొనెను.

అందీ క్రిందివిధముగ వ్రాయఁబడి యుండెను.

రాజకులావతంసమా !

మీరు పరాక్రమ పరీక్షనొనరించి బిరుదము నొసంగ నెంచుటవిని నేనందిన యానంద మింతింతనరాదు. అనాహూతుఁడ నైనను క్షత్రియకుమారుఁడ నగుట నిజశౌర్య ప్రదర్శనోత్సుకుఁడనై యుంటిని. ఉదారబుద్ధిగల మీరన్యథా భావింపరను నాశమెయి వేచియుంటిని. ముదలమైన చనదెంతును. ఒక్కమనవి. నేప్రచ్ఛన్నుఁడను. కారణాంతరములచే నాయంగమచ్చములఁగాని, నామమునుగాని వ్యక్తపఱుప నిచ్ఛగింపను. మీసమ్మతి నెదురుసూచు

భుజబలప్రధానుఁడు.

‘వ న కే స రి’

అది వినినంత నట మూఁగిన జనులు విభ్రాంతులై పోయిరి. ఆ ప్రచ్ఛన్నవ్యక్తినిజూడ నరసింహావర్మ యభిలషించుచుండెను. సచివశిఖామణి నావృత్తాంతము నట సమావేశమైనవారికిఁ దెలుపఁ జెప్పెను. బిరుదు నభిలషించి యరుదెంచిన రాకొమరులలో గుసగుసలు బయలుదేఱెను. ప్రచ్ఛన్నవ్యక్తి యెట్టివాఁడైనదియు నెఱుంగ నుత్సుకత ప్రబలమైయుంట నెల్లరు సమ్మతించిరి. అంతనొక రాజదూత గంభీరముగ వనకేసరి రాకకు మహారాజు సమ్మతించెనని పలికెను.

అయిదారు నిముసముల కాలములో నున్న తాశ్వము నధిరోహించి మన వనకేసరి యట ప్రవేశించి వినయాతిశయ ప్రకటితాభివందన మొనరించి తన యాశ్వికతా ప్రదర్శనమునకంటె లక్ష్యభేదమును వృషాగ్ర చక్రమును గొట్టుటకు ననుజ్ఞ నభిలషించెను. సింహపురపాలుఁడు సమ్మతింప, నతఁడు సరోవరోదకమునఁ జూచుచు నవలీలగ చక్రమును బడగొట్టెను. కరతాళధ్వని మిన్నుముట్టెను. అంతట లక్ష్యభేదనము నొనర్పనిలచెను. సర్వము సిద్ధమైనపిదప నొకములుకును గొట్టెను. అది తప్పిపోయెను. అంతనొకింత సుస్థిరుఁడై నిర్దేశవస్తువును క్రిందపడవైచెను.

అటుపై నాతఁడు వర్తులాకృతి మధ్యమున నిలిచెను. అదిగాంచి బిరుదమునకై యరుదెంచిన రాకొమరులు ఫలముల విసర నారంభించిరి. వనకేసరి కరవాలమును ద్రిప్పుచు పది నిముసములు విసరఁబడిన వాని నన్నిఁటిని శకలములొనర్చెను. మధుసూదనునిచే నోడింపఁ బడిన విక్రముఁడు మహానందము నట్టహాస పూర్వకముగ నగుపఱచెను. అందులకు సింహపురీశసుతుఁడు రోషావిష్టుఁడై తనపై వనకేసరిని ద్వంద్వ యుద్ధమునకురా నాహ్వానించెను. వనకేసరి దరహాస మొనరించి గెలచిన విజయుని తోడుగాఁ గొని రాఁగోరెను. అందులకు మధుసూదనుఁడు సమ్మతింపఁడయ్యెను.

వనకేసరి యుద్ధమునకుఁ గడంగెను. అత్యద్భుతముగ నా యిరువురు పోరాడుచుండిరి. కర్ణార్జునుల మఱపించు

చుండిరని యటనున్న ప్రేక్షకులు తలంచుచుండిరి. వాసంతిక మదాలసతో నరుదెంచి యంతిపురకాంతలతో నేకాంత ప్రదేశమునందుండి యీ వనకేసరి సంపూర్ణముగ దృక్కులతో మ్రింగివేయునట్లు చూచుచుండినది మదాలస యొక్కంత యీర్ష్య నందుపై నందకపోలేదు. ప్రేక్షకులు నిలుచుటతో కూర్చుండుటతో ప్రక్కవానిపై వాలుటతో మెఱుంగకుండిరనినచోఁ జాలును.

వనకేసరి నాలుగు నిముసములలో క్రోధారుణిత నయనుఁడగు మధుసూదనవర్మను కరవాలముతో స్పృశించి తొలఁగి నిలచెను. అంత గంభీరభాషణముల విజయవిక్రముల తనపై రాఁగోర వారటులొనర్చిరి. వారలతో పదినిముసములు పోరాడి విజయుని వాలునెగురగొట్టియు విక్రముని కైదువు విరుగఁగొట్టియు దరహాస మొనరించెను.

అంత వనకేసరి కలవాలమును విజయున కొసఁగి ముఖవస్త్రమును గట్టిపఱచుకొని దట్టికట్టుకొని మల్లయుద్ధమునకు బిందుమాధవు నాహ్వానించెను. భ్రాంతిచేతస్కుఁడగు నాతఁడు పెక్కు నిముసములకుఁ గాని తేఱుకొనఁజాలఁడయ్యెను. వారి మల్లబంధ విశేషములు మఱియొక మాఱు ప్రేక్షకుల తన్మయుల నొనరించెను. మదాలస సోదరుఁ బిలిచి తమకు వనకేసరి యొనరించిన సహాయమును జెప్పి యతఁడు చోరనాయకుని కడ నందియొసంగిన కమ్మను జూపెను. మధుసూదనవర్మ వనకేసరిపై గల కార్పణ్యము నంతయు మఱచిపోయెను.

అంతలో వినవగు కరతాళధ్వనులకుఁ దిరిగి చూచెను. స్థూలకాయుఁడగు బిందుమాధవుని వనకేసరి పైకెత్తిపట్టి యుండెను. క్రిందవేయువానివలె నటించి తటాలున సైకత ప్రదేశమున పరుండబెట్టి కరదానమున నిలపెను.

అంతలో మధుసూదనవర్మ యట కరుదెంచి "వీరాగ్రణీ! నీ వలన మన యాంధ్రావని ధన్యయయ్యెను. ఈ వీర కుమారుల పక్షమునను భవదీయసాయ మందిన మత్సోదరి పక్షమునను నభివాదము లర్పించుచుంటిని. నీకంటె రాజ నారాయణ బిరుదము నంద సమర్థులు లేరు. నీ పరిచయ భాగ్యము మాకు త్వరలో గలుగును గాక!" అనెను.

"రాకుమారా! నన్నేల గొప్ప చేసెదు. అస్త్రాది విద్యాతిశయమున గర్వమొందుట దుర్జనలక్షణము. ఇప్పటికి సెలవుగైకొందును. మఱొకప్పుడు మీకడకరుదెంచి మీ పరిచయభాగ్యము నందువాఁడ. అభిజ్ఞానార్థమేదైన నొసంగిన మీకడ కరుదెంచునపుడది గైకొని యరుదెంతును" అని వనకేసరి గంభీరముగ బల్కెను.

ఇట్లు మాటాడుచు నావీరద్వయము విజయవిక్రములతో నరసింహవర్మను డాసెను. అంత మధుసూదనుఁడు "అవసరము లేదు. ఆ నీ చిబుకముపైనుండు మచ్చయే నిను గుర్తింపఁజేయగలదు పొమ్ము" అనెను. "ఏమీ! చిబుకముపై మచ్చయా! అతఁడెవరో నాకు దెలియు" నను కోమల కంఠము వినిపించెను. మదాలసావాసంతికలు తప్ప యితరులు

దాని గమనింపరైరి. వనకేసరి ఖడ్గాంబరాదుల బహుమాన మందిన వీరు లందఱకడ సెలవుగైకొని యాజానేయము పై నెక్కి పోయెను.

నరసింహవర్మ యానాఁటి కార్యక్రమమున పాల్గొనిన రాకొమరుల, వీరుల నర్హరీతి మణిభూషణాంబర వాహనాది కముల సత్కరించి కొన్ని దినములుంచుకొని యంపివేసెను.

అష్టమ ప్రకరణము.

పశ్చిమ చాళుక్య యువరాజు సోమేశ్వరుఁడు వీరుఁడు గాఁడు. విషయలోలుఁడగు నాతఁడిరువది యెనిమిది సత్సర ములవాఁడు. రూపవంతులలోఁ జేర్పఁదగినవాఁడే. అధికార బలము నాకాంక్షించు నతఁడు చేయవలయు యవమాన కార్యము లేదు.

పై ప్రకరణమునందొక కోమలకంఠమున చిబుకముపై మచ్చగల యాతఁ డెవరైనదియుఁ దనకుఁ దెలియునని చెప్పినట్లు వ్రాయబడెను. అయ్యది మదాలసా వాసంతికలు గాక సోమేశ్వరుఁడు నాలకించి యుండెను. వీరుఁడుగాక పోయినను నేలకొలది జనులమధ్య ధన్యవాదముల నందిన వీరునిపై నసూయ నితఁడు గాంచియుండెను. ఏదోయొక బలవత్తర కారణము లేని దాతఁడు ప్రచ్ఛన్నుఁడుగ నుండఁడనియు, నాతని ప్రచ్ఛన్నత విచ్ఛిన్నమునర్చి వానికి సంకటము గలిగింప వలయుననియు నతఁడు నిర్ధరించుకొనెను.

ఆ క్రియాచరణమున నాతఁడు వేఱొక యభిప్రాయమును గలవాఁడై కూడ నుండెను. ఆ కోమలకంఠము గల కాంత వదనారవిందము నొక్క క్షణకాల మతఁడు గాంచి యుండెను. రసికాగ్రగణ్యుఁడగు నా రాకొమరుఁ డద్దాని హృత్ఫలకమున జిత్రించుకొనెను. తదనంతర మనుక్షణము నామూర్తి ఘనీభూతమై వాని ప్రతి రక్తబిందువు నందును ప్రతిబింబితను బొందెను. ఆవనితను బిగియార కౌఁగిలింపనిది తన జీవనము వ్యర్థమని యాతనికిఁ దోఁచెను. దుర్జనుల వాంఛలకు మేరయున్నదా? అనుచిత మనున దున్నదా? చదువరు లెఱుంగరా?

ఈవిషయములందు కుశాగ్రబుద్ధియగు నాయువకుఁడు పునర్దర్శన మొనరించుకొన నుపాయమును బన్నెను. మఱు నాఁ డలవాటు గాకున్నను సూర్యోదయము గాకమున్న మేల్కాంచి, సింహపుర రాజోద్యానమునం దొక నికుంజమున డాగెను. నాలుగైదు గడియలకాల మతఁడు కదలక మెదలక కూర్చుండి యుండెను. ఆహా! కాముకితకును వైరాగ్యమునకు స్థిరత్వమందు భేదములేదుకదా? మనశ్చలము మాన్ప నిది సమర్థమనియు కాఁబోలు 'కామిగాక మోక్షకామిగాఁడు' అని మనవారు తెల్పియుండిరి. ఎటులైననేమి యటకొక యువతీమండలి యరుదెంచెను. అందా కాముకుఁడు నిముసమాత్రి సందర్శన మొసంగిన మోహనాంగిని గాంచెను.

ఆబిడ యందు నూతన విలాసము లాతని కన్నెని గోచరములయ్యెను. ఆయన్నులమిన్నను బొందవలయునను వాంఛ బలవత్తరము కాగా పరభృత తిరస్కృతములగు వారి భాషణముల సావధానముగ నాలకించెను. వారా దినము సంజవేళ లరుదెంతురని విని యటనుండి రహస్యముగ వెడలి పోయెను.

ఆనాఁడాతఁ డాహారమునైన సరిగ గొనఁడయ్యెను. హంతకుల గొందఱ ధన దానమున వశ్యుల గావించుకొనియెను. ఉద్యానవాటిక యందలి నికుంజములయందు వారల భద్రపఱచెను. సూర్యుఁడాదిన మెందుల కాలస్యముగ గమనము సాగించెడునని పలుమారు భావించెను. ఏదో మాటాడ నరుదెంచిన విక్రమాదిత్యుని గసరి పంపివేసెను. ఎట్టకేలకు సాయంసమయమయ్యెను.

భానుఁడు చరమగిరిని జేరకమున్న యిరువురు జవ్వను లటఁబ్రవేశించిరి. వారు వనవిహారము నట్టె నలుపక యొక గోస్తనీకాయమానముక్రింది చలువరాతిన్నెపైనుపవిష్టులైరి. ఒక కాంత మఱియొకర్తను ప్రచ్ఛన్నవ్యక్తి యెవరని ప్రశ్నించుచుండెను. ఆ బాలిక తెలుప వీలుకాదనియు, తనకు తెలియదనియు పదింపదిగ తెలుపుచుండెను. వారిరువురు మృదుగభీరముగ మాటాడుకొను లోపల హంతకులు నూతన నాయకు నాదేశంబుమెయి, వారల డాసి కర్కశంబులగు కరములతోఁ బట్టుకొనిరి. ఒకర్త యందు బిగ్గఱగ నఱచెను.

రెండవయామె మాటాడుటకైన శక్తిలేనిదై యుండెను. వారికేల భీరువ లను నామము బ్రహ్మ సార్థకపఱచెను ?

ఒక్కింత తడవులో వారు బంధింపబడిరి. ఇంకను వెలుగుండుటను సోమేశ్వరుఁడు వారా యువతులను పురికి పశ్చిమదిశనైదు క్రోశముల పరిమితినుండు భవనమున నుంపవలయుననియు, నొకరిద్దరటనుండిన బహుమానధనమును దెత్తుననియు బలికి యుత్సాహాతిశయమున తన విడిది చేరెను. అతనికంటె ముందే యెటులో యాకాంతాపహరణవార్త బయలు పాఱి యుండెను. విజయ విక్రములును, బిందుమాధవ మధుసూదన కీర్తివర్మలును వాలులధరించియశ్వముల నారోహించుచుండిరి. కీర్తివర్మ యపహరింపఁబడినది తన సోదరి వాసంతికయనివిని ఖిన్నుఁడై యుండెను. ఆతని నెల్లరునోదార్పయత్నించుచుండిరి. సోమేశ్వరుఁ డావార్తవినినపుడు జూపిన నటనా కౌశల్యము ప్రశంసాపాత్రమై యుండినది. వారలమించిన యుత్సుకత గలవానివలె యుత్సాహయుక్తుఁడై బయలుదేఱెను. కపటోపాయ నిధియగు నాతని భావవీధి నప్పుడే నూతన తంత్రమొకటి యుత్పన్నమయ్యెను. వారలతో కొంత దవ్వరిగి వెనుకకు వారల పశ్చిమభాగ భవనమువైపు పోఁగోరి యదృశ్యుఁడయ్యెను. అన్వేషణ కార్యనిమగ్నులగు వారు వాని గమనింపరైరి.

ఆ వీరబృందము సమీపపుఁ గ్రామమ్మానివిలో (?)పుల నెమకుచు నాభవనమును జేరునప్పటి కంధకారము వ్యాపిం

చుటయు దాని శశాంకుఁడు పోదోలుటయు జరిగెను. ఆ శరత్కాల జ్యోత్స్నయందు వారుల్లాసముగ నుండుట మాని తమయత్నము నిరర్థకమగునేమోయని విచారించుచుండిరి. వారు తననుజూచి యానందింపకుండుటకు కలశోదధి తనయుఁడు దరహాస మొనర్చినటులుండెను.

ఆ భవనము మూర్ఖహృదయమువలె నంధకార బంధురమై యుండినది. అందు వేసవులందుండిన వాఁడగుట మధుసూదనవర్మ దాని ద్వారములన్నిట నొక్కమాఱు లోనఁ బ్రవేశించుట బాగుండునని దానిచుట్టునేఁగ వారిక దెలిపెను. మాఱుమాటాడక యెల్లరు నటులొనరించిరి. వారు వారువములనుండి దిగి కరవాలముల దృఢముగ బట్టుకొని చిన్నగ సౌధమును డాసిరి. వారు భవనములో నడుగుపెట్టినంత చెరియిరువురు దృఢకాయులు వెనుబాటున వారిపైఁబడి త్వరలో నందఱ బంధించిరి. కొలఁదిగ వెలుగు గల యొక విశాలపుగదియందు వారు నిలుపఁబడిరి.

కొంతవడి కటకు ప్రచ్ఛన్నవ్యక్తి యరుదెంచెను. ప్రయత్నమున మార్చుకొనిన గొంతుకతో "రాకుమారులారా! స్వాగతము. మిమ్ముబంధింపవలసినందులకుఁ క్షమింపఁ గోరుచుంటిని. నే నపహరింపఁ జేసినవారు కన్యలగుట మీరెట్టి విచారము నందనవసరములేదు. వారు నాయధీనమునందుండిరని తెలుపనొకని బంపితిని గాని మీరింతలో నరుదెంచితిరి. ఈనిశాశేషమిటులే గడుపవలయును. ఆకన్నియల

నే గొనిపోవువాఁడను" అని పలికెను. గతదిన మాప్రచ్ఛన్న వ్యక్తి పౌరుషమును గన్నులార గాంచిన వారగుట నొక రొకొక్క విధముగ విచారించుచు నిలచియుండిరి. మధు సూదనవర్మ యేదియో యన నోరు తెఱచునంతలో నొక వికటాట్టహాసము వినిపించెను. ఆ ప్రచ్ఛన్నుఁడును చకితుఁడు గాక యుండలేకపోయెను. "పిఱికిపందలు మహాశూరులగుట కూడనా ? వ్యాఘ్రచర్మధారియగు గార్దభమును రాకుమా రులారా! గుర్తింపజాలకపోయితిరా ?" అను వారిద గంభీర నినద మొండు వినిపించెను. ఆ సవ్వడి యాఁగిన మఱుక్షణ మందే మఱియొక ప్రచ్ఛన్నవ్యక్తి యట ప్రవేశించెను.

మొదటియతఁడట నిలచియున్న ఘాతుకుల, రుద్ధ మగు కంఠముతో నతనిపై బడ నానతిచ్చెను. "ఓరీ ! వనితల బంధించిన వీరులపై నాకరవాలము తెగదు" అనుచు పురో గాములగు నొకరిద్దఱ కరవాలముల నెగురగొట్టి తన వాలు పలుచనిభాగముతోఁ బశువుల గొట్టినటుల గొట్టెను. అదిగని యితరులు పిక్కబలము చూపిరి. రెండవయాతఁడెవరో యన నేల ? మన వనకేసరి. మొదటి ప్రచ్ఛన్న వ్యక్తికడకు దుమికి వడకెడు నతనిబట్టుకొని "మహాశయులారా! నారూప మున నిట్టి హీన కార్యమునకు బూని యొక క్షణకాలము మీ హృదయముల నస్మద్విషయమున గలుషితముల నొనర్చి నందులకు వీని నెటు శిక్షించినను పాపములేదు. ఈవిధముగ కంపితుఁడగు నీచునేమి సేయుటకు దోఁచకున్నది. మీరే

విచారింతురు గాక ?" అనుచు వాని వదనము పైని వస్త్రము లాగివైచి క్రింద పడద్రోసెను.

సోమేశ్వరుని జూచినంత నావీరులందినయాశ్చర్యమునకు మితిలేదు. విజయుని బంధముల వదలించి వనకేసరి యచటు బాసెను. ఆ వీరులందఱును విడినడి గర్వాశ్వారూఢులతో నా పశ్చిమ చాళుక్యయువరాజును జూచునంతలో నాయువతీద్వయముతో వనకేసరి యటఁ బ్రవేశించెను. అంత నతఁడవనతవదనుఁడై యుండు సోమేశ్వరుని వారిరువురికడకు లాగి వారల క్షమాపణము గోర నాజ్ఞాపించెను. మూఁడాదక నా కాముకుఁడు క్షమాభిక్ష వాసంతికా మంజులల నభ్యర్థించెను. ఆ లజ్జావతు లతని బుద్ధిగలిగియుండఁ దెప్పిరి.

సోదరిఁజూచినంత నాహ్లాదమందిన కీర్తివర్మయామెను డాసి యాలింగన మొనర్చఁగొనెను. వాసంతిక " సోదరా! ఈవీరాగ్రణి నన్నవమానమునుండి రక్షించుటకిది మూఁడవ పర్యాయము. ఈ మహోపకారి నెటుల సత్కరింతువో నీక తెలియును" అనెను. కీర్తివర్మ యేదోపలుకఁబోవ, వనకేసరి ముందున కరుదెంచి మధుసూదనవర్మతో "వీరాగ్రణీ! మీ యానతిగొనక మీ యీభవనమునందు వసించినందులకు క్షమింప వలయును. మీ జనకులతో నా యపరాధము మన్నింపఁగోరుఁడు. వీరులారా! ప్రాతఃకాలమున పయనమై పోవుచుంటిని. క్షత్రియకుల కళంకుఁడగు నీతఁడు మరల మీ దర్శనము గలిగించి నందుల కతనికిఁ గృతజ్ఞుఁడను.

మంజులా! నీజన్మవృత్తాంతము గోప్యమైనది. దాని భేదింప యత్నము నొనర్చుచుంటిని. ఆ పల్లవరాజతనయను వదల కుండుము. వాసంతికాదేవి! యీ బాలికను జాగ్రత్తమెయి సోదరివలె జూచుచుండుము" అని ప్రణయ మధురములును మోహనదీపములును నగు నాయువతుల క్రీగంటిచూపులఁ బాటింపక యచటు బాసెను. మదిరేక్షణల వాల్గంటిచూపుల లెక్కింపని యీ వీరుఁడే వీరుఁడు; పురుషాగ్రణియని మా చదువరులు గ్రహింపరా!

నవమప్రకరణము.

ఉరయ్యూరు రాజధానిగ చోళులు విశాలరాజ్యమున కధికారులై యుండిరి. పై యంశములు జరిగినప్పుడు రాజేంద్ర చోళుఁడు ప్రజాపాలనము నొనరించుచుండెను. కొప్పముకడ వీరస్వర్గమునందనేఁగిన సోదరునికై వ్యాకులమాతని నింకను వదలి యుండలేదు. రాజాధిరాజతనయ మధురాంతకదేవి యగుపడినపుడంతయు నతఁడు రణరంగమునకు తానేఁగి యుండినయీపె పితృహీన కాకుండెడిదిగదాయని పరితపించు చుండెను. ఆయువతిలలామ మెట్టి యల్పవాంఛ కలిగియుండి నను స్వయముగ దాని నెఱవేర్చుచుండెను. తన తనయుఁడగు రాజరాజు చూపు సోదరీప్రేమమున కానందము నందు చుండెను. ఏకోదరులువోలె నుండు వారి యనురాగము నధికము నొనర్ప శక్తివంచన లేక యత్నించుచుండెను.

వీరరాజేంద్రుఁడు సమయమువచ్చినపు డంతయు పూర్వచాళుక్య నాయకుఁ డగు విజయాదిత్యుని గుఱించి ప్రశంసించుచు వారి సాయమున పశ్చిమ చాళుక్యనాయకుని మట్టుబెట్టనగు నని బోధించుచుండెను. తన సోదరు మృతికిఁ గారకులు పూర్వచాళుక్యులేయని నమ్మినయాతనిమానసము కనిష్ఠసోదరుని యాలోచనమునకు సమ్మతింప కుండెను. వీరరాజేంద్రుఁడు మాత్రము పశ్చిమచాళుక్యుల నొకమా రోడించిన తుంగభద్రానది వఱకును తమ రాజ్యమును వ్యాపింపఁజేయవచ్చుననియు పల్లవులను సామంతులనుగ జేసి కొను నుపాయము తెలిసియుండుటను విషయలోలుఁడగు విజయాదిత్యుని లోబఱచుకొనుట కష్టముకానిపని యగుట దక్షిణ భారత భూమిని సంపూర్ణముగ స్వాధీనపరచుకో వచ్చుననియుఁ దలపోయుచుండెను. ఎటులేని చక్రవర్తిత్వము సంపాదింప నతఁడు స్థిరసంకల్పుఁడై యుండెను.

వీరరాజేంద్రునకు మధురాంతకదేవి కంటెను జిన్న దగు త్రిపురసుందరియను కూఁతురును, బాలరాజను తనయుఁడు నుండిరి. త్రిపురసుందరిని మధుసూదనవర్మ కొసంగిన వారు సంబంధమున నూరకుందురని యతఁడు తలంచెను. పూర్వ పశ్చిమచాళుక్యుల విషయమున సోదరుఁ డెట్టి నిర్ధారణము నందనివాఁడగుట సింహపురియందు జరిగిన కార్యకలాపమున పాల్గొన కుండెను. అదియుగాక రాజరాజుగాని బాలరాజు గాని షోడశవర్షప్రాయులైనను గాకపోవుటను సింహపురి కరుగకుండిరి.

మధురాంతక రాజరాజుల యన్యోన్యత నతఁడేవ గించుకొనక పోలేదు. తాఁజక్రవర్తి గానలయుననియు తన తనయుఁడు పిదప నాగద్దియ నధిరోహింప వలయుననియుఁ దలంచిన వీరరాజేంద్రునకు వారిపై నకారణద్వేషము జనించెను. బాలరాజును సర్వవిధముల సుగుణియగు రాజరాజు సహవాసము నిష్టపడకుండెను. వారిరువురు అస్త్రవిద్య నభ్యసించునపుడు నాబాలుఁడు జ్యేష్ఠపిత్ృ తనయునిపై మచ్చరముగలిగి పౌరుషమున మించిపోన నిష్ఫలప్రయత్నములనొనరించుచుండెను.

క్రీ. శ. 1053 వ సంవత్సరము ముగియవచ్చెను. కొప్పముకడ రణము జరిగియు నత్సరము కావచ్చెను. రాజేంద్రుఁడు రాజ్యవిషయముల నణుమనస్సుతోఁ జూచు చుండెను. క్రమక్రమముగ వీరాగ్రణియగు వీరరాజేంద్రుఁడు సైన్యము నంతయుఁ దన చెప్పుచేతలకు లోఁబడునటు లొనర్చుకొనియెను. సూక్ష్మబుద్ధియగు నా రాజేంద్రుఁడు సోదరు నత్యాశ నెఱుంగఁగలిగెను. తా నుపేక్షించినను మధురాంతక రాజరాజుల కెట్టియిక్కట్టు రాఁగలదోయని వగచి సోదరుని మనోభిప్రాయానుసార మేఁగువాఁడై యతని రప్పించి విజయాదిత్యునితో సఖ్యమొనర్ప తనకుఁగల సమ్మతి నెఱిఁగించెను. ఆ తక్షణమే వీరరాజేంద్రుఁడు సమర్థుఁడగు నొక రాయబారిని రాజమహేంద్రవరమున కంపెను.

అంతకు ముందుగనే తనసోదరుని మఱెంత నిరుత్సాహునిగసల్పిన నతఁడు వానప్రస్థమున కేఁగుననియు; నట్టి

యెడ రాజ్య మనాయాసముగ తనకుఁ గైవసమగుననియు నాతఁడు యోచించియుండెను. రాయబారి నంపిన యొకటి రెండు దినములలో కన్యాకుమారి యగ్రప్రాంతమందలి చేర దేశమందలి రాజద్రోహులు కొందఱు దోపిడు లారంభించి రనియు వారినిబట్టి విచారణలేకయే నఱికివేయుటకు నాజ్ఞ దయసేయవలయు ననియుఁ బ్రార్థించెను. రాజేంద్రుఁడు నిష్కల్మష హృదయుఁడగుట సోదరుఁడు కపటియని యెఱుంగఁ జాలకుండెను. కోరినవిధమున నాజ్ఞనొసంగెను.

మఱి పదిదినములు గడచిపోయెను. ఒక రిద్దఱు భీకరాకారు లురిదీయఁబడిరి. తదుపరి వీరరాజేంద్రుఁడు సోదరుని కడనొక లేఖనుగొని వచ్చెను.

అందు

“ చోళరాజా !

నీతో విరోధ మభిలషింపని మా సంఘమునందు ముగ్గు రురిదీయఁబడిరి. ఇది కేవల మన్యాయము. త్వరలో నిందులకు ఫలము ననుభవింప గలవు” అని వ్రాయఁబడి యుండెను. వీరరాజేంద్రుఁడు దానికై చింతించు సోదరు నెదుట వికటాట్టహాస మొనర్చి భయపడు టనవసరమనియు త్వరలో నారాజవిద్రోహుల తాను జమునిల్లుసార జేయుదు ననియుఁ దెల్పెను. ఎంత సోదరుఁడు ధైర్య మొసంగినను రాజేంద్రుని హృదంతరాళమున వర్ణింపరాని సంకట మొదవు చుండినది. మఱినలుగు రురిదీయబడిరని విని యొక్కింత

ప్రశాంతచిత్తుఁడయ్యెనుగాని మఱియొకవారము గడచులోపల మధురాంతక రాజరాజు లపహరింపఁబడిరి. రెండవ దినము హంతకులనుండియొకలేఖ వారిపై నాస వదలుకొమ్మనివచ్చెను.

ఆలేఖను జూచినంత నాసోదరద్వయ మందిన ఖేదము వర్ణనాతీతము. వారు హంతకులను ముక్కలు ముక్కలుగ జేయనెంచిరిగాని వారగుపడలేదు. వీరరాజేంద్రుఁడు సైనికుల నెల్లచోటుల నెమక నాజ్ఞాపించెను. జాడ తెలిపిన వారికి సహస్ర సువర్ణ నాణెముల బహుమతి నీయనుంటను దెలిపెను. ఉరయ్యూరునందలి పదునైదు వేల జనులును కంట దడిబెట్టి రనినచో మధురాంతక రాజరాజుల జనానురంజకత తెలిపి నటులగును.

నాఁటినుండియు తన ప్రభుత్వకాల మంతయు క్రీ. శ. 1062 వఱకును రాజేంద్ర చోళుఁడు రాచకార్యములందు పరాఙ్ముఖుఁడై యుండెను. సర్వవిధముల సమర్థుఁడగు వీర రాజే రాచకార్యముల చక్కఁజూచుకొనుచు సైనికబలమును వృద్ధిపఱచుచు పశ్చిమ చాళుక్యుల నాయకుని ఆహవమల్లుని మదమడంప నెడతెగని యత్నములతో స్థిరసంకల్పుఁడై యుండెను.

దశమ ప్రకరణము.

అది మంత్రాలోచన మందిరము. అందు నార్గురు పురుషు లుపవిష్టులై యుండిరి. వారు కార్యాలోచనము

సేయుచుండిరని చెప్పుటెందులకు? వారి భాషణముల వినిన జాలదా!

“ రాజేంద్రా! ఉన్నటులుండి యిటుల లోనరించితిమేని పౌరు లనుమానింతురు. ఎవరితోఁ బోరి మన సేనానులలో సగ్రగణ్యుఁడు మరణించెనో వారితో సఖ్యము నాకు సరిపడదు.”

“ సేనానీ! ఇంకను విక్రమునిపై నభిమానము వదల వైతివి. దురదృష్టవశమున నాతఁడు బ్రతికియే యుండినను నీకు సేనాధిపత్య మీయ మనరాజుగారు తలంచియుండిరి. అది యటులుండ కొప్పముకడ సమరము జరిగి వత్సరము మించిపోయినది. రాజ్యతంత్ర చాపల్య మెఱిఁగినవారు మన యాచరణమునకుఁ గారణమును విచారింపరు. ఇతరుల విచారమూ మనకు గ్రాహ్యము కాదు.”

“ అవును అంతియే”

“ వ్రతము చెడినను సుఖమైనను దక్కవలయును. మన యీ కార్యాచరణము వలని ఫలము?”

“వీర రాజేంద్రుని వీరత్వము మనకుఁ దెలియనిదిగాదు. ఆతఁడు దక్షిణ భారత దేశముపై నేకచ్ఛత్రాధిపత్యము వహింపఁదలఁచి యున్నాఁడు. ఇతర రాజ్యమున రాజకీయ తంత్రముల సూక్ష్మబుద్ధిని పరికించితిమేని యాతని మనోరథ మీడేరుననుటకు సందియ మిసుమంతైనను లేదు.”

" అతఁ డేకచ్ఛత్రాధిపతియగుటకు మన సహాయ మెందులకు ? "

" రామసింహా! ఆతురతను మానుము. ఆతఁడు చక్రవర్తియగుట మనకు లాభదాయకమనుటకు నిమిత్తము లేకపోలేదు. పల్లవులతో సంబంధముగల మనము, మనపొలిమేరనానుకొనియుండు సింహపుర ప్రాంతముల స్వాధీనపఱచుకొనుట కష్టముగ నున్నది. కారణాంతరములచే మనపైసు సింహపురాధినేత తనయపై కుపితుఁడై యున్నాఁడు. నీబోఁటి పరాక్రమవంతుల సాయముండిన వీరరాజేంద్రుఁ డాహవమల్లుని లోఁబఱచుకొనఁగలఁడు. లోఁబఱచుకొను టేమి పరాజితు నొనర్పఁగలఁడు. అందుపై నాతనిధాటి కడఁగి యుండు కాదంబులు గాంగులు చోళులకు లోఁబడుదురు. అంత మన సహాయముగలవాఁడగుట నవసరకలహము బెట్టుకొని పల్లవుల నెదుర్చును. దక్షిణోత్తరములందు శత్రువులుంట నరసింహవర్మ చోళులకు పాదాక్రాంతుఁ డగును. అట్టిచో తనకు దక్షిణ భుజమై వర్తించిన మనల కాతఁడు మఱువక కొంత దేశము నీయ నిష్టపడును. అట్టితఱి మనము పల్లవ రాజ్యములోఁ గొంత భాగమును, పశ్చిమ చాళుక్యరాజ్యమునం దొకింతయు నభ్యర్థింతము. నినుబోఁటి వీరాగ్రణుల యునికి నెఱింగినవాఁడగుట తప్పక మన వాంఛితముదీర్చును. అట్టిచో విచారింపుము? అతని సామంతులలో బలవంతులమగు మన మాడించినటు లాడక తీరదు. మన పూర్వులు రాష్ట్రకూటుల నడంచి ప్రతిభగాంచిన విధమూహించితివేని చోళ

భూపాలకుఁ డాసించు చక్రవర్తిత్వము మనకు రావచ్చును. సేనానాయకత్వము పోయి సామంతత్వము నందవచ్చును. "

"మంత్రివరా! ఇక చాలును. మీ మాటలచే మునీంద్రుడనైన రాజ్యకార్య ప్రవేశము గలవానిగ నొనర్ప గలరు. ఇవన్నియు రిత్తకోరికలు కావచ్చును. ఈ యాకాశ హార్మ్యము క్రిందపడవచ్చును. "

"ఇవియాకాశహార్మ్యములుగావనుటకీలేఖ పఠింపుము. మహారాజుగారుమఱియొకమాఱు వినగోరి యుండిరి." ఆలేఖ నందుకొని రామసింహుఁడిటు చదువ నారంభించెను.

" మహారాజ విజయాదిత్యునకు చోళనాయకు ననుమతిని వీరరాజేంద్రుఁడు వ్రాయులేఖ—

మీ వంశమునకును మావంశమునకును చిరకాలము నుండి వచ్చెడు బాంధవ్యమును బాటింపక యనవసర మన స్తాపములతో మీరుమావిరోధియగునాహవమల్లునిపక్షమునఁ బోరాడితిరి. అందులకాక్షేపించుటలేదు. గతజలసేతు బంధనముమాని యిపుడు మేము మీ మైత్రి నభిలషించుచుంటిమి. అయ్యది మీకు వెఱచిమాత్రము గాదు. మీ వీరత్వమును బ్రశంసించువాఁడనై యిట్లు లభిలషించితిని. పూర్వమునుండి యుండిన బంధము ననవసరముగ త్రెంచుకేల? అని యిటు వ్రాయుటైనది. త్వరలో మఱియొక లేఖ రాగలదు. "

మీ మైత్రి నభిలషించు,
చోళ సర్వసేనానాయకుఁడు
వీరరాజేంద్రుఁడు.

"దీని పైననా మీ రన్నియూహలఁ దలంచితిరి"

"కాదు కాదు, ఇదిగో నుము. దీనిఁ జదువుము"

మరల నతఁడిటు చదువ నారంభించెను.

ప్రియమిత్రునకు,

నీవనపత్యుఁడవని యెఱింగియు, నన్యవనితాన్వేషణము లొనర్చుటఁ దెలిసియు మాసోదర తనయను రూపాతిశయ విజిత సురలోకసుందరీబృందను, మధురాంతరనా కె సోదరు నితో నంపుచుంటిని. వీరు హంతకులచే నపహృతులైరని నాసోదరుని తలంపు. పదునైదు దినములలో నారు మీ పొలిమేరఁ జేరఁ గలరు? తగిన పరివారముతో వారిని రహస్యముగ గొని సాధ్యమైనంత త్వరలో వివాహమాడునది. ఈ కార్యమును గమనించియైన నాకు నీయెడఁ గలుగు విశ్వాసమును గమనించి మనఃపూర్వకముగ సాయ మొన ర్చుట కొడంబడవలయును. నాలుగైదు మాసములు గడచు లోపల తుంగభద్రాతీరమునకు సైన్యములఁ దీసికొని పోవ సంకల్పించు కొంటిని. వీలైనంత వఱకు సైన్యాభివృద్ధి నొనర్చి యుంపవలసినది. ఈ తూఱి పశ్చిమ చాళుక్యులు రూపఱవలయును.

నీహితైషి,

వీరరాజేంద్రుఁడు"

"రామసింహా! ఇందుల కేమందువు"

"మీచిత్తము వచ్చినటు మెలఁగెద నందును"

“ఇప్పుడొకటి చేయవలయును. పదుగురు భటుల కృష్ణానదిని దాటి యావచ్చు మధురాంతకదేవిని రాజరాజును, నిశాప్రయాణముల నిటఁ జేర్చవలయును.”

“ఎవరు నేనేనా ?”

“నిను మించిన సమర్థులేరీ”

“ఇంకను నాలస్యము గలదు గదా”

“అదియే గట్టిచిక్కు. ఆ ద్వితీయ లేఖఁగొనివచ్చిన పురుషుఁడు మార్గమధ్యమున నాఁగవలసివచ్చుట నింకనొక్క దినములో వారు విజయవాఁడ కరుదెంతురు. శీఘ్రముగ వెళ్ళవలయుననిన నీవసమర్థుఁడవు”

“మీయాజ్ఞ కన్యథావర్తింప నెంతటివాఁడను”

“మహారాజా! నేదెల్పలేదా? రామసింహుని మించిన కార్యశూరుఁడు, వివేకి మన వేంగిరాజ్యమున లేఁడు”

“ఆ భూషణ కేమి లెండు. విజయసింహుని గొని పోవుదునా?”

“వలదు వలదు. వాఁడు సింహపురినుండి వచ్చిన దాది నిడక యాలోచనాసక్తుఁడై యుండెను. యువకుఁడైన యాతఁడా కార్యమునకు సమ్మతింపఁడు. సహజపరాక్రమ ధురీణుఁడవగు నీకాతని సహాయమెందులకు? పొమ్ము. ఇందు సహాయమెందులకు? ఆ వచ్చెడివారు నిను దెల్పుకొనిన మాత్రమున వెంబడింతురు?”

“చిత్రము.”

సంభాషణమునుబట్టి విజయాదిత్య నారాయణభట్ట రామసింహులు పాఠకులకు దెలియనైరి. తదితరులు రాజకీయోద్యోగులు. వారు వినుటకేగాని మాటాడ వచ్చియుండలేదు. రామసింహుని మానసము డోలాయమానమైయుండినది. దానిని మహామంత్రి తనవాచా చమత్కృతిని తనవైపునకు ద్రిప్పుకొనియెను. అతడు విక్రమునంతటి వీరుడు గాకపోయినను రణాంగణమున వెనుకంజవేయని ప్రతిభాశాలి. ఆశావిష్టుడు గాకుండినను యశోభిలాష గల పూరుషుడు.

ఆతడు రాజమంత్రులకు నమస్కరించి వెనుదిరుగు లోపల నొకచుట్టియ తాటాకుచే జుట్టబడినదై యాతని ముందుబడెను. చకితుడై యా వీరాగ్రణి దాని గంపితహస్తుడై గైకొనియెను. అందు

“వీరాగ్రణీ! రామసింహా!

ఎంతటియవివేకివి. నీజనకుని ద్రోహమును బాటింపక నిను దగ్గఱతీసిన రాజరాజనరేంద్రుని రాజ్యము నొక సామంతరాజ్యముగ సలుప నిచ్ఛగించితివా? దేశభక్తి యింతకరుదెంచెనా? నీ రక్తనాళములందు స్వేచ్ఛయనునది ప్రవహించుటలేదా? అయ్యో! చాళుక్య రాజ్యరమా! ఎంతటివారల గనిన నీవు దాస్యము సలుపవలసి వచ్చుచున్నది. ఓయి వీరుడా! నాడు ఆచార్యవర్యుడధర్వణాచార్యులుగలసియుండనీవు రా వారు స్వేచ్ఛనుగుఱించి యెంత

గంభీరముగ నుపన్యసించిరి. ఆనాటి నీయుద్రేకమునటనయా? వలదు. వీరి కుత్రిమోపాయములకు లొంగకుము. సైన్యాధిపత్యము వదలుకొనుము.

నీహితైషి,

'వనకేసరి' అనియుండెను.

అది చదివి రామసింహుఁడు విభ్రాంతుఁడై పోయెను. అతని ముఖభావముల గమనించుచుండిన నారాయణభట్టు దానిఁగొని చదివి "రాజచంద్రా! ముందీ 'వనకేసరి' ని బట్ట వలయును. వీఁడనవసర జోక్యమును మన కార్యములందు వహించుచున్నాఁడు. ఓయీ! మీరు లెండాతఁడిటనే యుండవలయు. రాజభవన రక్షకులతో నెవరినిగాని వెలికేఁగ నీయరాదని యంతఃపురమనియైన గమనింపక గదులనన్నిటి బరికింపుఁడు. సజీవునిగనైన నిర్జీవునిగనైన వానిఁ గొనిరావలయును" అని యాజ్ఞాపించెను. అతఁడే రాజను సందియమును నూతనులు వినిన నందకపోరు.

ఒక వికటాట్టహాసము వినఁబడుటనా వనకేసరి యటనే యుండెనని తెలిసి యా నియోగిత్రయము వెనుకంజ వేయుచుండెను. రామసింహుఁడు వాలు వెఱికి ముందుకేఁగ వారాతని ననుగమించిరి. ఒక్కింత వెనుకగ నారాయణభట్టు పోవుచుండెను. ఆ విశాలంపుగది కవాటమునులాగిరి. అదిరాలేదు. ఆనలువురు తమబలము నుపయోగించి లాగ తటాలునఁ దెఱచుకొనుట వారొక్కింత స్థూలకాయుఁడగు మంత్రిసత్తముని పైబడిరి. వారిని వెన్నాడు విజయాదిత్యుఁడు

వారుతగులకయే కూలబడెను. భయము కారణమేమో! వారు గది నిర్గమించు నప్పటికి నన కేసరి యొక్క మలుపు తిరుగుటను గమనించిరి. వారట కేగునప్పటికట నెవ్వరును లేరు. అందులో నౌకరు రాజసౌధ పాలకుల కెఱుక పరుప పరుగిడెను.

ఒక పాతికగడియలో నాభవనము రాజభటులచే చుట్టబడెను. ఒకరైనను వెలుపలకేఁగ కూడదను శాసన మొనర్పఁబడెను. రాజాంతఃపురము నిశ్శబ్దమునకుఁ దావల మయ్యెను.

ఏకాదశ ప్రకరణము.

"మాధవ నీదయారసము మమ్ముల జేరగ నీవ దేలనో!
సాధిత భక్తి నిన్ను మనసార నుతించుట నాలకింపవో"

"ఎవరిది యటుల శబ్దము చేయుచుండిరి ? విశ్రాంతి నందుట కిచ్చగింపరా !" అనుచు సారంగధరుఁడు దరహాస సుందరవదనారవిందుఁడై తన గది కవాటమును తెఱచెను. రామసింహుఁడు నియోగులతో నట ప్రవేశించెను. వారల హస్తములందలి కృపాణముల జూచి కంపితుఁడగుచు "ఏ ఏ ఏల - నే నే నేమి అ ప రా - రాధ ము సలిపితిని" అనెను.

"కుమారా! భయపడకుము. ఇట కెవ్వరైనవచ్చిరా ? సారంగధరుఁడు దిక్కులు పరికించి "ఎవ రెందులకు వత్తురు ?

నాకవితవిన నెవరుగాని యభిలషించుట లేదు. అందు లకు నేనే___

"అదియుండనిమ్ము వనకేసరిని చూచితివా ?"

"ఆ___"అని యఱచి యెగిరి రామసింహుని గఱచుకొని "అయ్యో! ఆ కరినఁ డిట కరుదెంచెనా ? ఆ సర్పము రాజభవనముననే ప్రవేశించెనా ? ఇఁకేమిగతి ? రామసింహా! దయచేసి వానిఁ బట్టివేయుమా ? నాకు నిద్దుర యనునది రాదుసుమా ! నీకు పున్నెముండును, వాని బట్టు వరకు నాయసువులు కుదుట బడవు అయ్యో !" అని వగవ నారంభించెను.

"కుమారా! భయపడకుము. ఈ నీ సేవకుని జీవిత ముండువఱకు నిన్నొకరును నొప్పింపఁజాలరు. నీజనకుని కృపారసము మఱచునంతటి కృతఘ్నత రామసింహుఁడు బడయలేను." అని దరహాస మొనర్చి యచటి నియోగితో నింకొకగది నెమక వెడలిపోయెను.

రాకొమరుఁడొక నిట్టూర్పుబుచ్చి సహజదరహాసముతో "సాధు లికేరుగాని నిను సాయము రమ్మని కోరు చుండిరో"

"రాకుమారా! నీ నటనా కౌశల్యమునకు సంత సించితిని"అను కోమలనినాదము విననయ్యెను.

సారంగధరుఁడావైపు తిరుగ శయ్యకడనుండి మదాలస లేచుచుండెను. అటు చూచిన రెండు క్షణములకు

"తల్లీ ! నమస్కారము. తనయుని కవిత వినుచుంటిరి కాఁబోలును. ఏమి వాత్సల్యము."

"ఆ సంబోధన మానగోరి వత్సరమయ్యెను."

"అది మానుటెటుల ?"

"నావాంఛ తీర్చుటవలన"

"శోధన సల్పగాఁ దలఁచి సుంతయు నన్గనకుంటి వేమొకా."

"నన్ను మఱింత మరులుకొల్పు టెందులకు?"

"ఇటు వినఁ డాశువు."

"మాధవ నీదయారసము ♦ మమ్ములఁ జేరఁగనీవ దేలనో
సాధితభక్తి నిన్ను మన ♦ సార నుతించుట నాలకింపవో
సాధు లికేరుగాని నిను♦సాయము రమ్మని కోరుచుండిరో
శోధనసల్పగాఁదలచి ♦ సుంతయు నన్గకుంటివే మొకా.

ఎటులున్నది, నిషిద్ధాక్షరికంటె నిది కష్టమయ్యెను. భావములే సంపూర్ణముగ మాఱిపోయినవి. ఏమి చేయగలను ?"

"సారంగధరా ! వియోగులనేచు సారంగధరనామము నీకుఁ గలుగఁబట్టియా ఈకాఠిన్యత. మోహనాంగా ! నీకవిత యెవరికిఁ గావలయును ? నీ కవిత, నీ సౌంర్యము, నీశేవి దలంపని క్షణము నాజీవితమునం దేది ? అయ్యో ! మారసుందరా? ఏల యీకాఠిన్యము. గానవిద్యారస పారీణుఁడవగు నీ కింతటి పాషాణ సదృశ హృదయ మేల ధాతయొసంగెను?

మనోహరా! నీకొఱకుగదా? ఆలేఖను జూచియు నానాథుఁడు నన్నపహరింప చోరనాయకునకు ధనమొసంగెనని తెలిసియు నిట కరుదెంచితిని. నీ వదనేందుమండల మరీచీ జాలములఁ జూడనిదినము దుర్దినమని భావించితిని. నీవాక్సుధ దూరము నుండియైనఁ విననిది శాంతియన నెఱుంగకుంటిని. సారంగధరా! ఆనాఁటి నీచిత్తరువును హృదయమునకు పలుమాఱు హత్తుకొనని దినమున్నదా? ఎందులకింత కఠినుఁడ వైతివి. నీభీరుతానటనమైన నను మోసగింప దయ్యెను. నీవు నిరక్షరకుక్షివై భిక్షుకుఁడవై యుండినను నినుమానియుండనుసుమా! ఓయీ! సారంగధరా! ననుగాపాడుము. నీపైని మోహమున వివశమై దర్పకునవర్గళాస్త్రములచే విచ్ఛిన్నమైన యీతనువు నీవేలరక్షించి మానినీ ప్రాణరక్షణ లాభము నందవు!”

అనుచు నా బింబాధరి మోకరించి నిమీలిత నయనయై బాష్పోద బిందువులు నునుచెక్కులపై బ్రవహించుచుండ నా రాకుమారుని జూచుచుండెను. సారంగధరుఁడావనిత వాగ్జాలమునకు విభ్రాంతుఁడై పోయెను. ఎటులాడుటకును దోఁచక స్తబ్ధుఁడై నిలచియుండి యెట్టకేలకు

“జననీ! వాచాదోషమున కేల గడంగెదు? ఇయ్యది దుర్వాంఛ; వదలుము. క్షణకాల సుఖమున కాసించి, తల్లీ! చిరకాల యమయాతనాసహనమున కేల యత్నింతువు? అమ్మా! నీ వేనాఁడు నాపితృవ్యుని జెట్టబట్టితివో నాఁడేపూజ్యవైతివి. నన్నెలయిట్టికలుషవాక్కులచేబలుమారు

బాధింతువు? మాతా! నీవనినటుల నేను నిను సంకటపఱు చుటలేదు. నీవేనాకు మనశ్శాంతి లేనటు లొనరించితివి"

"ఏమీ! నన్నుగుఱించి నీకు మనశ్శాంతి లేదా? ధన్యను, సారంగధరా! ధన్యను. నాపై నామాత్రము తలంపు గలిగి యుంటివా!"

"మాతా! పొరబడకుడు. మీ రూపమును సహాగమన మొనర్చిన మాతల్లి రూపముతో బోల్చుకొంటిని. నా యిష్టదైవమును మీ మనస్సు మార్ప వేయివిధముల బ్రార్థించు చుంటిని"

"అయిన నావాంఛ—"

అని పరభృత తిరస్కృత స్వరమై విపంచీ నినదంబు నధఃకరించు కంఠమున రోదన మారంభించెను. సారంగధరుని ముఖము వెల్లబారెను. అదిగాంచి యాకరతలోదరి వాని నాలింగన మొనరింపఁబోయెను. రాకుమారుఁడు నాఁకతిన ముగ ప్రక్కకుద్రోసి "తల్లీ! వదలుము." అని మృదు గభీరముగ పలికెను.

మదాలస విధానము మారిపోయెను. ప్రణయమధుర ములగు నయనములు రక్తిమములై నిప్పుకలగురియసాగెను. అధరము కంపింప సాగెను. వక్షోజము సంక్షుభితమయ్యెను. ఘోరా! ఏమి కలవాణుల విధానము.

మంజులాలాపములు పలుకునోట శాపములు బయలు దేఱును. పరిష్వంగ మభిలషించుచునే వినాశమును

వాంఛింతురు. ప్రేమ దృక్కుల ప్రసరించు నేత్రము లగ్నికణముల వర్షించును. మరువిల్లులఁ దలపించు బొమలు, ముడివడిన చీకటిని జ్ఞప్తిపఱచును. అబలలు, బాలలు, కొమ్మలు, లతాంగులు, భీతహారిణేక్షులని కవులు పొరబడి వాడుచుండవలయును. అంత కర్కశస్వరమున,

"సారంగధరా! నన్నొల్లవా ?"

"మాతా! సహస్రనమస్కారము లటులాడకుము"

"ఇఁక నీవు లేనివాఁడవే ?"

"చిత్తము"

"నీ ప్రచ్ఛన్నత, నీ వనకేసరిత్వము బహిరంగ మొనరింతును."

"ఏమి, ఏమనుచుంటిరి. వనకేసరిత్వమా ? మాతా! మీయభిమానమేమి ?"

"ఛీ! వదఱకు. ఎవరికడ నీచమత్కారము. ఇఁక మదాలస నీవగలకు బేలుపోవునదికాదు. ఇదిగో యీక్షణమే నీగుట్టు బయల్పఱతును. నిను మరణ శిక్ష నందజేతును. ఆ నీ కోమలాంగకములు ధూళి దూసరితముల నొనరింతును. క్రోల్పులితోనైన వైర మభిలషింపవచ్చును గాని నాతో విరోధమా ?"

"అమ్మా! నావనకేసరిత్వమునకు సాక్ష్యమో"

"సాక్ష్యమా! క్రూరుఁడా! ఇంకను మోసగించుటయా! నీధరించిన వస్త్రములను జూపిన."

"ఆఁ—అట్లులనా? ఏదీ? రెండు చూతురుగాని. మీరీనాఁ డుద్రేకపూరితులపై తిరి. శాంతింపుఁడు.

"ఓసీ! పాపండా! శాంతమా? నీ యసువులు వధ్య శిలకడ బోయినప్పటికి గాని శాంతియనునదిలేదు"

"అమ్మా! తనయుని మరణము తల్లియే కాంక్షించు నంతటి యదృష్టము. కానిమ్ము"

"ఓసీ! వగలమారీ! నీమాటల కిక చేలుపోవనలేదా? రమ్ము నీప్రచ్ఛన్నతను వీటిబుచ్చి నినుజంపింపఁజేతును"

సారంగధరుఁడు పలుకకుండెను. కంపిత గాత్రయగు మదాలస యటనుండి కష్టముపైఁ గదలి యొక పేటికను డాసెను. అద్దానిఁ దెఱచి యందలి వస్త్రములను బయట వైచెను. అందు వనకేసరి ధరించిన రక్తాంబరములు గాని యాతనివాలుగాని లేకుండెను.

"తల్లీ! పొరబడితిరి. వనకేసరికుండిన శౌర్యములో నాలవపాలు నాకుండిన యెన్నఁడో యిచ్చోటువాసి యరిగి యుండనా?"

"నే కన్నులార జూచితినే!"

"భ్రమ పోనిండు! పోయివిశ్రమింపుఁడు. అలసితిరి."

"సారంగధరా! అంత కనికరమున్న వాఁడవు నీ బాహువల్లరుల విశ్రమింపనిమ్ము. నాకఠినవాక్కుల గణింప కుము. రాకుమారా! నీయధరమును—"

"అబ్బా, తల్లీ! నారాయణ! నారాయణ!"

"అయ్యో! సుందరా! ననురక్షింపుము." అనుచు నిలువున కూలఁబడెను.

సారంగధరుఁడు విభ్రాంతుఁడై పోయెను. ఆయువ యచేతనయగుటకు భయంపడెను. సమీపమందలి జల కలశమును గొనివచ్చి యాయువిద బాష్పముల గడగి కపోలమును, గండస్థలములను శీతలోదకముచే నార్ద్రము లొనరించెను అటు లొనర్చుటలో నాసుగంధ తైల సంసిక్త మగు నాశిరము నంకపీఠ మంచుకొనియెను. వానివదనమా యరవిందదళేక్షణ వదనముండాసెను. వాని హృదయము తహ తహ లాడుచుండినది. తన పితృవ్యసతి తన వలన వినాశము నొందునేమో యను భయ మాతని బాహ్యజ్ఞాన శూన్యు నొనరించెను. యువతుల దైహిక పరిస్థితుల నెరుంగని రాజరాజనరేంద్ర తనయుఁడు శీతలజలము నూరక జల్లు చుండెను.

తటాలున మదాలస తన కరములచే నాతనిశిరమును వంచి తనివితీర ముద్దాడి యాతన్మయతవలన మూర్ఛిల్లెను. సారంగధరుఁడు మదాలస నటన గుర్తింపనివాఁడగుట వలన విభ్రాంతుఁడైపోయెను. ఉష్ణములగు నోష్ఠముల స్పర్శనమున నాతఁడు తత్తరపాటునంది మూర్ఛితయగు మదాలస శిరము గ్రిందబెట్టి నిలువఁబోవుచుండెను.

"ఓరీ! అంతఃపురద్రోహీ!" అనుమాటలు కశా ఘాతములవలె నాతని చకితు నొనర్చెను. అటుచూడ

నారాయణభట్టద్వితీయుఁడై యూమదవడల పితృవ్యుఁడు నిలచియుండెను.

"కులోత్తుంగా! నీవలన మావంశమున కపకీర్తి కలిగెను." 'తులసి మొక్కలనడుమ కంటక వృక్షమవై' యెటుల దాపురించితివి. అట్టిసోదరునిఁ గోల్పోయినది నీఁబోటినీచుని గాంచుటకా? నీకు స్వాతంత్ర్య మొసంగుట యిందులకా? జనని విషయముననే యపచార మొనర్చిన పరమపాపివి. ఛీ! నీముఖము చూడరాదు. నా రాజ్యము నుండి కదలుము."

"పితృవ్యా! మీరింతగ నాయూసపడ నవసరములేదు. మీయాజ్ఞ జవదాటను. ఇదె మీభూమి వదలువాఁడను. వదలిపోవుట మీయాన ననుసరించి కాని దోషినై కాదు. ఆ మానవతి విషయమున నే ననపరాధిని."

"చాలును. ఇఁక మాటాడవలదు. ఇఁక నాసతి నీపైఁ బడ నరుదెంచెనని చెప్పఁబోవుదువు జాగ్రత్త."

"పితృవ్యా! మీరు నాస్వభావ మెఱుంగనందులకు విచారమయ్యెడిని. అయినను నష్టములేదు. ఇదె మీసతీ మణిని గొనిపొండు. ఒక గడియకుపైగా మీరాజ్యమున నను జూడఁజాలరు" అని యచటు బాసెను.

నృపసచివులు నవ్వుకొనుచు దాసీజనమును బిలిచి, మదాలస నామె శయనాగారముఁ జేర్ప నాజ్ఞాపించి వారును వనకేసరి యన్వేషణఫలితము గనఁగొననేఁగిరి.

సారంగధరుఁ డంతఃపుర ద్రోహ మొనరించుట దేశ భ్రష్టుఁడయ్యెనని పురముసఁ దెలిసిపోయెను. పౌరులందు స్వతంత్రవాదులగు వారును, రాజరాజ నరేంద్రునిపై నభిమాన మమితముగఁ గలవారును, నాక్షేపణా సూచకములగు వాదముల నటనట సలుపుచుండిరి. ఆకాలమున 'నావిష్ణు పృథివీపతి' యనుట ప్రజలకు వేద్యమగుడు నాక్షేపణలు రాజు చెవి కెక్కకుండునట్లు లొనరింపరైరి. అటులొకటి రెండు వచ్చినను నారాయణభట్టు తన శాసనాదికములచే సారంగధరుని మానముచే ధనాదిక దానములచే మాయించెను. సమర్థుఁడగు సచివుఁడుండిన నేదికాదు.

ద్వాదశ ప్రకరణము.

విజయవాడ గ్రామముకాదు, అట్లు పత్తనముగాదు. దాని నాయకుఁడు సామంతప్రభువు కాకుండినను పరాక్రమవంతుఁడే. అతఁడు విజయాదిత్యునకు మిత్రకోటిలోనివాఁడు. రాజరాజు మరణింపకుండిన, భుజబలసహాయమున రాజ్యమును మిత్రునకు నార్జించి యొసంగ నిర్ధారణ మొనర్చియుండెను. అతఁడు రామసింహుని రాకను దత్కారణమును విని చాల సంతసించెను. ఒకరిద్దఱుభటులతో సరుదెంచిన యాచాళుక్య సేనానికి పదుగుర వెంటనిచ్చి భవిష్యచ్చాళుక్య రాజ్ఞి తగు నాడంబరమున నెదుర్కొనఁబడ వలయునని వచించెను.

నావ సిద్ధపఱుపఁబడెను. రామసింహుఁడు పరివారముతో దాని నధిరోహించెను. పవమానుఁడు సౌమ్యుఁడై యుంటవలన, నావకృష్ణానదిని సుఖముగ దాటెను. ఆ కాలమునందు కృష్ణానది దాటిన పిదప దక్షిణమున నిబిడారణ్యము శతక్రోసులు వ్యాపించియుండెను. ఆయరణ్యమునందొక్కంత భాగము పల్లవుల యధీనమందుండినది. కాన చాళుక్యసేనాని యెట్టి భయమునుగాని చెందక పయనముసాగించుచుండెను.

పల్లవుల పొలిమేర నొక బోయపల్లియు యుండినది. అక్కడి కేఁగునప్పటికి వారువము లలసి యుండబట్టియు, సాయంకాలము కావచ్చుటంబట్టియు నట విశ్రమించిరి. నాగరకుల రాకవలన నాటవికు లన్నివిధముల సౌకర్యముల గల్గించిరి. విశాలమగు గుడిసెయొకటి రామసింహుని యధీనమొనరుపఁబడెను, ఇతరులు సమూహపుటిండ్ల విడిసిరి. రామసింహుఁడు పల్లియవడలి కాననమందలి సూర్యాస్తమయ శోభ పరికించుచుండెను. అంధకారము వ్యాప్తమైన పిదప గ్రామమును బ్రవేశించి యాటవికులొసంగిన యాహారమును గొని విశ్రమించెను.

చేతి కందకపోయిన వనకేసరి యాతని హృదయమునం దనుక్షణమును నూతన సంకటమును గలిగించుచుండెను. ఆతఁడు వ్రాసినలేఖ యందలి ప్రత్యక్షరమును నాతని మనోవీధిని ప్రతిబింబితమై యుండినది.

స్వతంత్ర రాజ్యమగు పూర్వ చాళుక్య రాజ్యము సామంతరాజ్య మగుటవలన నష్టము లేదని రామసింహుఁడు

భావించుచుండెను. సామంతత్వమని యనుటకును వీలుకలుగ దయ్యెను. నన్నపార్యుఁడే 'సఖ్యసంబంధములఁ జేసి చక్రధరుఁడు ద్రుపదుఁడును అరినొసంగి' యుండలేదని వ్రాసి యుండెను. అట్టిచో చోళరాజు కన్యను వివాహమాడఁగల విజయాదిత్యుఁడు సామంతుఁడెటులగునని యాతనియూహ. ఏదియెటు లుండినను చోళులతోఁ గూడి పశ్చిమ చాళుక్యుల జయించుట నిజభుజబల మగుపఱుపఁదగిన యదనని యాతఁడు భావించి యుండెను. శస్త్రోపజీవికి రణాంగణ విహారమున నందును విజయమును విశ్వసింపదగిన పక్షమున బోరుట కంటెను వాంఛనీయ ముండునా ?

మఱి వనకేసరి యెవరు? ఆతఁ డట్టి పౌరుషఖనియై యుండియు నేరాజు నాశ్రయింపక యేకాకియై యుండ నేల? రాజనారాయణ బిరుద మందఁ గలిగిన యా వీరునకు పూర్వచాళుక్యులతోఁ గల సంబంధ మేమి? రత్నసింహు నడంచుటయు విజయాదిత్యు నవరోధించుటయు నతఁడు విని యుండెను. అట్టి యాచరణములకుఁ గారణ మేమైయుండును? ధర్మపథావలంబియగు నా పురుషుఁడు స్వయముగ నొక రాజ్యము స్థాపించుకొనక కాలము వ్యర్థపఱుప నిమిత్తమేమై యుండును? ఎంత విచారించినను వనకేసరి నిగూఢ ప్రవర్తనకు నిమిత్తమాతఁడు గ్రహింపఁ జాలకపోయెను. రాజమహేంద్రవరమును జేరిన పిదప వాని వృత్తము నెఱుంగ ప్రబలయత్న మొనర్పవలయునని యాతఁడు నిశ్చయ మొనరించుకొనెను.

భానుఁ డుదయించిన రెండుగడియల వఱకు నాతఁడు మేల్కాంచి యుండలేదు. భాను కిరణములే యాతనిఁ బ్రబోధితునొనరించెను. సాతురుఁడై లేచి తనను మేల్కొలుప నందులకుఁ దనవెంట నరుదెంచిన వారిని చీవాట్లు పెట్టి కాల్యములఁ దీర్చి యాపల్లియను వదలి యటవినిదాఁటి వేచి యుండెను. మధ్యాహ్నమైనను చోళులయాగమనంపు జాడ పొడకట్టదయ్యెను. వన్య ఫలములచే క్షుత్తుఁ దీర్చికొని సాయంకాలము వఱకు వేచియుండెను. ఫలములేదయ్యెను. ఒకరిద్దఱు ముందు పల్లెల కంపి మరల తానా బోయపల్లెను జేరెను. ఆ నిశి నెటులేని గడపి వఱువాత లేచి మరల పూర్వదినస్థిత ప్రదేశమున నుండిపోయెను.

మధ్యాహ్న మగునప్పటికి తానంపిన భటులరుదెంచి చోళుల యాగమనమును దెలిపిరి. అంత నొకింతవడికి పదుగురు చోళులు పల్యంకికల రెంటిని గొని యట కరుదెంచి గమనాయాసమును జూపు చోళులతో నట నొకటి రెండు గడియలు విశ్రమించి చరమ దిశాంగనఁ జేర భానుఁడు బోవు సమయమని భావించి పయనము సాగించిరి. పల్యంకిక లుండుట వలన నంధకారము భూభాగమునందు వ్యాప్తమగు నప్పటికి బోయపల్లియను జేరిరి.

పల్లకులు రామసింహుం డుండిన విశాలకుటీరమునం దుంపఁబడెను. ఆటవికులు రాజవంశమువారి రాకను దెలిసి మృదులములగు నాహారముల సిద్ధపఱచి యటకుం

గొనివచ్చిరి. రామసింహుఁడు భయ వినయములు ముప్పిరి గొన సహజంపు రాజభక్తి పిక్కటిల్ల పల్లకుల కవాటముల దెఱచి విభ్రాంతుఁడై పోయెను. అందు ముసలి దంపతు లుండిరి. మధురాంతక రాజరాజు లెటపోయి యుండురని తోఁచినంత నాతని గుండియ ఝల్లుమనెను. దేహము కంపిత మయ్యెను. విజయాదిత్య నారాయణ భట్టులను దలంచి వారికేమి సమాధానముఁ జెప్పవలయునా యను విచారము ఘనమైపోయెను. వనకేసరివాక్యముల వలన దాను కార్య భంగ మొనర్చెనని వారెక్కడ తలంతురోయని యాతఁడు భయపడ సాగెను.

భటునొకని బిలిచి చోళులలో నాయకుని బిలువ నాజ్ఞాపించెను. వాడేఁగి పది క్షణములలో నరుదెంచి వారెవ్వరు అగుపడలేదని తెలిపెను. రామసింహుని హృదయ మాఁగిపోయి నటులయ్యెను. దిక్కుదోఁచక కూర్చుండెను. అదంతయు వనకేసరి కారితమని యాతని యంతరాత్మ కెవరో తెలిపినటు లుండెను. తా వచ్చునప్పటికి రాజ మహేంద్ర వరమునందు దాగియుండిన వనకేసరి యదంతయు జేయు టసంభవమని యాతఁడు భావించెను. "ఓరీ! ఎవ రచట?" అని యనబోవ "రామసింహా! నామాటల వినని ఫల మనుభవింపుము." అను వారిద గంభీర స్వనము విన నయ్యెను. అతఁడటుచూడ ద్వారముకడ ఖడ్గహస్తుడై వన కేసరి నిలచియుండెను. భ్రాంతియని రామసింహుడది విశ్వ సింపక పోయెను. కాని వనకేసరి సమీపించినంత నిజమని

యెఱింగి తానెఱుఁగకయే యొరనుండి కత్తినిలాగెను. వనకేసరి హాసమొనరించి యాసేనాని కరవాల కరమును బట్టుకొనెను. మహా బలశాలియని పేరువడసిన యాతఁడు వ్యాఘ్రముచే బట్టుకొన బడిన బాలునివలె విడిపించుకొన నశక్తుఁడయ్యెను.

అట్టిసమయమునం దితరు లేమిచేయుదురో సేనానియు నట్లే యొనరించెను. తన పరివారమునకు కేకవేసెను. వారొక్కపెట్టున లోనికురుదెంచిరి. వనకేసరి వికటముగనవ్వి రామసింహుని కరవాలము లాగుకొని, "ముందుల కొక యడుగు వేసితిరా మీనాయకుని జీవనము హుళక్కి యని యెఱుఁగుఁ"డనెను.

విజయవాడ భటులలో నొకఁడు ముందున కరుదెంచి ముంజేయి పోఁగొట్టుకొనెను. అంత రామసింహుని వారి కడకుఁద్రోసి, "కానిండు. నా కరవాలము మీ రక్తము చవిచూడ గోరుదురేని నేనేల వలదనవలయు" ననెను. చేయినఱకించుకొనినవాని కైదువు కరమునఁగొని సింగపుఁ గొదమ భాతి రామసింహుఁడు వనకేసరిపై దుమికెను. వనకేసరి ప్రక్కకొక్క యడుగువైచి రామసింహు కాళ్ళ నడుమ కాలునుంచి త్రోసెను. ఆత్రోపున కా సేనాని మృత్తికా కుడ్య సమీపమునంబడి యంతలో లేచి వనకేసరిపై కరుదెంచెను. వాని పరాక్రమమునకు మెచ్చుకొని వనకేసరి ఖడ్గద్వయమున భటులను సేనాని నొకేమా రెదిరించెను. ఎవరికిని దెబ్బ తగులలేదు.

తన కత్తులతో వారల వెనుకకు తరమెను. వారుపురల తటాలునపైకిరా వారి మధ్యభాగమునుండి నాలుగడుగులు వెనుకకరిగెను. దానివలన భటులును సేనానియు సంఘూర్ణమైరి. సేనానివాలు విజయవాడ భటునిలోనికి దూసికొని పోయెను. దానిని బలముగలాగి రామసింహుఁడు వనకేసరిపై విసరెను. వనకేసరి తన కరవాలమును క్రిందుగ రానిచ్చి దానిఁగొట్టెను. పిడివఱకువిఱిగి యది మఱియొక భటునికిఁ గ్రుచ్చుకొనెను. వనకేసరి వామకరమందలి వాలుతో నొక భటుని ఏమరుపాటునరా జూచువానిఁ బడవైచెను.

వాని కరమునందలి క్రైదువును రామసింహుని కడకు త్రోసివైచి భటులవైపు మొమకుటచే వారందఱును కవాటమునుండి వెలువడిరి. రామసింహునిపై యాసవదలుకొని వారు పఱుగిడిరనినచో సత్యమునకు దూరముగాదు. రామసింహ వనకేసరు లొక్క యఱఘడియకాలము పోరాడిరి. వనకేసరి కొక గాయమును రామసింహునకు మూఁడును దగిలెను. చాళుక్యవాహినీపతి యలసిపోయెను.

వనకేసరి పల్లకిలోని యొక వస్త్రమును నీటఁదడిపి గాయమునకుఁ గట్టుకొనుచు "రామసింహా! నా యస్త్రవిద్య యెట్టిదో యెఱింగితివికదా? మీరాజు కాముకుఁడు. పల్లవ రాజతనయ విషయమున సల్పిన యత్యాచారమును విని యుందువు. జితేంద్రియులుగా నుండవలసిన రాజులు వివాహముకాని యువతుల విషయమునం దట్లు ప్రవర్తింప

నగునా? విచారింపుము. రాజకార్యతంత్రముల నెఱుంగని యాతని సేవించుటయగాక స్వాతంత్ర్య మనుభవించు భూమి నొకనికిలోఁబఱచు టేటి న్యాయము? పోనిమ్ము. నాకెందులకు? నీ వభిమానివనియు, దేశభక్తుఁడవనియు హెచ్చరించితిని గాని ఫలము లేదయ్యెను. పర్వతాగ్రమునుండి పడువాని నెవరాపగలరు? దేశముతోఁబాటు మీరును నాశనముకండు. మీ యేలికపై నొకానొక కారణమున కత్తి నెత్తనైతిని గాని లేకున్న నీపాటి కతఁడేమైయుండునో దైవమున కెఱుక. అది యుండనిమ్ము. ఈలేఖను గొనుము. మీ రాజచంద్రున కొసంగుము. ఈ కార్యమునందు నీదోస మిసుమంతయు లేదని యట వ్రాసియుంచితిని" అని యొక తాళపత్రము నటవైచి వనకేసరి యథేచ్ఛ నరిగెను.

రామసింహుఁడు కష్టముపైఁ దనభటుల రప్పించి వారిచే గాయములఁ గట్టించుకొని యాలేఖను జదువ నారంభించెను.

"చాళుక్యరాజచంద్రునకు నమస్కారములు.

మీ రేవాంఛతో మధురాంతకదేవి రాక కొనసందింతురో వాసంతికవిషయమునఁ దమ ప్రవర్తన నెఱింగిన నాకుఁ దెలియును. మధురాంతక రాజరాజుల నాకారణమును బట్టి నాకడ నుంచుకొనదలంచితిని. బహుభార్యాపేక్ష వలదనను గాని ధనమును అధికారమును ప్రేమించు వనితల నెందఱనైన గ్రహింపనగును. ముగ్ధలమనసు స్వాధీనపఱచు

కొను శక్తులందొకటియైన మీకడ లేదని యనినందులకు క్షమింపవలయును. మధురాంతక రాజరాజు లపహరింపఁ బడిన రెండవదిన మా పల్లకుల మీ సేనాని జూచెను.

మీ రిఁక పారమార్థిక చింతతోనుండిన నెల్లరకు మనశ్శాంతి కలుగును. మీ సచివ శిఖామణి రాజకార్యముల పరిచూచుకొనును. మీకెందుల కాయాసము? మీనుండి యుఁవతుల తప్పించి నందులకు క్షమాపణము వేఁడు

'వనకేసరి'."

రామసింహుని మనోభావముల స్థితి మనకవసరము లేదు. మఱి నాలుగుదినముల కతఁడు రాజమహేంద్ర వరము సేరెననియుఁ దఱువాత రెండుదినముల కుద్యోగ మును వదలుకొని మిక్కిలి యాప్తులగు నూర్గురు భటులతో దక్షిణముగ వెడలిపోయెననియుఁ దెల్పిన చాలును. బళిరే! మానధనుల ప్రవర్తనము! అభిమానము, ఆత్మగౌరవములేని పురుషుఁడు నిరర్థకజీవనుఁడని పాఠకులు గ్రహింతురు గాఁబోలును.

త్రయోదశ ప్రకరణము.

"విజయా! నామైత్రి పాటించియైన నావెంట రాఁగూడదా?"

"ఎందులకు?"

"పరాక్రమశాలినివగు నీ సామీప్యమున నిర్భయముగ నుందును?"

"సారంగధరా! వీరకులోచిత భాషణములు నీకడ లేకపోయెనేయను విచారము నాకెన్నఁటికి పోవునో కదా ?"

"పోనిమ్ము. నాజీవితమునందు రాజకీయసౌఖ్యములు వ్రాయఁబడి యుండలేదు. నాకెందులకు పౌరుషము ?"

"అగేల యటులంటువు. మన గురూచార్యులవా రీవు చక్రవర్తి వౌదువని తెలిపియుండరా ?"

"వారు వాత్సల్యాతిశయమున నటులనియుందురు. చూడుము. వీరాధివీరుఁడవగు నీవు నావైపైనను జూడ కుంటివి. రాజ్యాధికారము నాపినతండ్రి వహించియుండుటచే నిఁక నేరి సహాయముననైన రాజ్యము సంపాదింప నిచ్చ గింపను. కాఁబట్టి సార్వభౌమత యటులుండ కడకు నల్ప రాజ్యాధికారమైన నానుదుట వ్రాయఁబడియుండలేదు."

"ఇపు డి యమరావతి పట్టణమునం దేమి చేయు చుంటివి?"

"ఈ పురిపాలకున కొకటి రెండు చిత్తరువుల వ్రాసి యుంటిని. నీ యభిప్రాయము దెలిసికొని పోనుంటిని."

"ఎటకు ?"

"విజయా! ఎటకని తెల్పుదును. పాలింప భూములు లేవుగాని భిక్షమెత్తుకొన తావులులేవే ?"

"ఏమీ ? నా యేలికతనయుఁడు బికిరమున కరుగు టయా ? నేను సమ్మతింపను."

"నీయేలిక యనపత్యుఁడు"

"ఇతఁడు నా యేలిక యెట్లగును?"

"మిత్రుని కోరికయైనను ద్రోసి సేవించుటవలన"

"మిత్రమా! విను. నేను నీ శ్రేయము నభిలషించియే రానని తెలిపితిని. రాజమహేంద్రవరమునం దుండినచో పరిస్థితుల గమనించుచు నవకాశము లభించినపుడు నీ యాగమనము నభిలషింతును. నీవెంట నరుదెంచితినా యిరువురము నును దేశద్రిమ్మరులము గావలసినదే! అదియుఁగాక పశ్చిమ చాళుక్యులపై యుద్ధము సంఘటిల్లనున్నది. అందు వీరరాజేంద్రుని మనసు కెక్క ప్రవర్తించి యాతనిమది కెక్కితి నేని తప్పక నీవిషయము ప్రస్తాపించి పల్లవ, పశ్చిమచాళుక్య భూములఁ గొన్నిఁటి నీకొసంగునటు లొనరింతును. అపుడు మన మిరువురమును సంతృప్తులమై యట వసింపనగును.

"మిత్రమా! విజయా! నీ యాలోచనాశక్తి ప్రశంసాపాత్రము. కాని నీయభిలషితము లీడేరవని దృఢముగఁ దెలుపఁగలను. వీరరాజేంద్ర చోళుఁడు నావిషయమునందు సంపూర్ణమైన మనస్యము నందియుండెను. త్రిపుర నొకమారు చిన్నతనమున చిన్నఁబోనపఱచి యుంటిని. ఆపె కంఠము స్త్రీకంఠమే కాదని పరిహాసించి యుంటిని. దాని కాతఁడు చాల మనసునొచ్చుకొనెను. మొదటినుండియు నాపై నతనికి వెగటుఁదనము వృద్ధియగుచునే యున్నది".

"పోనిమ్ము. ప్రయత్నము నొనర్చుటవలననష్టమేమి?"

"నీయిష్టము"

"నీవెట కేఁగుచుంటివి!"

"ఏల ?"

"తెలిసి యుండిన మంచిది కదా!"

"ఓహో! రాజ్యభారమును వహింప రమ్మనుటకా ? వినుము. నేను మావంశమువాఁడగు నాహవమల్లుని జేరుదును. నాయసహాయస్థితి నెఱుక పఱచి సహాయ మభిలషింతును. అతఁడాశ్రితవత్సలుఁడని విందును. దయార్ద్రహృదయుఁడై యాతఁడొక వనదుర్గము నొసంగిన యందు నిరాటంకముగ కాలముగడుపుచుందును. నీవు నాకై శ్రమపడుచుంటివి గాన యీ నిరుపమాతిథ్యమందొక గ్రంథమును వ్రాసి నీ కంకిత మొసంగుచున్నాను లెమ్ము."

"అటులే కానిమ్ము. రాకుమారా! నా మానసము నందలి పేరాశ నీ కెఱుక పఱుపనైతిని."

"ఏమి వివాహమా ?"

"కాదు. కాదు. రామసింహుఁ డుద్యోగమును జాలించుకొనియెను."

"ఎపుడు-ఎందులకు ?"

"ఏదో వసకేసరి—"

"ఎవరు-రాజనారాయణ బిరుదమందిన యతఁడేనా?"

"ఆఁ—అతఁడే! దాస్యము వలన ఫలము లేదనియు ఆతని యత్నము వలన చాళుక్యదేశ గౌరవము నశించు ననియుఁ జీవాట్లుపెట్టెనఁట."

"విజయా! ఆతఁడు నిన్నొకమాటు చీవాట్లు పెట్టిన బాగుండును. విజయా! నీ వా రామసింహుని మాత్ర మభిమానముగలవాఁడవు కాకపోయితివా?"

"రాకుమారా! అవేటిమాటలు. ఆతఁడు మధ్యము వయస్కుఁడు. నేను యువకుఁడను. సర్వసేనాధిపత్యము వలన నాతఁడొందులాభములేదు. నేనో, నా ప్రియమిత్రుని, నా సహాధ్యాయిని, నాయేలిక యేకమాత్రతనయుని దైవాను గ్రహ ముండిన రాజును జేయఁగలను."

"విజయా! నీ వుదారహృదయుఁడవు. నీ యిష్టము వచ్చినటు లొనరింపుము. నాకై మాత్ర మసువుల త్యజింపకుము."

"ఇఁక నా రాజ భక్తి యేమి?"

"మీ జనకునంతవాఁడ వగుదువుగాక! మిత్రమా పోయివత్తును."

"రాకుమారా! నీ యునికిపట్టును మాత్రము దెలుపుము."

"మంచిది. నారాయణభట్టు విషయమున జాగరూకుఁడవై వర్తింపుము."

"నేనాతని యాప్తవర్గములోఁ జేరియుంటిననిన నీవు నమ్మవుగాఁబోలును. అందులకే సర్వ సేనాధిపత్యము వాంఛించుచుంటిని."

"నీకు జయమగునుగాక! వెళ్ళిరమ్ము."

అని యా మిత్రులు విడువలేక యొకరి నొకరు పలుమా రాలింగన మొనర్చుకొని తమతమ త్రోవలఁజనిరి. పాఠకులు విజయాదిత్యునిచే దేశభ్రష్టుఁడైన సారంగధరుఁ డమరావతి కరుదెంచి యటకు మిత్రుని బిలిపించుకొని తనను వెంబడింపఁగోరెనని గ్రహించియుందురు.

అంత సారంగధరుఁడు పశ్చిమ ముఖముగ బయలు దేరి యొక పురమున నొకటి రెండు దినములుండి తుంగ భద్రానది శోభను బరికించుచు దానిని దాఁటి మఱి రెండు దినములకు వాతాపిఁ జేరెను. సైనికులచే నిండినయా పట్టణము సంద్రమువలె ఘోషనీనుచుండెను. ఆపురియందొక చోళాన్వి దిన్నములుండి సైన్య సేకరణమునకై వెళ్ళివచ్చిన యాహవ మల్లుని సంద్రతించెను.

ఆహవమల్లుఁ డేఁబది వత్సరములు దాఁటినవాఁడు. వీరాగ్రేసరుఁడగు నాతని యాకృతి దర్శనీయమైనది. ఆతని నయనద్యుతి ప్రకాశవంతమైనది. ఒకసారి యతఁడెదుటి వాని జూచినచో నాతని కన్నులలోనుండి తనచూపులఁ బఱపి వాని హృద్వీధినుండుభావములగ్రహింపఁగలడని చెప్పుదురు. వీరులకు సహజమగు నాశ్రితరక్షణమును, శత్రుజనహననము నాతనికడ నుండినవి. ఆశ్రయమిచ్చెనా సౌఖ్యమందఁ జేయుఁ గలఁడు. కోపించెనా వంశ నిర్మూలన మొనర్పఁ గలఁడు. సారంగధరుఁడు బోయినవేళ మంచిది.

ఆతని చరిత్రము, మదాలస మోహము లోపముగ, సర్వమును తెలుపఁబడెను. రాజరాజనరేంద్రుని విషయమున

నాహవమల్లుని గౌరవ మనుపమానము. ఆతని వీరత పాండిత్య ములకాహవమల్లుఁ డచ్చెరువునందియుండెను. విజయా దిత్యునిపై నాపశ్చిమచాళుక్యపతి కనురాగము లేకుండెను. పౌరుషముగాని పాండిత్యముగాని లేకుండుటయే యందులకుఁ గారణము. అట్టి మహానుభావుని తనయుఁడిట్లు లరుదెంచుట వలనం దనకు సహాయుఁడుగనుండి చోళులకు మునుఁజేరిన యా చపలచిత్తునిపై నింతకుముం దుండిన యాగ్రహాగ్ని కాజ్యము వోసినట్లయ్యెను.

చోళులపై కరుగవలసి యుంటవలన నొకటి రెండు మాసములు తనకడనే యుండవలయుననియు నా యాహవా నంతరము చపలుఁడగు విజయాదిత్యుని గద్దియపై కులోత్తుంగు నునిచి, కుబ్జవిష్ణువర్ధనునివలె నేల నేలించెదనని మాట యిచ్చెను. సారంగధరుఁడును సంతుష్టుఁడై సోమేశ్వర విక్రము లతో మిత్రభావమున మెలఁగుచు నచటి రాజకార్యములందు జోక్యము గలిగించుకొనక, పరిస్థితుల గమనించుచుండెను.

సోమేశ్వరుఁడు కపటోపాయసమర్థుఁ డగుటవలన, సచివులను, సేనానుల తనవైపునకుఁ ద్రిప్పుకొనుచుండెను. సహజపరాక్రముఁడగు విక్రమాదిత్యుఁడెట రాజ్యాక్రమణ మొనర్చుకొనునో యని యాతఁడు సంసిద్ధుఁడై యుండెను. సోద రుని భావము గుర్తించి విక్రముఁడు పరాక్రమవంతులగు యువకుల పెక్కుర వెంటనిడుకొని వర్తించుచుండెను. భ్రాతృ మనోవాంఛితమును విమర్శించు విక్రముఁడుకూడ పితృమరణా

నంతరము రాజ్యాధిపత్యము వహింపవలయునని తలంచుచుండెను.

ఆ రాజేంద్రుఁడు తనయుల యాశాపిష్టతనుగాని, రాఁగల తనదుర్గతినిగాని గమనింపక సంపూర్ణయత్నముల చోళుల పరాజయమునకై పొనరించుచుండెను. సర్పముఖస్థ మండూకము నాహార సంపాదనేచ్ఛఁదగిలి యుండునుగదా! మఱి క్షణమునందు రాఁగలస్థితి మానవుఁడెఱుంగఁగలిగిన నెంతటి గర్వరాహిత్యతనంది యుండునో యెవరెఱుంగుదురు ?

చతుర్దశప్రకరణము.

సమర సన్నాహములందుండిన దక్షిణభారతనృపతుల వదలి చదువరులొక్కింత యుత్తరముగ రావలసియున్నది.

ఉత్తరకళింగము నుదయగిరి ప్రధాన పుటభేదనముగ రణార్ణవుఁడు పాలించుచుండెను. క్రీ. శ. 840 ప్రాంతములం దుత్తర దిశ కరుదెంచిన గాంగుల సంతతివారే యప్పటినుండియు నీ కళింగరాజ్యమును పాలించుచుండిరి. దక్షిణకళింగమనియు నుత్తర కళింగమనియు నీ దేశము రెండుగ భాగింపఁబడియుండెను. క్రీ. శ. 998 ప్రాంతముల దక్షిణకళింగమును వజ్రహస్తుఁడు పాలించునప్పుడీభాగమును గుణార్ణవుఁ డేలుచుండెను. అతని తనయుఁడు దానార్ణవుఁడు. పంచవింశతి వత్సరములు ధరాభారము వహించి దివంగతుఁడయ్యెను. ఆ నృపతిసుతుఁడు రణార్ణవుఁడు మన కథాకాలమున నేలికయై

యుండెను. ఈభూజాని యేఁబదివత్సరములు దాఁటినవాఁడు. అనపత్యుఁడు గాక పోయినను వ్యధాకుల హృదయుఁడు గాక తప్పినది కాదు. అదియొక కథ.

అప్పటి దక్షిణ కళింగ పతియగు వజ్రహస్తుఁడు 1050 వ సంవత్సరమున నధిపతి యయ్యెను. రాజ్యమున కరుదెంచిన దాది యీ భూభృత్తు స్వరాజ్య పరివృద్ధి నాకాంక్షించుచుండెను. కళింగమున కిరువు రధినాథులుంట కంటె నొక్కఁడుంట సమంజసమని పలుమాఱు నతఁడు భావించియుండెను. భావించుటేమి? రాజ్యమునకు రాక ముందే జగనములు సల్పెను. రాజ్యాధిపత్యము వహించిన దన తెలుపవలయునా?

రణార్ణవునకు కాదంబరియను తనయ యుండినది. ఆయమ యైదవవత్సరమునందు వనమున విహరించుచు నగుపడకపోయెను. అగాధములగు సరస్సులందెటనో యసువులఁ బాసెనని దాసీజనము దెలిపెను. రణార్ణవునకు మాత్రము నమ్మక మొదవలేదు. అహోరాత్రములు వెదకించెను. వెదుక నేఁగిన వారికే వేసరిక యొదవెను. వత్సరములు గడచెను. అతని విచారమావంతయు తగ్గలేదు. తనయ యెటనో జీవించియే యున్నదని యతఁడు భావించుచునేయుండెను. ఆప్తులగు వారల నంపుచునే యుండెను. పితృవాత్సల్య మెంతటిది?

పదివత్సరములు గడచినవి. తన తనూజాత నపహరించిన యతఁడు స్వార్థపరుఁడై యుండునని యట్టివానిపోఁబడి

నతఁడు మనోవిధి నహరహము విచారించుచునే యుండెను. సచివుఁడు అభయంకరుఁడును, దక్షిణకళింగపతి వజ్రహస్తుఁడు నాతని కనుమానాస్పదులుగ నగుపడిరి. వజ్రహస్తుఁ డన్యదేశ్యుఁడును, నృపుఁడనగుట ప్రవర్తనము బరిశీలింప నలవి కానిదయ్యెను. అభయంకరు నాశావిష్టత యంతకంతకు ఘనమగుటంచు సుతావియోగజాత మనోవైకల్య సంబాధితుఁ డయ్యెను రణార్ణవుఁడు వైళంబ కనుగొనఁ గలిగెను.

అభయంకరునకు స్వతంత్ర రాజ్యకాంక్ష లేకపోయినను సామంతతనైన వహింపవలయునని యుండెను. నరేంద్రుఁడు దనపై ననుమానము గలిగియుండెనని గ్రహించినంత యాతఁడాలస్య మొనర్పరాదని భావించెను. సర్వసేనాధ్యక్షుఁడగు నరేంద్రవర్మ సహాయము నభిలషించెను. కొన్ని జహాగీరుల కా వాహినీపతి సమ్మతి నొసంగెను. రణార్ణవుఁడు నరేంద్రవర్మ సహాయము తనకున్నదని దృఢవిశ్వాసమును వహించి యుండెను. దానివలన సచివుని ద్రోహమును బ్రకటించినచో, తనపదవి సుస్థిరముగ నుండునని భావించి యుండెను. కోశము, సేన, ఈ రెంటిని కలిగియుండిననే భూపతి యమాత్యునకు భయపడవలసి యుండునని యాతని భావము. ఆయిరువురు నభయంకరుని పక్షముజేరి యుండిరనుటా ధరణికాంతుఁ డెఱుఁగఁడు.

క్రీ. శ. 1053 వ సంవత్సరము ప్రధాని కార్యములు నరపతికి బొత్తుగా సరిపడని వయ్యెను. కాఁబట్టిసామంతులను,

తగువారిని రావించి సభయొనరించి మంత్రి స్వార్థపఱతను బ్రకటించి తన దేశమునుండి వెడలిపోవలసినదని రణార్ణవుఁ డాజ్ఞనొసరించెను. అభయంకరుఁడా యానతి యన్యాయమైన దనియు, పదుగురలోఁ దన నవమాన పఱచినందులకు బ్రతీకార మొనర్చి తీరుదుననియు గంభీరముగ పలికెను. అందులకు వరూధినీభర్త నరేంద్రవర్మ, తనమేనఁ బ్రాణములున్నంతవఱకునతఁడు దనయేలిక రాజ్యమునం దడుగువెట్ట వీలుండదని మేఘగంభీర భాషణములఁ బలికెను; రాజుబ్బిపోయెను. వీరులుగ్గడించిరి. సభ్యులు స్తుతించిరి. నైజమెఱింగిన యభయంకరుఁడు మాత్రము సంతసించెను. దరహాస మొనరించెను. తగిన సమాధానము నొసంగి సచివుఁడు సముచిత పరివారుఁడై ఉదయగిరి పురము వదలి ప్రాక్సముద్రప్రాంత నిబిడాటవులఁజేరి సైన్యసేకరణ మొనరించుచుండెను.

నాలుగు మాసములు గడచిపోయెను. ఉదయగిరి యందు నరేంద్రుఁడును దగిన యుద్ధసన్నాహముల నొనరించుచుండెను. ఎప్పుడో తన యాడవిదండుతో నభయంకరుఁడు భయంకరుఁడై మీఁద పడునని పౌరులు భీతిల్లుచుండిరి. పురమందెచటచూచినను వీరభటులు సాయుధులై పచారు సలుపుచుండిరి. దుర్గద్వారములు మూసివేయఁబడి యుండెను. అనుమతిగొని గాని ప్రవేశనిర్గమములు జరుగకుండినవి. యాందోళనముతో పదునైదు దినములు గడచిపోయినవి.

పూర్ణిమానిశ పాలకడలి కాన్పు ధరాతలమునంతయు నమృతప్లావితము నొనర్చెను. శస్త్రైక జీవనులగు వీరులు

సైత మాజ్యోత్స్నయం దొక్క క్షణము మొనరించి యటు నిటు దిరుగుచుండిరి. అభయంకరుని రాక, దినములు గడచు కొలంది, విశ్వసనీయముగ నిదగుట దుర్గముపై నుండు రక్షకులు నిద్రాదేవి నొడియందో, గృహములందుండు ప్రియురాండ్ర స్మరణమునందో మునిగి యుండిరి. అందులకుఁ గారణము లేవెలుగేయనిన చాలును. పదిగడియకాలము గడచిపోయి నది. ఉదయగిరియం దెలసూచినను నిశ్శబ్ద మలముకొని యుండినది. సమీపదుర్గమారణ్య మందలి వ్యాళజాల నినాదములు తప్ప మఱేమియు వినబడుట లేదు.

అట్టితఱి నిరువురువీరు లాజానేయముల నధిరోహించి పర్వతమార్గముల నతిజాగరూకులై పయన మొనరించు చుండిరి. నిశ్శబ్దముగ వారరుదెంచుట జూచినచో ఘన విచారమునకు లోనైయుండిరనియో, పరులకు తము పొలకువ తెలియ నిచ్ఛగింపరనియో గ్రహింపనగును. వారిరువురి వర్ణించుటకు వారు ప్రచ్ఛన్నులై యుండిరి. వా రుదయగిరి దుర్గము గమ్యస్థానముగ దలంచియుండిరని వారి గమనమును బట్టియే తెలుప నగును.

సూక్ష్మబుద్ధులగు పాఠకుల భావములు ప్రచ్ఛన్న వ్యక్తులనినంతన వనకేసరిపై కరిగియుండును. అవును. ఇఁకను దాపరిక మెందులకు ? వనకేసరి సహాయుఁడు మధ్యమ వయస్కుఁడు. ఆతని వసనములు రక్తిమములుగాక పీతములై యుండినవి. ఇరువురును కృపాణ పాణులును శరశరాసన

ధారులునై యుండిరి. వారెట్టి సంభాషణము నొనర్చు కుండుట నా ద్వితీయుని గుఱించి యేమి తెలిసికొనుటకును వీలగునటులేదు. పోనిండు, ఆతురతయెందులకు ? దుర్గమును సమీపించిరి. వారువములదిగిరి. దుర్గపుగోడ లత్యున్నతములై యుండినవి. వారందులకు వెనుదీసి యుండలేదనుట నూతన విషయముకాదు. అందలి మధ్యమవయస్కుఁడు నిజాశ్వముపై నుండిన త్రాడు నొకదానిని తీసి దాని కొక సంచియందుంప బడిన యుడుమును గట్టి విసరెను.

ప్రయత్నము మున్మారొనర్చిన పిదప నాజంతువొక స్థానమున కుదురుకొనెను. దానినిబట్టి లాగి పైకెక్కఁబోవు వనకేసరి నాపి యాద్వితీయవ్యక్తి పదిక్షణములకాలములో దుర్గము నధిరోహించెను. వానరమైన నంత త్వరగ పోవ దనిపించకపోదు. ఇరువది ముప్పది విగడియల కాలము గడచిపోయినది. పైనుండి యెట్టి శబ్దముగాని వినిపించ దయ్యెను. వనకేసరి హృదయవేగ మతిశయించినదన వచ్చును. పైకి వదనమునెత్తి యాతురతతో నాయువకుఁడు విలోకించుచుండెను.

ఒక వస్తువు వచ్చునటు లగుపించెను. ఆ యువకుఁ డొకింత ప్రక్కకుఁ జరుగునప్పటి కొక శిరముపడెను. క్షతజ కణము లాతనిపై బడినవి. అంతనతఁడాగక త్రాడుబట్టికొని యెగ్రాక నారంభించెను. కొలఁదికాలములో నతఁడును కుడ్యోపరిభాగమును జేరెను. అట రెండవవ్యక్తి ముగ్గురు

భటులతోఁ బోరాడుచుండెను. వనకేసరి సహాయమున నాతఁడు వారలఁ దెగటార్చెను. అటుపై నా యిరువురు ప్రచ్ఛన్నాంగులు నాకుడ్యముపై బరుగిడుచు నొకతావును జేరిరి. అచట కుడ్యమెత్తుగ నుండెను రెండు దిమ్మలమధ్య నొకఁడు నిలుచునంత స్థలముండినది.

ఆ దిమ్మలకొక బలమగు పగ్గము కట్టఁబడి యుండినది. దానికడ రెండవవ్యక్తినాపి వనకేసరి సోపానములఁదిగి చాల రహస్యముగ పయనము సాగించి సింహద్వారమును డాసెను. అట నలుగురువ్యక్తులు గుస గుస లాడుచుండిరి. వారి కెఱుక పడనటులతఁడు వారివెనుక నిలిచెను. ఒక విగడియకాలము గడచునంతలో నందులో నొకఁడు శిరోరహితు డయ్యెను. కృపాణమును బయల్వెలువఁబోవు రెండవవ్యక్తి నిజరుధిరముతో ధరాస్థలిని ప్లావితమొనరుప వలసెను. పోరాడ నెంచు నాయిరువురు నొకింతవడిలో వనకేసరి బంధించివైచెను. అంత వనకేసరి వారల నుద్దేశించి:—

"నా మాటలు జాగ్రత్తమెయి వినుఁడు. నే చెప్పినటు లొనర్పవలయును. లేదా మీమిత్రులగతి మీకగును.

ఇఁక నొకటి రెండు గడియలలో మీరు ఎవరికొరకెదురు చూచుచుంటిరో వారు రాఁగలరు. వచ్చినంత మీరు ముందు మహామంత్రిగారిని ప్రవేశము కాఁగోరుఁడు!

ఆతఁడు లోనికి వచ్చినంత చెంతయొక ద్వారమును మూసివేయుఁడు."

"మీరెవరు ?"

"త్వరలో తెలిసికొందురు గాక"

"అయ్యా! మాకిది యిష్టము లేదు"

"మఱి వీలు లేదు" ప్రాణములపై నాసయుండినచేయ వలయును. ఈకార్యము మీయేలిక క్షేమమునకై యొనర్పఁ బడినది. మీరు నేఁజెప్పినటుల జేయకపోయితిరా మీరాజు గారి ప్రాణముల నాకూర్మిరుఁడు తీయకమానఁడు."

"ఆఁ—ఎట్లు? మా సేనానిగారితో మాటాడుటకు గదా మంత్రిగారు వచ్చినది."

"మాటాడుటకు సైన్యముతో రావలయునా?"

"మీకెట్లు తెలియును?"

"అనంతయు నెందులకు? గోలది శబ్దము. తెల్పుడు నేఁజెప్పినటుల" అనుచు వనకేసరి వారి బాధనముల విప్పెను. వారిరువురును "మహామంత్రిగారు ముందు రావలయును" అనిరి

"ఆఁ—తెలుపు" డని వినిపించెను.

ఆభటులు సింహద్వారము నొకండు ప్రవేశించునంత మాత్రము నిశ్శబ్దమొనర్చిరి. స్థూలకాయుఁడగు సచివుఁడందు నుండిలోనికరుదెంచెను. ఆభటులిరువురు నుకనాటమును యథాప్రకారము మూసివైచిరి. ఉదరమున తనకరవాలమును నిలిపి వనకేసరి "మహామంత్రీ, అభయంకరునకు స్వాగత" మని గంభీరముగ బలికెను. సర్వద్రష్టుఁడయిన నంతగ నులికిపడఁడు. మహామంత్రిగారికి ముచ్చెమటలు పోసినవనినచో పాఠకు

లాతఁడు భీరుఁడనితలంతురు కాఁబోలును. కానిండు. వనకేసరి గడియనైచి యాభటులనిరువుర నభయంకరుని బాహువుల పట్టుకొనఁజేసి వెనుకనిలచి వారల పో నాజ్ఞాపించెను.

వనకేసరి చేతికరవాల మొక్కింత యెడమునందుండి పోయెను. గుసగుసలు పరధ్యానమునం దుండిన వనకేసరి వినలేదు. తన దేహమునకు నాలుఁగొన తగులునట్లు కాతఁ డెద్దియో భావించుకొనుచుండెను. "ఓరీ! ఇప్పుడెవరధికులు" అనుమాటలు కర్ణాఘాతములవలె నాతని చకితునొనర్చెను.

"నేను" అను మాటయొక గంభీరనినదము వినవచ్చెను. చర్మముదాటి యొక్కైదువు అభయంకరుని వెన్నెముకను దగులుచుండెను. ఆతని చేతియందలి కత్తి యెప్పుడో క్రిందపడి పోయినది. ప్రచ్ఛన్నవ్యక్తిని మాటయొకరినిఁ జూచినంత నాయిరువురు భటులును పరుగిడిరి. అంత నా వనకేసరియు నతని సహాయుఁడును కంపితగాత్రుఁడగు నభయంకరుని నడిపించుకొనుచు నరేంద్రవర్మ భవనమును గూర్చి పయన మైరి. వారాభవనము జేరినంత నటనుండు ద్వారపాలకు నావల ద్రోసివైచి లోనఁబ్రవేశించిరి.

నరేంద్రవర్మ నిదురించుటలేదు. పడకగదియందు పాదచ్ఛాయల వేయుచుండెను. వనకేసరి "చూడుము సేనానాయకా! నీవు బ్రతికియుండగనే అభయంకరుఁడు ఉదయగిరినిఁ బ్రవేశించెను" అని పలికెను.

నరేంద్రుఁడు మొదట అభయంకరుఁడు ప్రచ్ఛన్న వ్యక్తుల సహాయమున వచ్చియుండెనని భావించెను గాని మంత్రి వదనభావము జూచినంత కార్యభంగమైనదని భావించెను. ఆభావన జన్మించిన యుత్తరక్షణముననే సేనానికరము కరవాలమున్నెడ కరిగెను. వనకేసరి సహాయుఁడది గమనించి యాతనికడకు లంఘించి యాకరమును బట్టుకొనెను. నరేంద్రుఁడు భటులకొఱ కఱవఁబోవ నావ్యక్తి నోటిపైఁ గొట్టి "రాజద్రోహీ! అఱచితివా యసువులఁ బాసెదవు!" అని గంభీరముగ ననెను.

ఒక నిముసములో వారిరువు రా రాజద్రోహుల బంధించిరి. వనకేసరి యటనుండి తాళపత్రముపై నొక్కింత వడి యేదియో వ్రాసి యా యిరువుర వెంటనిడుకొని రాజభవనముగూర్చి వెళ్ళి రాజభవన ద్వారపాలకుల జూచి బంధితులను, వ్రాసినలేఖను వారికొసంగి యావీరద్వయ మెందేని వెళ్ళెను.

పంచదశ ప్రకరణము.

చూచుచుండగనే 1055 వ సంవత్సరము గడచిపోయినది. చోళపశ్చిమచాళుక్య వాహినులు మించిపోవుచుండినవి. తుపానురాకముందు సముద్రముండినటు లాంధ్రదేశమునందు ప్రశాంతముగ కాలము జరిగిపోవుచుండెను. ఎవరు ముందు బయులు దేరుటయు విచారణీయముగ

నుండినది. 1056 వ సంవత్సర మారంభమైనది. గ్రీష్మ వర్ష ఋతువులును దాటనుండినవి. తగినంత కారణములేకనో, మతనిమిత్తముననో యిరువాగులవారును స్వపురంబుల వదల కుండిరి. వాతాపి చుట్టుపట్టులను, ఉరయ్యూరు చుట్టుపట్టు లను సైనికులు సమరవిహారము నలవఱచుకొనుచుండిరి. గజ యూథములపై నదుల నుత్తరించుటయు వాహనములపై పిల్లకాలువలు దాటుటయు వారికి దినచర్యలై పోయెను.

ఆ వత్సరము వర్షములు పరిమితముగ వచ్చినవి. నదులట్టె గాకపోయినను దాటుట కష్టమనిపించు చుండినవి. చోళసేనాధ్యక్షుడగు వీరరాజేంద్రుడు తనపితామహుడగు రాజరాజును దలంచుకొని యతనివలె చైత్రయాత్ర సాగింప నెంచియు నాలస్యమొనర్ప రాదని సకల వాహినీ సమేతుడై బయలుదేరెను. ఆతడు పయనమైన పది దినముల వఱకును చాళుక్య గూఢచారు లాతనిమార్గము నెఱుంగలేక పోయిరి. జాంఘాలికులగు వారు తమ యేలికకు నావిషయ మెఱుక పఱచిరి.

కరుణాకర పల్లవుడు కంచినుండి కొంత సహాయ మంపెను కాని కీర్తివర్మ యా సైన్యమును వీరరాజేంద్రుం డనుకొనినటుల వెంబడింపడయ్యెను. సింహపురాధీశ్వరుడు నరసింహవర్మయు సైన్యసహాయమునంపెనేగాని మధుసూద నుడు దానితో రాడయ్యెను. వీరరాజేంద్రునకది విపరీతముగ దోచక పోలేదు. విజయుడు మాత్రము సముచితసేనానమే

తుఁడై అమరావతి కేఁబదిక్రోసులు దక్షిణముననే కలసెను. చోళరాజు నిజసేన నొక సమప్రదేశమున నిలిపి, విజయునిచే ప్రబోధింపఁబడినవాఁడై కీర్తివర్మ, మధుసూదనుల తనతో కలియరాఁ గోరుచు వార్తాహరుల నంపెను.

చాళుక్యులు కృష్ణాతుంగభద్రల సంగమ స్థానమున కరుదెంచుచుండిరని విని యాహవమల్లుఁడు తన సేనతో నా సంగమస్థానమును గూర్చి బయలుదేరెను. తన వాహినిగమనాయాసమును గాంచ కూడదని యాహవమల్లుఁడు దిన ప్రయాణముల మాని నిశాప్రయాణములతో తుంగభద్రా, కృష్ణవేణీ నదుల మధ్య భాగము నాక్రమించుకొనెను. ఆహవమల్లుని తనయులలో విక్రమాదిత్యుఁడు మాత్రము వచ్చియుండెను. సోమేశ్వరుఁడు పెక్కు కారణములఁ జూపి రాజధాని వదలకుండెను. కొన్ని కారణములు పాఠకులు గ్రహించి యుందురు.

నాలుగైదు దినములు గడచు నప్పటికి సింహపుర, కాంచీపురముల కరిగిన వార్తాహరులు లేఖలతోఁ దిరిగివచ్చిరి. గూఢచారులు చాళుక్యసేన సంగమేశ్వర క్షేత్రసమీపమున విడిసియుండెనని తెలిపిరి. వీరరాజేంద్రుఁడు ముందుగ తానా స్థలము నాక్రమింపక పోయినందులకు విచారించుచుఁ దన యాలస్యమునకుఁ గారణము పల్లవ రాకుమారులని భావించి వారిపై మండిపడెను. పల్లవరాకుమారులు లేఖలందు తామాతనికి సామంతులు కారనియు నందులకై తమపై నతఁడధి

భారము వహించుటంత సమంజసముగ నుండదనియు నడకువతోఁ జెప్పిరి. స్వతంత్రులగు వారిపై నధికారము వహింపఁ గోరుట కార్యజ్ఞుల లక్షణముగాదనియు నాయకులు సూచించిరి. తోఁక త్రొక్కిన త్రాచువలె వీరరాజేంద్రుఁడు మండిపడెను. చాళుక్యుల మద మడంచిన తరువాత పల్లవుల డిల్లపడఁ జేయుదునని యట వీరుల మధ్యను ప్రతిన యొనరించెను.

అంత పరిస్థితులగూర్చి చాలకాలము యోచించి విజయునకు పల్లవసేనను సహాయముగ నొసంగి యమరావతికి వెళ్ళి యటనుండి యొరంగల్లు దిక్కుగ పయనమై కృష్ణానది కుత్తరముగ రావలసిన దనియు నటవేచియుండి తన సైన్యమున్న దిశను గొప్పజ్వాల కనుపడిన దినము కృష్ణనుదాటి చాళుక్యులపైఁ బడవలసిన దనియు నాజ్ఞాపించెను. సారంగధరుని విషయమును మరువని విజయుఁ డంతటి కార్యభారము తనపై నిడినందుల కమందానంద మంది యానాడే పయనమైపోయెను.

మఱియొక వారము దినములలో వీరరాజేంద్రుఁడు తన సేనతో తుంగభద్రానది దక్షిణతీరమున విడిసెను. బాగుగ ప్రవహించు నదుల మధ్యభాగమునందు చాళుక్య సేన సురక్షితమై యుండినది. వారినెదిరించు నుపాయము నన్వేషించుచు మదగజములను, ఓడలను నదియందు నిలుపుచు వీరరాజేంద్రుఁడు కాలము పుచ్చుచుండెను.

విజయాసింహుండు చాళుక్యసేన వెనుకభాగమును కా యుండవచ్చునని నమ్మకము గలిగినమీఁద చాళుక్యుల నెదుర్కొన నాజ్ఞాపించెను.

తుంగభద్రా నదియందు మదగజముల నెక్కియు, నోడల నధిరోహించియు చోళసేన బయలుదేరెను. నదిని సగమువఱకు దాటి రనవచ్చును. అంతలో నున్నటులుండి యెటనుండియో బాణవర్షము గురిసెను. గజముల ఫాలములును, ఓడల యడుగుభాగములును శరములచే నిండి పోయెను. అందు పశ్చిమ చాళుక్యుల విలువిద్యా నైపుణ్య మంతయుఁ దెలియనగుచుండెను. అంపరచే బాధితమై గజయూథము మాఱుత్రోవను బట్టెను. ఓడలు రంధ్రముల నుండి నీరును గొనుచుండినవి. వీరభటు లాలసింపరాదనుకొని యీదుచు వెనుదిరిగి. తీరమును జేరి.

మావటేంద్ర నేర్పుమెయి గజములు వెనుదిరిగెను. వీరరాజేంద్రుఁ డంధకారమున దాడిసాగింప నిది పొరబాటని తెలిసికొనెను. కొన్నివందల సేనమాత్రము నష్టమయ్యెను. అది వారికొక లెక్కయా? సమరము లెంతదారుణమైనవి? కొన్నివందల ప్రాణములు తృణప్రాయముగదా! జగదోద్ధారణ మొనర్చునదియు, క్షణ కాలములో నశించునదియు పురుషుఁడే! ఏమిచిత్రము?

ఇది జరిగిన దినద్వయ మెవరును సమరము సాగింప లేదు. ఒక నిశాసమయమున వీరరాజేంద్రుఁడు మరల సేనను

నదిదాటింప సంకల్పించుకొనెను. కందెనవోలు మండలము నందెటనో (అప్పటికీమండలమని లేదు) వర్షములు కురియు టంబట్టి తుంగభద్రానది విపరీతముగ వచ్చి యుండినది. వీరభటులది లెక్క సేయక ప్రథమ ప్రయత్నమును తద్భంగమును స్మరించి స్థిరచిత్తులై దాటయత్నించిరి.

ఇంతలో "శత్రువులు శత్రువు"లని పశ్చిమ భాగము నుండి వినవచ్చెను. నదీతీరమునఁ గలకలము మిఱిమీఱిపోవుచుండెను. అంతకుముందే నదినిదాటిన చాళుక్యులు చోళుల గుడారముల కగ్గి దరికొల్పిరి. ఆ జ్వాలఁ జూచినంత నదినిదాటఁదలంచిన వీరులనావైపునకరుగ చోళనాయకు డాజ్ఞాపించెను. తానును కరవాల సహాయుఁడై యున్నతాశ్వము నెక్కి యటునై పరిగెను.

అట కృష్ణానది యుత్తరమునందు సైన్య సమేతుఁడై సంకేతమునకై యెదురు చూచుచుండిన విజయసింహుఁడా మంటలు తమవారు కావించినవిగాఁ దలంచి దక్షిణమునకు సంపూర్ణగమనము కలిగియుండిన చాళుక్యులకుఁ దెలియకుండఁగ నదినిదాఁటెను. పరిపూర్ణ విశ్రాంతిగల వారగుట వలన పల్లవ పూర్వచాళుక్య సేన లొక్కమొగిని పశ్చిమ చాళుక్యులపైఁ బడెను.

పశ్చిమ చాళుక్య సేన యందలి ఘటికులను గొని విక్రమాదిత్యుఁడు గతదిన నిశాసమయమునందే తుంగభద్రానదిని దాటియుండెను. అతఁడు దినశేషమును ప్రాంతపు

టడవులఁ గడపి యట చోళుల నెదిర్చెను. సమర మత్యంత ఘోరముగ తుంగభద్రానది యిరుపార్శ్వములందును జరుగుచుండెను. ఆరాత్రి యంతయు నటులే గడచెను. ఉదయమునందును, సమరము జరుగుచునే యుండెను.

షోడశ ప్రకరణము.

త్రిపురసుందరి పదునెనిమిది వత్సరముల ప్రౌఢ. వీరాధివీరుని తనయయగుట నాబిడ సకల విషయముల చక్కగ నెఱింగియుండినది. అశ్వారోహణమునందును, ఖడ్గచాలనమునందును, శరప్రయోగమునందును నాబిడను మించినవారు చోళభూమి నెట్టె లేరనిన చాలును. పురుష వేషధారిణియై యా మోహనాంగి మృగయావిహారమునకుఁ బలుమాఱు వెళ్ళుచుండెడిది. సహజసౌందర్యయగుటం బట్టి యామె స్త్రీయని [illegible] దేని తెలంపఁ జాలకుండిరి.

వీరరాజేంద్రుఁడు పశ్చిమ చాళుక్యుల మదమడంప యత్నించు ప్రారంభించినప్పటినుండియు తరుణీలలామ మహాహవరంగ దర్శనాపేక్ష కలదై యుండెను. మనోవాంఛ నప్పుడెప్పుడు జనకునకెఱుకపఱచుచుండెను. వీరరాజేంద్రుఁడు పశ్చిమ చాళుక్యుల సమూల నాశనమొనర్ప ధైర్యము గలవాఁడగుటచే నామె కోరిక కడ్డుచెప్పకుండెను. అందువలన సమరమునకై చోళసేన బయలుదేరినంత నాబిడయు సము

చిత జానీజన పరివృతయై కొంతదూర మాందోళికయందును కొంతదూరము వారువముపైనను మఱికొంతదూరము గజారూఢయయ్యును బయన మొనరించెను. దానిఁబట్టి చదువరు లామె చపలచిత్తయని భావింతురు కాఁబోలును. స్త్రీలు సాధారణముగ చపలచిత్తలనియే కదా మన కవులు వాకొందురు; మన మూకొందము.

సింహాసనవరము జరిగిన దినమునకు దినద్వయము పూర్వము త్రిపురసుందరి విడిసిన చోటునకు పదిక్రోసుల దూరమునందుండిన యొక పర్వతాగ్రమందలి దైవమును దర్శింప నరిగియుండినది. ఆ లలన, దైవభక్తి మెయిగాదు వెళ్లినది. ఆ పర్వతము సూటిగనుండునని వినుట నామె యశ్వారోహయై దానినెక్కి తనసాహసము లోకమునకుఁ జాటింపఁ దలచి వెళ్లియుండెను. అదియటులుండనిండు.

చోళ సేనానాయకుని తనయుఁడు నటరాజవర్మపై నామె మానస మప్పుడపుడు పోవుచుండినది. నటరాజు రూపమునందును శౌర్యమునందు ననమానుఁడు. పాండితి మాత్రము శూన్యము, సర్వము నొకనియం దుండునా? కోపమతనికి చాల దగ్గఱచుట్టము. కడపటి రెండువిషయములు తలంపున కరుదెంచిన సమయము లందుఁ దప్ప త్రిపుర కడగంటిచూపు లాయువకునిపైఁ బఱపుచుండినది. ఒకటి రెండు మారు లాతని శౌర్యము తన శౌర్యమును మించినదని తెలిసి కొనిన దగుట కొలఁదిపాటి గౌరవమును గలిగియుండినది.

నేఁడాతని వెంటనిడుకొనియే దైవ దర్శనమున కరిగినది. నటరాజుమాత్ర మా సుందరితోడిదే లోకమని భావించు చుండెను. తన మనోదేవతా దర్శన మతఁడు మానునా? ఆపె తననుదప్ప యితర పురుషుల గన్నెత్తియైన చూడదను కొనుచుండెను. ఆహా! పురుషులెంతటి మూర్ఖులు. స్త్రీల విషయమున నాపాటి మనస్థైర్యముగలవారై యుండినచో నెంత బాగుండెడిది. ఎంతగ, వియోగ, ఆశాభంగ జనిత పరితాపముల నందకుందురు. పురుషులకా భాగ్యము దైవ మీయడు.

పోనిండు, వాహనములపై త్రిపురసుందరి నటరాజాది పరివారముతో నరుదెంచుచుండెను. సమరభూమికి వారు రెండు క్రోసుల దూరమునందుండిరి. ఇట త్రియామనంతయు శత్రుజన చ్ఛేదనమున నేగడపుట నందఱును మనఃపూర్వ కముగ కోరకుండిరి. అందువలనఁ గలకల మంతగ నుండ లేదు. ఘోరసమరము జరిగినదని తెలియకయే నిదానముగ వారు పయనము సాగించుచుండిరి.

వారికెదురుగ నొక యశ్వము పఱుగిడి వచ్చుచుండెను. ఆశ్వికునిఁ గ్రింద పడవైచి వచ్చుచుండెనని తలంచి త్రిపురసుందరి యా విషయమును జెప్పి గట్టిగ హాస మొన రించెను. అందు నవ్వవలసిన యావశ్యకత లేకుండినను, దాస్యధర్మము ననుసరించి పరివారము నవ్వెను. తురగము సమీపింప దానినుండి వ్రేలాడు నాశ్వికుఁడు వారి కంటఁ

బడెను. వారి ముఖములందొక మార్పుగుపడెను. నటరాజవర్మ చటాలున దుమికి యాయశ్వము నాపెను. త్రిపురసుందరియు దుమికి యాశ్వికుని వారువమునుండి తొలగించుటయందు సహాయపడెను. ఆశ్వికు నాకుమారి యాజ్ఞ మేరకు నొక పిల్లకాలువ సమీపమునందలి సమప్రదేశమునఁ బరుండబెట్టిరి.

భటులు దెచ్చిన నీరముతో త్రిపురసుందరి యాశ్వికుని తలకుఁ దగిలిన గాయమందలి రుధిరమును దుడచి యొక విధముగ కట్టుఁగట్టఁబోవుచుండ నటరాజవర్మ సమీపమందలి యొక తీవరసము నంటించి కట్టుగట్టెను. అంతలో నావీరకాంత దేహమందలి యితరగాయము లందలిరక్తమును దుడిచి యామూర్తినిఁ దిలకించుచు కూర్చుండెను. మందబుద్ధియగు నటరాజామాత్రము గ్రహింపజాలక పోయెను. ప్రణయమెట్టి సమయములందైన నుత్పన్నమగు ననుటా యువకుఁ డెఱుంగఁడు. యువతీహృదయ చాంచల్యము నెఱుంగగలట్టి రసికుఁడా నావీరుఁడు వడసియుండలేదు. ఆశ్వికుని మూర్తి నంతజూచినను త్రిపురసుందరి నయనములు సంతృప్తి యనున దెఱుంగకుండినవి. ఒక దీర్ఘోచ్ఛ్వాసము మాత్ర మామె సుందరవదనమునుండి నిర్గతమయ్యెను.

కాలచక్ర మది యదనని బిరబిరతిరిగెను. ఒకటిరెండు గడియలకాలము గడచినది. ఆమెనయనములు మూతపడెను. సహజసౌందర్యవతి ; విస్ఫారితనయన ; అట్టిచో ననిమేషత నందిన యాపె దేవాంగనయన నెవరు సాహసింపరు ? ఎవరు

సాహసింపక పోయిన నేమి, మూర్ఛ దేరినయాతఁడు దలంచెను. ఆతఁడు తాను రణాంగణమున మరణించి పురాణములందుఁ దెలుపఁబడినటుఁ రంభాసామీప్యము నందుండినటుల భావించెను. మతిభ్రమణమందిన యా శూరుఁడు పరివారమాడుకొనుమాటల దైవవాక్కులుగ భావించెను. గాయముల బాధనంది దేవలోకము కాదేమోయని యనుమానించి యా దేవీమూర్తి నటులే విలోకించుచుండెను.

మఱియొక్క గడియకాలము గడచి పోయినది. ఆశ్వికుఁ డొక్కింత తెలివినందినవాఁడై విషయముల గమనింపఁగలిగెను. హీనస్వరముతో,

"నా ప్రాణదాయినీ! నీవెవరు?" అని పలికెను.

"నటరాజవర్మ తెలుపఁబోవ నాపి యా రాకుమారి 'ఓశూరుఁడా! నీ వెవరు?' అని ప్రశ్నించెను.

ఆ వీరుఁడు పలుకలేదు. రాకుమారి నోరు మెదల్ప లేదు. నాతి మృదులముగఁ బలుకగలిగి నందులకే యా బింబాధరి యచ్చెరువు నందుచుండెను గాఁబోలును. ఆ యువతీయువకుల నయనములు సంఘర్షణ మొనర్చుచుండినవి. ప్రక్క కేగుచుండినవి. ప్రణయ సందేశము లిరుపక్షములనుండియు నాగిపోవుచుండినవి. ఆ యిరువుర హృదయములు నిశ్శబ్దభాషను మిక్కుటముగ భాషించుకొనుచుండినవి. నటరాజవర్మ, త్రిపురసుందరిని ప్రాణప్రదముగ ప్రేమించు నటరాజవర్మ, మూగునివలె నిలిచియుండెను.

'మగవాఁడో మ్రానో యన్నమాట నేటిమాటయె చెపుమా' యన్న కవి సార్వభౌముఁడు వ్యర్థుఁడా ?

అంతలో కొందఱాశ్వికు లట కరుదెంచిరి. వారు త్రిపురసుందరికై యంపఁబడినవారు. ఆమెను చూచినంత వారువములనుండి దిగి తమ యేలిక యాపతి నెఱుకపఱచిరి. ఆబిడ యాశ్వికుని భద్రముగ వెంటతీసికొని రా నాజ్ఞాపించి జనకుని శిబిరమును గూర్చి పయనమయ్యెను. సమరభూమిని డాసినంత జనకుఁడు భటుల నంపఁదగిన కారణము నూహించుకొనియెను. పాలికలని యందు నిర్భయముగ కరుణాలేశమైన గాంచని హృదయముతో నాబిడ పయనించి యాశ్వికునితో జనకుని శిబిరమును డాసెను. సుతాపితలు పరిష్వంగ మొనర్చినమీఁదఁ ద్రిపురసుందరి యాశ్వికుని రక్షణమును గూర్చి ప్రస్తావించెను. తనయ నోటినుండి యా మాట వెలువడినంత నా శూరశిఖామణి రాజవైద్యుల నా యాశ్వికునిపయి జాగరూకత వహింప నాజ్ఞాపించెను.

వీరరాజేంద్రుఁడు పగతుర నిశ్శేషముగ పారఁద్రోలఁ గలిగినందులకత్యధికానందమంది యుండుట పై యుత్సాహమునకుఁ గారణము.

వీరరాజేంద్రుని గుడారము విశాలమైనది. అందొకచో నా యాశ్వికునకు శయ్య యమర్పఁబడ వైద్యులటనే తగు చికిత్స లొనరించు చుండిరి. తన వాహినియందలి ప్రముఖులతో నా రాజచంద్రుఁడు నాఁటి యాహవ విశేషముల మాటాడుచుండెను.

యలు పోరాడిన పిదప క్షతగాత్రుఁడ నయ్యెను నా వీరా గ్రణిని బంధింపఁ గలిగితిని. అంత నేమూర్ఛిల్లితిని. నేమూర్ఛ దేరులోపల నీ యాహవమల్లుఁడు సమీపమం దుండిన వీరభటుని చుఱియ నొకదానిని పరీక్షించుటకై కొని హృద యమునందు పొడుచుకొనెను. సమయమునకు సరిగ కన్నులు దెఱచితిని గాని హీనస్వరుఁడగుట భటుని యాకార్యము నాప దెలుపలేకపోయితిని.

భటులు మమ్మిరువుర నదిని దాటించి తమకడకుఁ గొనివచ్చిరి. శ్రీవయందే యాచాళుక్య సార్వభౌముఁ డసు వులబాసెను. శాత్రవుని బంధనములతో చూచునవమానము కంటె యాత్మహత్యా సంభవ దురితమునే యభిలషించెను. వీరోచిత మరణమునకు నోచుకొనఁ జాలఁడయ్యెను” అని విజయుఁడు కథ ముగించెను.

అశ్వికుఁడు కవ్వున కేకవైచెను. గాయములబాధ యనుకొని వైద్యులలో నొకడట కేఁగి యేవియో యౌషధ ములఁబోసెను.

సప్తదశ ప్రకరణము.

“మోహనాంగా! ఇటు చూడుము”

“ఎందులకు?”

“నీవిచారమునకుఁ గారణము వినుటకు”

“అబలా! నావిచారమున కంత మనునది లేదు”

“చోళరాజ తనయ తలంచిన నెట్టి విచారముండును?”

“సుందరీ! చోళరాజు తనయ కాదు. త్రిలోకనాథ తనయయు నావిచారమును బాపఁజాలదు.”

“చెప్పరాదా!”

“రూపజిత సురసుందరీ! నను మాటాడింపకుము”

“ఏల?”

“నాహృదయమందలి పరితాప మతిశయించును”

“కారణము?”

“మానినీ! ఏల తెలియవు? సకలగుణశాలినివి. పరేంగితావగాహినివి కదా!”

“ఎందులకీప్రశంస?”

“అబలా! దాపనేల? నీపై మోహము నాకుఁగలదు”
“ఓ! అందులకా! పరితాపము. నా మాటలంబట్టి యైన నాభావము గ్రహింపఁజాలకుంటివా?”

“అది గ్రహింపబట్టియే నాపరితాపము నెవ్వరును బాపజాలరంటిని.”

“నేను నీయభిప్రాయముల గ్రహింపఁజాలకుంటిని”

“మోహనాంగీ! వినుము. నేను నిను వివాహమాడ జాలను. ఒకవేళ నేనస్మ్మతించినను నీజనకుఁడు సమ్మతింపఁడు.”

“నాజనకుఁడిప్పటి వరకు నా కోరిక నొకటియు రిత్తపుచ్చి యెఱుఁగఁడు.”

“ఇదియే మొకటి దగును”

“కాదంటెమ్ము” అనుచుఁ ద్రిపురసుందరి యాయువకుని కరగ్రహణ మొనరుప యత్నించెను. ఒక సహాకార

కుటజమునానుకొని నిలచియుండిన యాయువకుఁ డటనుండి పలాయితుఁడయ్యెను. ఆయువకుని విపరీతచర్య కాచోళ నాయకతనయ యచ్చెరువునంది ప్రమాన్పడి నిలిచిపోయెను. మన సారంగధరుఁడే యైనచో నామెనుజూచి చప్పున శత పద్యముల రచించియుండెడువాఁడే. త్రిపురసుందరి కమాంతముగ క్రోధ మొదవెను. దేహలత కంపితమైపోయెను. తన వలఘునంది, తనను వలచి యుట పరుగిడిన యాయువకుఁ డున్మాదుఁడాయని యాయువిద భావించెను. మనసున నువ్వోష్ఠగ మోహముత్పన్నమై క్రోధము నణచివైచెను.

మోహము మరల క్రోధమున కెడమిచ్చెను. క్రోధ మోహము లుప్పిరిగొనెను. అట్టి ద్వంద్వభావములకుం జిక్కి యాకరతలోదరి హృదయము క్షోభించిపోయెను. ఆ సంక్షోభమున నలసి యాసుమకోమలి తటాలున కూలబడెను. అంత నొకింతవడి కాముదవతిదిశలుపరికించెను. నాతిదూరమున మఱియొక యువకుఁడొక పొదరింటి దాఁపున నుపవిష్టుఁడై యుండెను. ఆతఁడె తన వలపుకాఁడాయని భావించి త్రిపుర హృదయ మానందరసమగ్నమైపోయెను. వానికెరుకలేకయే సమీపించెను. ఆమెకుఁ దెలియకయే యామె పాదములు నిలిచిపోయెను. ముఖమొక్కింత వైవర్ణ్యమునందెను. ఆమె హృదయమునందు తానా యువకునితో నాడిన మోహాలాపముల నుపవిష్టుఁడు వినియుండునా? యను సంశయము విద్యుల్లతికవలె మెఱసిపోయెను. ఒక కాంత, అందును

రూపగుణ సౌశీల్యముల కిరవగు కాంత, పురుషునిచే తిరస్కరింపఁబడు టితరులు తెలియ నిచ్ఛగించునా?

ఆపె హృదయ సంశయముల నివారింప దలంచి కాంభోలు, నాయువకుఁడు "రాకుమారీ! విచారింపకుము. ఆయువకుఁడు మరలరాఁడు."

"విజయసింహా! నీ కెటు తెలియును"

"అది వేఱొకకథ"

"నేను వినరాదా!"

"ఇప్పుడు కాదు"

"పోనిమ్ము, నీ దేహారోగ్య మెటులున్నది?"

"మీ యాదరమునను, మీ వైద్యుల నైపుణ్యమునను స్వస్థుఁడనై యుంటిని"

"మహారాజనకుఁడు నీకు వజ్రములు తాపిన చంద్రహార మొకటి బహుమాన మీఁగోరియుండెనుగదా!"

"మీరే తెలిపితిరి కాంభోలున."

"ఆ—ఏమితప్పా!"

ఆయిరుపురవదలి పాఠకులు పరుగిడినయువకునిఁ జూడ రావలయును. ఆయువకుని ప్రజ్ఞాసిధులగు మా చదువరులు విక్రమాదిత్యునిగఁ దెలిసియుందురు. తమ సేనా విచ్ఛిత్తియు, జనకుని మరణమును విని యాయువకుఁ డందిన పరితాప మింతింతనరానిది. తన నైజమెఱుకపఱచిన చోళనాథుఁడు బంధితునొనర్చునని త్రిపురకొక కల్పితకథను దనను గూర్చి

తెలిపి యుండెను. విక్రముని రాకవినియుండిన వీరరాజేంద్రుఁ డతని పోఁబడి విచారించుచుండినను సంపూర్ణజయము వలనఁ గలిగినయానందము మెయి తనయింటనుండిన వాసిగుఱించియే తెలియఁజాలడయ్యెను.

ఎటులైననేమి విక్రమాదిత్యుఁడు శత్రుజన మధ్యము నుండి తప్పించుకొనియెను. విజయుఁడు తనవిషయము నెవరికి నెఱుకపఱుపఁబడని విశ్వాసముగలవాఁడగుట నాతాకుమాఁ రుడు వెన్నాడువారెరుగాని యుండరని విశ్వసించియుండెను. కానియాతని హృదయము సందోక విధముగా నాందోళనము మితిమీఱుచుండినది. త్రిపురసుందరమూర్తి నాతఁడెంత యత్నించినను దూరము సేయఁజాలకుండెను. ఆతఁడధిరో హించిన యాజానేయ మెంతవేగముగ పరుగిడు చుండెనో యంత వేగముగ నాతనిమది త్రిపురసుందరి వదనపంకే రుహముకడ కరుగుచుండినది. తన జనకుని మరణమునకుఁ గారణుఁడగు వానితనయను దాఁ వలచు టవివేకమని యాతఁడు సంకల్పించు కొనెను. ఫలమేమి? మనసిజుని యారడినాప నాతని శక్తి యేమాత్రము?

విక్రమాదిత్యుఁడు పూటాపూటి నడల వాతాపిని రెండవదిన మధ్యాహ్నమునకుఁ జేరెను. విక్రమాదిత్యుని యాకృతి చాల మారి యుండినది. ఆ పత్తనమునకు సమీపమునందుండిన యొక గ్రామాధికారియింట నాయువ కుఁడు విశ్రమించెను. వారొసంగిన యాహారమును గొని

మైమఱచి యతఁడు నిదురించెను. ఆనిశి యెటుగడచినదియు నతఁడెఱుంగఁడు.

భానూదయమైన యొకగడియకతఁడు మేల్కొనెను. లేవఁబోయెనుగాని యతఁడశక్తుఁడై యుండెను. నిదానించి చూడ బంధితుఁడై యుండినటు లతఁడు గనుగొనెను. ప్రక్కకు జూడ తన కాశ్రయమొసంగిన గ్రామాధికారి తనయులతో బంధింపఁబడి యుండెను. దీనవదనుఁడై యా గ్రామాధికారి "రాకుమారా! నాయధిక ప్రసంగము మీ నిర్బంధమునకుఁ గారణమయ్యెను. మీయంతటి వారి రాకకుబ్బిపోయి యొకరిద్దఱు మిత్రులకుం దెల్పితిని. మీ సోదరుఁడు, సోమేశ్వరుఁడు మిము నిర్బంధించు వారల కైదువందల సువర్ణనాణెముల నొసంగెదనని ప్రకటించి యుండు టెఱుంగను" అనెను.

"నా దోషము?"

"మీరు శత్రుపక్షమును జేరి, మనసైన్య వినాశనమునకుఁ గారకులైతిరఁట."

"మన సైనికు లది నమ్మిరా?"

"రాకుమారా! రాజుమాటల నమ్మని సైనికులగతి తెలుపవలయునా?"

"హా! దైవమెంత కఠినుఁడు?"

అనునంతలో భటులు కొందరటఁ బ్రవేశించిరి. రాకుమారుఁడు మేల్కాంచుటఁ దెలిసి వారాతని నెత్తుకొని పోయి యొక యాందోళికయం దుంచిరి. గ్రామాధికారి

సుతులతో నాపల్లకిని వెంబడింప నాజ్ఞాపింపఁబడెను. కొంత వడికి వారు వాతాపి పురమును బ్రవేశించిరి. విక్రమాదిత్యుఁడొక యంధకార పరివ్యాప్త భవనమునం దుంపఁబడెను. సోమేశ్వరుఁడు గ్రామాధికారికి కొంత జరిమానాను విధించి యంపివేసెను.

ఆ యంధకారపు గదియందుబడి విక్రముఁడు విచారింప సాగెను. తన కంతకుపూర్వము సహాయులుగ నుండిన వారలలో నెవరు సమరమున నీల్గిరో, యెవరు జీవించి యుండిరో యతఁడెఱుంగ కుండెను. సోదరునికుట్ర కతఁడావంతేనియు వింతపడి యుండలేదు. నిర్బంధము కర్మఫలమని యాతఁడు భావించునంతటి యవివేకి కాడు. రాచబిడ్డఁడెప్పటికి నటు లొనర్పఁడు. రాజ్యకాంక్ష మితిమీరియుండిన యా భూజాని తనయుఁడు తప్పించుకొననెటులైన యత్నింపవలయునని నిశ్చయించుకొనెను.

ఆహారాదికములఁ గొనివచ్చువారు రాకొమరునితో మాటాడనైన తలంపకుండిరి. చూచుచుండగనే యొక మాసము గడచిపోయినది. ఆ ముప్పది దినములలో నాతఁడు కొన్ని విషయములఁ దెలిసికొనఁగలిగెను. ఆ గది దుర్గ కుడ్యముపై నుండినది. దానియందు నిర్గమోపాయ సాధనము లెవ్వియు నుండలేదు. ఆ గదికుండు గవాక్షము కందకము వైపున కుండుటవలన నటనుండి పోనెంచుట బుద్ధిలేనితనము. ఆ గవాక్షమును పదునై దడుగులకు పై భాగమునందుంటం

బట్టి యాకుడ్యము స్నిగ్ధమైన దగుటవలనను దానిఁజేరు టశక్యమైనదై యుండెను. కాఁబట్టి యాగవాక్షమునుండి నిర్గమించు నాలోచనము నతఁడు మానవలసి యుండెను. తన కాహారమును దెచ్చువాని గొంతు నులిమి తప్పించు కొనఁ నెంచుటను ద్వారము వెలుపల ఖడ్గపాణులగు భటులు సర్వదా నిలచియుంట చూచి మానెను.

దినములు గడచు కొలఁదిని విక్రమాదిత్యుఁడు తన పరాభవమునకుఁ గారణము విజయసింహుఁడే యని యూహింపసాగెను. అతఁడు రాకుండిన కృష్ణానదికి నుత్తరము నుండి వచ్చుటకు వీలుండెడిది కాదనియు, తనతండ్రి మరణమై యుండెడిది కాదనియుఁ బలుమారు తలంచెను. తలంచు టేమి? విజయుని దూషించెను. విజయునేమి యట్టివాని జన్మింపఁజేసినందులకు దైవమునే దూషించెను. మాసము గడచిపోయిన నాలవనా డాతఁడు విచారహృదయుఁడై నిర్గమోపాయము గగనకుసుమమని భావించుచు, దైవా నుగ్రహమునఁ దప్పించికొనిన విజయసింహుని దప్పక సంకట పఱుప వలయుననియు భావించుచుండెను. నిర్బంధితునకు వివేచనమా?

తరువాత నొక శర మాగవాక్షమునుండి లోని కరు దెంచి కవాటోపరిభాగ కుడ్యమును దగిలి క్రింద పడెను. దానికొక పత్రము గట్టబడియుండెను. ఆ రాకుమారుఁడది చూచి వింతపడకపోలేదు. నాలుగైదు క్షణముల కాలమది.

తనతో మాటాడు నా యన్నటుల నిలచియుండి పిదపదానిని గొనెను. అందిటులుండెను.

"విక్రమాదిత్యా! కార్యాంతరమగ్న చిత్తుఁడనగు నేను నీ విషయమును దెలియనైతిని. నీ వరుదెంచుటయు, బంధింపఁబడుటయు నీకాశ్రయము నొసంగిన గ్రామాధికారి వలనఁ దెలియఁ గలిగితిని. వీరుఁడ వగు నీ నిర్బంధము నా కసహ్యము గొలిపెడిని. గత దినము నీవెటబంధింపఁబడిన దియుఁ దెలిసికొంటిని. నేటి నిశాసమయమున నుత్తియొక శరము నిటులే వేయుదును. దాని కొక పట్టుదారము గట్టఁ బడి యుండును. దానిని లాగుకొంటివేని బలముగు త్రాడును బడయఁ గలవు. ఆ రజ్జువును కవాటమునకో మఱెచ్చటనో గట్టివైచి తత్సహాయమున గవాక్షమునుండి వెలువడుము. కందకమునందొక పడవను నామిత్రుఁడు సిద్ధపఱచియుండును. దాని సహాయమున తీరము చేరిన నశ్వములతో సిద్ధముగ నుందును. అన్యథా భావింపక నే చెప్పినటుల నలుపుము.

నీ మిత్రుఁడు,

రాజనారాయణ 'వనకేసరి'

అది చదువుట నా బంధితుఁ డెన్నిమారులు పఠన రించెనో దైవమున కెఱుక. వనకేసరిని దీర్ఘాయువు నందు నటుల దీవించెనని యేల తెలుపరాదు? ఆ దినశేషము నా నిర్భాగ్యపు రాచబిడ్డ యెటుల గడపెనో యతఁడే యెఱుం గఁడు. అతని యుత్సుకత గమనించి భానుఁడు తటాలున

పశ్చిమాంబుధిని గ్రుంకెను. వెంటనే తిమిర మలముకొనెను. ఆహారమును దెచ్చిన వానితో నా రాసుతుఁ డుల్లాసముతో మాటాడెను. తన సోదరుని యోగక్షేమముల విచారించెను. వాడు వెడలిపోయిన పిదప గవాక్షమువైపు జూచుచు నంధకారమున నిలచియుండెను.

నాలుగైదు గడియలు గడచి పోయెను. శరము రాకుండుటవలన నతఁ డాశాభంగము నంద నారంభించెను. వనకేసరి మోసగించెనా యనుకొనెను. అటు తలంపరాదని నిశ్చయ పఱచుకొనెను. వనకేసరి కెట్టియాటంకమును గలుగ నీయరాదని తన యిష్ట దైవమును పడానను వేవిధములఁ బ్రార్థించెను. విజయసింహునిపై పగతీర్చుకొను భాగ్యము లేకపోయెనని విచారించెను.

అంతలో ననుకొనిన బాణము లోనఁబడెను. దాని కుండినదారము నతి జాగరూకత మెయిలాగెను. అరగడియ గడచిపోయెను. ఆతనిచేతికి బలమగు త్రాడుతగిలెను. దానిని భద్రమగుచోట బంధించి వస్త్రముల నెగగట్టుకొని దానిని బట్టుకొని చిన్నగ గవాక్షమును జేరెను. అందునుండి దిగజారెను. నీటిని సమీపించినంత బలిష్ఠకాయుఁ డొకఁ డాతనిబట్టుకొని పదిలముగ బాలునివలె నొకచో గూర్చుండఁ బెట్టుకొని పడవనునిశ్శబ్దముగ నడుపనారంభించెను. స్వేచ్ఛను బొందిన చాళుక్యరాజతనయుఁడు చల్లని గాలినిఁ బీల్చుచుండెను. కొంతవడికి పడవ తీరమును జేరెను.

అట మారణ సాధనముల సంఘట్టనారవము వారల చెవినిఁబడి వారల చకితుల నొనరించెను. పడవ నడిపిన పురుషుఁడు "రాకుమారా! మోసము జరిగినది. అటనుండు నశ్వములలో నొకదానిపై నెక్కి పలాయితుండవు గమ్ము. బ్రతికియుండిన పునర్దర్శనంబయ్యెడు" నని కరవాలహస్తుడై శబ్దమరుదెంచు దిశకు పరుగిడెను. రాకుమారుఁ డవివేకియై పౌరుషమును బాటింపక పరుగిడెను.

ఆ పురుషుఁడు పరుగిడి వనకేసరికి బాసటయై నిలిచెను. ఇరువది మందితో వనకేసరి పోరాడుచుండెను. అంధకార మగుట నిజనైపుణ్యము నగుపరుపజాల కుండెను. ఆ పురుష సింహులిరువురు నా యాశ్వికదళములో సగభాగమునకు పైగా నఱకివైచిరి. ఏమఱుపాటున వనకేసరి నొకఁడు కరవాలముతోఁ బొడిచెను. వనకేసరి క్రిందపడిపోయెను. తత్సహాయుఁ డుగ్రుఁడై మఱి నలుగురఁ జంపి యితరుల తరిమివైచి వనకేసరి నెత్తుకొని యశ్వము నెక్కి యెందేనిజనెను.

విక్రమాదిత్యుఁ డేగదియందు బంధింపఁబడినదియుఁ దెలిపినభటుఁడు సేనానాయకునకుఁ దనను బ్రశ్నించిన వారిని గుఱించి తెలుప నాశ్వికసేనతో నాతఁడట పొంచియుండి వనకేసరి నెదిరించెను. ఇది యందులకు పూర్వకథ.

అష్టాదశ ప్రకరణము.

త్రిపురసుందరి జన్మించిన వేళావిశేష మెట్టిదోగాని యాశాభంగముల నంద నలవాటు పడిపోయెను. ప్రణయ మామెకు గగనకుసుమమై యుండినది. ఆయమ చిత్త మతి చంచలమైనదగుట సరిపోయెను గాని లేకుండిన నెపుడో యసువులఁ బాసియుండెడిదే!

మొదట నామె సారంగధరునిపైఁ దమి గలిగియుండినది. అది బాల్యమున జరిగినసంగతి. రసగ్రహణ శక్తి యంతగ నుండకుండినను మధురాంతకదేవి మోహించినదని తాను మోహించెను. ఆతఁడు సంగీత విద్యా ప్రవీణుఁడని లోకులు ప్రశంసించు చుండ నామెయుఁ బ్రశంసించినది. కాని యుదారహృదయులది యాశాభంగముగఁ దలంపక పోవచ్చును. ద్వితీయుఁడు విక్రమాదిత్యుడు. కాదు-కాదు. సేనాపతి తనయుఁడు నటరాజు. కాని యతనిపై నామె మొదటినుండియు మరులుకొని యుండలేదు. మచ్చిక వడిన జంతువువలె నా రాకుమారి చెప్పు కార్యములఁ గడు శ్రద్ధ మెయి నొనరించు చుండుటవలన వేతనముగ కడగంటి చూపుల నొసరుచుండినది. విక్రమాదిత్యుని మాత్రము సం పూర్ణముగఁ బ్రేమించినటు తలంచినది. కాని యాభావము సమగ్రముగ హృదంతరాళమున నేర్పడునంతలో నామె హృద్రంగస్థలమున విజయుని పాత్ర ప్రవేశ పెట్టఁబడియెను. ఆతని ప్రశంసయే వీరభటుని నోటినుండియు వినుటవలన

వీరత్వపక్షపాత యగు తాను దనహృత్క్షేత్రమునందా యువకునకుఁ దగిన తావొసంగకుంట లోపమని భావించెను.

విక్రమాదిత్యుని చూపులు మాటలు త్రిపురనున్మాదిని నొనర్చెను. విజయసింహునితో సంభాషణమునకు నవకాశ మట్టె యా బింబాధరికొదవియు నుండలేదు. విక్రమాదిత్య త్రిపుర లేకాంత ప్రదేశమున నుండని దినమే లేక కాల మెంతయో గడచిపోయెను. తన హృదయాధినాథుఁడు విక్రమాదిత్యుఁడే యని యా రాసుత భావించెను.

ఆ కోనులి యాకాశ హర్మ్యముల నొక్క పెట్టున నేలఁబడవైచి విక్రముఁడు పలాయితుఁ డయ్యెను. అంత వినుగక త్రిపురసుందరి విజయునిపై నిజ మనో భావమును ద్రిప్పుకొనెను. నిజముగ తా నా యువకుని విషయమున గలిగియుండినంతటి రాగ మితరులపై నందియుండలేదని భావించెను. తప్పక విజయసింహుని ప్రణయబంధితు నొనర్ప దృఢసంకల్ప మొనరించెను. హావభావములచే నతని లో బఱచుకొన యత్నించెను. తన సాహసమున నాతని హృదయమును ద్రిప్పుకొన నారంభించెను. అశ్వారోహణమునందలి తన నేర్పుచే నా మదవతి విజయుని కచ్చెరువు గొలుప యత్నించెను.

కాని ఫలము? విజయసింహుఁ డంధుఁడు గాఁడు; అరసికుఁడుగాఁడు. త్రిపురసుందరి విక్రమాదిత్యుని యెడ జూపు ప్రణయదృక్కుల నతఁడు గమనించి యుండెను.

ఆశాభంగమున నత్యధిక దీనతావిష్టమనుండై తిరుగు నటరాజవర్మ నతఁడు దిలకింపక పోలేదు. యువతీహృదయము పవనతాడితవారివాహమువంటిదని గ్రహింపకపోలేదు. ఆ పురుషద్వయమునకు సహాయుఁడుగ బో నతడిచ్ఛగింప డయ్యెను. విక్రముని పలాయనమైన పిదప త్రిపురయందలి మార్పు నతఁడు గ్రహించెను. నెమ్మది విరాగమును బాదు కొల్పెను. తనకుండు కార్యభారము నతఁడు స్మరించి వీర రాజేంద్రుని మెప్పువడసి సారంగధరునకు సహాయపడఁ దలచుచుండెను.

ఇఁకఁ జెప్పున దేమి. దినములు గడచుకొలది త్రిపురకు తమి యెక్కుడగుటయుఁ బ్రతిఫలము లేకపోవుటవలన నామెకు సహజమగు క్రోధ మగుబడుటయు నది దినముల వరుస నధికమగుటయుఁ బొసఁగెను. విజయసింహుఁడు లోకజ్ఞాన సంపన్నుడేగాని యిట ప్రమాదపడెను. తాను త్రిపురసుందరియెడల వహించిన వైముఖ్యము దనకార్యమున కనర్థదాయక మగునని యాతఁడొకనాఁడేని భావించియుండ లేదు. వీరరాజేంద్రుఁ డనుదినమును దనపై నభిమానము నత్యధికము గ గాంచుచుండెనని యుబ్బిపోవు చుండెను.

ఉరయ్యూరునకు మరలక, వీరరాజేంద్రుఁడు పల్లవ రాజ్యమందలి పినాకినీ నదీతీర పురమున విడసెను. నాలుగు మాసము లచటనుండినను నిజపురికేగ నతఁడు దలంపఁ డయ్యెను. ఎవరా వీరశిఖామణిని బ్రశ్నింప సాహసింప

రైరి. పల్లవరాజు మాత్రము కడుజాగరూకుఁడై యాతని కెట్టి యిబ్బందియుఁ గలిగింపక మెలఁగుచుండెను. విజయసింహుఁ డొకటిరెండు మారులు తన యేలికయగు విజయాదిత్యుని దౌర్మార్గ్యమును గుఱించి ప్రస్తావించినపుడు కుపితుఁడైనటు నటించెను. అది నటనగ దెలియని విజయుఁడిక సారంగధరునకు భయములేదని భావించెను.

విజయసింహుఁ డెటకేఁగినను నలువురు చోళభటులాతని వెన్నాడుచునే యుండిరి. చాలకాలమునకుగాని విజయుఁడు వారిసాంగత్యవైపరీత్యము గమనింపఁడయ్యెను. గమనించిన పిదప వీరరాజేంద్రునిపై ననుమానమమితమయ్యెను. విజయసింహుని సైన్యమతఁ డెఱుఁగకయే యెటకో యంపఁబడెను. పది పదునైదు దినములకుగాని యతఁడు తన యసహాయత గమనింపఁ డయ్యెను. త్రిపురసుందరి ప్రేమాలాపములా యువకున కసహ్యములైపోయెను. కడకాతఁడు తనకట్టిస్థితి తిరస్కృతప్రణయయగు త్రిపుర వలననే గలిగెనని భావించెను. చేతులు గాలినమీద నాకులుబట్టిన నేమి లాభము ?

రాజేంద్రచోళుఁ డస్వస్థుడై యుండెనని విని వీరరాజేంద్రుఁడు సముచిత పరివారముతో, నరయ్యూరు చేర నేఁగెను. అతఁడట చేరినయొక మాసమునకు సకలసేనను రప్పించుకొనియెను. ఏయూహతో నతఁడు పల్లవదేశమున నుండెనో యది యెవరును గ్రహింపఁ జాలకుండిరి. మఱి రెండు

వత్సరములాతఁడేమియు నలుపక యెద్దియో కార్యాలోచనా నిమగ్నుఁడై యుండిపోయెను.

ఇంతలో విక్రమాదిత్యుఁ డురయ్యూరు చేరి తన యసహాయస్థితిని దెలుపుకొనెను. తరతరములనుండి వైరము గలిగియుంటన వారి సంతతిలోని యొకఁడు తన నాశ్రయించి నందులకా చోళపతి యందిన యానంద మింతింతన రానిది. వెనుకముందులు చూడక విక్రమున కాశ్రయ మొసంగెను. అంతతో నిలక నా భూభృత్తు వాని యాలోచనముల నతి శ్రద్ధతో నాలకింప సాగెను.

విజయ సింహుఁ డిదంతయు వింతగ విలోకించు చుండెను. ఒకటిరెండు మారు లురయ్యూరువదలి పోదలంచి వ్యర్థ ప్రయత్నుఁడయ్యెను. త్రిపురసుందరి బాధ తప్పిపోయిన పిదప నతఁడాపె తనతో మాటాడనందులకు విచారింపసాగెను. తన యవివేకమునకు రహస్యముగ చింతించెను. పురుషు లెంతటి యవివేకులు. చేజిక్కియున్నపుడు నిరసింతురు; తప్పి పోయిన పిదప పిలపింతురు. అది యటులుండ విక్రమాదిత్యుఁడు క్రోధారుణితనేత్రుఁడై యగుపడినపుడంతయుఁ జూచు చుండెను. అదంతయుఁ ద్రిపుర సుందరిచేతయని యతఁడు భావించెనుగాని నైజమును గ్రహింపఁ జాలఁడయ్యెను. ఆక్రోధాగ్నికింధనముల త్రిపురసుందరి వేయకపోలేదు. విజయుఁడు తంత్రావాపసమర్థుఁడై నచో నటరాజవర్మ సహాయమును గొని యుండెడి వాఁడేకాని యబలకు భయపడి సహాయ మభిలషించుటతఁడు న్యూనతగ భావించి యుండును.

విజయుని నిర్బంధము దినక్రమముగ నతిశయించి కడకొక భవనమునందుంపఁబడుట తటస్థించెను. తాఁదలఁచిన దొకటియు జరిగినది వేఱొకటియు నగుట నతఁడత్యధిక విచారమునకు లోనయ్యెను. ఆశ్రయమొసఁగిన యాహవమల్లుఁడు హతుఁడగుటవలన మిత్రుని గతియేమయ్యెనో యను విచారము స్వస్థితినిగూడ మఱచునటు లొనరించెను. విజయు నప్పటి మనోవ్యాకులము పగతునకైన వలదు.

ఇది యిటులుండ చోళనాథుఁడు రాజేంద్రుఁడు మరణించెను. వీరరాజేంద్రుఁ డేలికయయ్యెను. సర్వసేనాధిపత్యము నటరాజవర్మ వహించెను. విక్రమాదిత్యుడు సహాయ సేనాధిపత్యము వహించెను. త్రిపురసుందరీ విక్రముల ప్రేమ నూతన శోభను వహించెను. విజయుని విచారము బలమై యాతని నస్వస్థు నొనరించెను. అట్టి పరిస్థితులలో విజయుఁడు వీరరాజేంద్రుఁడు పూర్వ చాళుక్యులపై నెత్తిపోనుండెనని విని కులిశపాతము నందినటుల విహ్వలుఁడై పోయెను. సారంగధరుని వెంటవెళ్ళి యుండినచో నిట్టి పరిణామము గలుగకుండెడిదని యతఁడు దలంచెను. గతజలసేతు బంధనముతో బనియేమి? ఎటులైన దప్పించుకొని, తగుసేనతో విజయాదిత్యునకు సహాయ పడకుండిన పూర్వచాళుక్య రాజ్యరమ చోళహస్తగత మగునని యాతఁడు భావించెను. పల్లవపతి యిష్టపడకుండినను కీర్తివర్మ, మధుసూదనవర్మల సహాయము బడయఁ గలుగుదునను ధైర్యమా వీరకుమారుఁ డందియుండెను.

మఱి తప్పించుకొనుటయో ? శత్రుజన మధ్యమునుండి పోగుట సాధ్యమా ? ఒకవైపు త్రిపురసుందరి, మఱియొక వైపు విక్రముఁడు జాగరూకులై వర్తించుచుండిరి. నటరాజవర్మ మాత్రము వీరలైనవు డంతయు, రహస్యముగ పలుగిడుటంత కష్టసాధ్యముకాదని సూచించు చుండెను. వత్సరద్వయమట నున్మాదస్థితినుండిన వాఁడగుట విజయుఁడా భాషణము లందలిభావము నర్థము జేసికొన లేకుండెను. అదియుఁగాక నటరాజవర్మ విక్రమునిపైనను, త్రిపురసుందరి పైనను ప్రతీకార వాంఛగలట్టులా రాచబిడ్డను మోహించి యుండెనని యాతఁడెఱుంగడు.

యుద్ధయాత్రా ప్రయత్నములవారిగ జరుగుచుండెను. అశ్వముల నుత్తర హిందూస్థానమునుండి విక్రమాదిత్యు నాలోచనముపై వీరరాజేంద్రుఁడు దెప్పించుచుండెను. అందు గొన్నిఁటి నటరాజవర్మయుఁ గొన్నిఁటి విక్రముఁడు సుశిక్షితముల నొనర్చుచుండిరి. ఒక యాజానేయ మా యిరువురకును సాధ్యపడనిదై యుండెను. నటరాజవర్మ వీరరాజేంద్రునితో విజయుని ప్రస్తావనము దెచ్చెను. త్రిపురసుందరీ విక్రములు విహారమునకై వెళ్లియుండుట నాచోళనాథుఁడు సమ్మతించెను

విజయసింహుఁడు నిరుత్సాహుఁడై యుండినను శరీర వ్యాయామమునం దేమఱకయుండెను. నటరాజవర్మ రాజుగారియెదుర నూతనాశ్వమునుసాధుపఱుపఁగోరెను. ఆ సంభా

వణముసందు విజయుఁడాతని కనుసైగను గమనించెను. అశ్వ ముత్తమజాతికిఁ జేరినది. దానికన్నంత స్నిగ్ధములగు కాంతి ములగాంచిన ప్రాయసకానివలె విజయుఁ డుత్సాహాతి శయము నందెను.

అశ్వము నతి శ్రమపై నధిరోహించెను. ఆ యాజా నేయము దనకుఁ దగిన యాశ్వికుఁడు లభించినటు తెలిసి కొనినది. దాని విధేయత గమనించి నంత విజయసింహుఁడు రాజమార్గమును బట్టెను. అతఁడు పురసింహద్వారమును జేరు వరకు నెల్లరు నాతని యభిప్రాయము గమనింపరైరి. గమ నించినపిదప ఫలములేకపోయెను. నటరాజవర్మ మాత్రము సమీపమందలి యాశ్వము నధిరోహించి వెంబడించెను. ఉత్తమాశ్వికుఁడగు విజయునాతఁడు గలియఁ జాలకపోయెను. కలియవలయునని నటరాజ వర్మ దలంచియు నుండలేదు. ప్రపంచమంతయు నటన.

ఏకోనవింశతి ప్రకరణము.

విజయసింహుఁడు ఉఱయ్యూరు పరిసరముల దాఁటి నంత నశ్వము నొకచో నాపి యెటులేగవలయునని యాలో చింపసాగెను. సేనారహితుఁడై రాజమహేంద్రవరము సేరిన ఫలముండదని యాతఁడూహించెను. ఎటులైన సారంగధరుని వెంటఁదీసికొనివచ్చిన చో వీరభటులు కొందఱు చేరుదురనియు నా కొలఁది సేనతోఁ జోళుల కొంతకాలమాపవచ్చుననియుఁ

దలంచెను. అశ్వము దగిన నాయకుండు లభించినందుల కానంద మొందుచు బిసరుహ బాంధవసైంధవముల నధఃకరించు వేగమునం బోసాగెను.

ఏలాటివిశేషమును లేకయే యాపూర్వచాళుక్యసేనాని వాతాపి జేరెను. అట సారంగధరుని గుఱించి విచారింప పశ్చిమ కనుమలయందుండు వైజయంతి యందుండెనని తెలియవచ్చెను. ఏ పదిగడియలో విశ్రాంతిగొని యావీరుడు దక్షిణముగ బయలుదేరెను. మార్గమున న్యాయా న్యాయములు పరికింపక ఘోటమును గ్రాసమును సంపాదించెను. మార్గము సముద్రదేశముగనుండమి యాతని పయనము చాల నిదానముగ జరిగెను. ఉరయ్యూరు వదలిన యిరువదిదినముల కతండు పథశ్రాంతుండై వైజయంతినిం జేరెను. ఆపురమును జేరినపు డతడందిన యచ్చెరువునకు మేర లేదు. ఎట చూచినను వీర కుమారులు సాయుధులై యుండిరి. ఒకటి రెండు దినములలో జైత్రయాత్ర జరుగునటులాతడు గమనించెను. సారంగధరుం డుండు తావున యుద్ధసన్నాహ మతనికి వింత గొలిపినది.

ఆ వింతను మించిన వింతయతండు గనుండు నెఱుంగడు. ఒకగొప్ప భవనమునందుం దనమిత్రుం డుండెనని విని యటకేంగెను. ఆభవనపు టుద్యానవాటికయందొక పురుష సంఘమునుగాంచి వారలడాసి యుల్లై నిలిచిపోయెను. అంత సారంగధరుండు "విజయా! వచ్చితివా? ఎంతటి సుదినము-

అనుచుఁ గౌఁగిలించుకొనియెను. ఆపరిష్వంగ మఱఁగడియ కాల మువుండిన దనినచో మిత్ర వాత్సల్యమును జదువరు లూహింతురుగాక! స్వచ్ఛందమైత్రి కిరవుగదా మనయాంధ్రావని.

"ఏమిమిత్రమా! అచ్చెరువునందుచుంటివి. వీరందఱును వీరుఁడవగు నీకుఁ బరిచితులే. ఇతఁడు రామసింహుఁడు. చోళనాథుఁ డంపివైచిన పూర్వచాళుక్యసేన కధినాథుఁడు. ఇతఁడు సింహాపుర యువరాజు మధుసూదన వర్మ. ఇతఁడు కీర్తివర్మ. ఇతఁడు మల్లయుద్ధనిపుణుఁడగు బిందుమాధవుఁడు. వీరందఱును నిను బ్రశంసింపని దినములేదు."

"వీరెందులకిట సమావేశమైరి?"

"నాకు సహాయపడుటకు. వీరివాత్సల్యము నేమందును. వీరికంటె నా వనకేసరి యెడ నెంతయుఁ గృతజ్ఞుఁడను."

"అతఁడెక్కడ?"

"ఉత్తర కళింగమునకుఁ గార్యాంతరమున నేఁగి యుండెను."

"వీరు చాలరా?"

"చాలరని కాదు. ఆతని యాశయములు నాకెటు దెలియును. పోనిమ్ము. ఇన్నిదినములట నేమిచేయుచుంటివి. మా త్రిపురసుందరి క్షేమమా? బాలరాజు పరకేసరివర్మ యని నామము మార్చుకొనెనట గదా! క్షేమమా? విక్రమాదిత్యుఁ డెట్లున్నాఁడు? వేంగీదేశమును లోబఱచు కొనుట సులభమటగదా? నీవా పురమువదలి యిరువది దినములయ్యెగదా! ఇంత జాగెందులకు?"

"మిత్రమా! ఆగుము. ఇదేమి విపరీతము? శత యోజనముల దూరమునందుండిన నీ కివి యెటుదెలిసెను?"

"నటరాజవర్మ యొసఁగిన యశ్వమేది? దారిని వదలి వైచితివా?"

"శారంగధరా! నీకు యోగదృష్టి యున్నదాఏమి?"

"నాకుఁగాదు. 'వనకేసరికి.' అతని నడుగుము"

"వనకేసరి నీమనసు త్రిప్పఁ గలిగినందులకు నేనతని కెంతయుఁ గృతజ్ఞుఁడను."

"మనసు త్రిప్పుటేమి? నాపినతృవ్యుని శిక్షింపఁ గాదు-రక్షించుటకుఁగదా మనము పోవునది"

"మఱియాలస్య మెందులకు?"

"ఓయీ శూరుఁడా! విశ్రాంతి గొనుము. వారుర యశ్వారు నింకను సాగలేదు. వారు పయనమారంభించిన పిదప మనము శీఘ్రముగ పోయి తుంగభద్రానది యుత్తరపు టొడ్డున పయనించితిమేని వారికంటె రెండు దినములు ముందే కృష్ణానదిని దాఁటఁగలము. వారిని నదిని దాటనీకుండగనే పోరితిమేని బాగుండును."

"ఏమిది? మిత్రమా! నే నిదురించుట లేదుకదా! వ్యాకరణ సూత్రములఁ జెప్పిన నోటనేనా? యుద్ధసన్నాహములఁ దెలుపుచుంటివి. వనకేసరి శిష్యుఁడవైతివి కాఁబోలును. రాకుమారా! నాకీనాఁ డెంతటి యానందమును గలిగించితివో తెలియుదువా? నిద్రాహారములు లేక యలసిన నా తనువు

సహస్రగజ సత్త్వముగలదైనది. ఆ వనకేసరికి సాగి మ్రొక్క నా యుల్లము తత్తరపడుచున్నది."

"ఆతఁ డగుపడినపు డటులే చేయుదువు లెమ్ము. సారంగధరా! ఏదీ యా చదరంగమును బూర్తినాడి చూపింపు" మని బిందుమాధవశర్మ యనెను. (కాదంబులు బ్రాహ్మణులని చరిత్ర చెప్పుచున్నది).

"సమర సన్నాహమును వదలి యాటయా?" అని విజయుఁడు బావమఱఁదితో ననెను.

"విజయసింహుఁడు సర్వ సేనాధిపత్యము వహించు నటులున్నది" యని నాగసూనుఁడు నవ్వెను.

"వనకేసరి లేకున్న నితనికే యాధిపత్య మీయవచ్చు" నని కీర్తివర్మ మహాతీవ్రముగనని నవ్వెను.

"రెండువత్సరములు శత్రుమధ్యమునందుండిన వీరున కంతటిపదవి యన్యాయమే" యని రామసింహుఁడు నవ్వనటులే నవ్వి పలికెను.

"ఆట ప్రతీహారసుందరి లేకుండిన నన్నిదినములుండఁ" డని సారంగధరుఁడు రాజును జరుపుచు ననెను.

విజయసింహుఁ డటనుండి వెళ్ళిపోయెను. అట సమావేశమైన వారందఱును బక్కున నవ్విరి. ఆ హాసమునకు విజయుఁడు వెనుదిరిగి వారల డాసెను. వారందరును గంభీరములగు వదనములతో గూర్చుండిరి. సారంగధరుఁడు వేణుగానము నారంభించెను. పచ్చికపై నావీరవర్గము సుఖముగఁ

బరుండెను. విజయుఁ డొక్కఁడు నిలిచి వారలఁ జూచుచుండెను. ఎవ్వరు నాతనిఁ గూర్చుండఁ దెలుపరైరి. ఆగానమునకుఁ దన్మయుఁడై విజయసింహుఁడు గూలఁబడెను. అటులెంత కాలము గడపిరో వారే యెఱుఁగరు. భోజనమునకు వేళయైన దని పరిచారకులు దెలుప నెల్లరు నటనుండి వెళ్ళిరి. ఒకప్పుడు మన యాంధ్రావనియందట్టి వీరు లిట్లుండిరా? మనకా దృశ్యము లేదుగదా! పాఠకులైన నట్లగుటకు యత్నింపరా!

నాలుగైదుదినములు గడచినమీఁద సర్వసైన్యమును గదలి యీశాన్యముగ బయలుదేరెను. ఇపుడు పాడుపడిన విజయనగర ముండుప్రదేశమున కెదురుగ నదీప్రాంతమున నాసేన పర్వతప్రదేశములఁ జేరెను. నాలుగైదు వేలకు మించని యాసేన యటఁగొప్పదిగ నగుపడుచుండెను. వారొక పర్వతమును సమీపించినంతన పర్వతాగ్రమునుండి శిలలు పడ నారంభించెను. హఠాత్తుగ గలిగిన యీకార్యమున కచ్చెరువు పడనివారు లేరు.

శత్రులెవరో, యెటనుండిరో తెలియమి వీరభటు లేమిచేయుటకును దోఁచక యాశిలావృష్టినుండి రక్షించు కొనుటకై యత్నించుచుండిరి. బిందుమాధవుడు తటాలున వెనుదిరిగి కొంతదూర మరిగి పర్వతము నారోహించెను. అతఁడుపరిభాగమును జేరునప్పటికే యట వనకేసరియొక్క సహాయునితోఁ బోరాడుచుండెను. బిందుమాధవుడు వనకేసరి రాక నొక కేకతోఁ గ్రిందివారికిఁ దెలిపెను. అంతనతఁడు

వనకేసరికి సహాయపడక యాతని నెదిరించు వారల సూక్ష్మముగ విలోకింపసాగెను. కొంతవడి కాతనిముఖమున నొక హాసరేఖ యగుపడెను.

తటాలున ముందునకరిగి యొక పురుషుని బట్టుకొని యమాంతముగ పైకెత్తి గంభీరముగ "ఓరీ! మీరస్త్రముల గ్రిందఁ బడవైవకుండిన నితనినెత్తి పారవైచెదను." అని పలికెను. ఆ మాటలు మంత్రమువలె పనిచేసినవి. ఇంతలో కొందఱు వీరులు పర్వతారోహణము శిలావృష్టి తగ్గుటంబట్టి యొనరించిరి. వారొకమారు 'వనకేసరికి జయము జయము' అని కేక వేసిరి. విజయుఁడు వనకేసరికడ కరుదెంచి "మహావీరా! రాజనారాయణా! విజయసింహుడు నమస్కరించువాఁడు" అనెను.

"విజయసింహా! నమస్కారము. మీమిత్రుడుసారంగధరుఁడెక్కడ?" అని ప్రశ్నించెను.

"అవును. ఏడీ" యని పలువురనిరి?

"అతడు నాలుగైదు దినములు వైజయంతి నదలవీలులేదని చెప్పెను" అని రామసింహుఁడు దరహాసముతోఁ బలికెను.

"మీతో నెందులకు దెలిపెను" అనివిజయుఁడనెను.

"సర్వసేనాధిపతి యాజ్ఞగొనెను గాబోలు"నని వనకేసరి మందస్మితముతోఁ బలికెను.

"నేనా?" అని రామసింహుఁడు పలికెను.

"వీని నేమిచేయవలయు" నని బిందుమాధవుఁడ నెను. గట్టిగ నవ్వి వనకేసరి "మిత్రమా! చిన్నగ క్రిందఁబెట్టు మా చాళుక్య ధరాభర్తను, మూర్ఛిల్లినటులున్నాఁడు" అనెను. అందఱును నవ్విరి. ఆహా! ఏమి యావీరవరుల యదృష్టము. వారి హృదయాంతర్భాగము లెంత యానందమయములై యుండినవి. సమరమున వారికి విజయము దప్పదని యెవ రనరు! వీరత యానందమునకు సైదోడు కాఁబోలును.

మూర్ఛిల్లిన సోమేశ్వరు నాతని భటుల యధీన మొనరించి, యట్టినాయకునితో నరుదెంచి నందులకు నా వీరుల నలువిధముల పరిహాస వాక్యములఁ బలికి పర్వతావరోహణ మొనరించిరి. మరల సైన్యము లోయలనుండి పయనము సాగించి, యొకపల్లెనుడాసి యట శిబిరముల వేసికొని యందఱును విశ్రాంతికై యాగిరి. వనకేసరి సహాయునితో నొక దూరమందలి శిబిరమునందుండి పోయెను.

వింశతి ప్రకరణము.

విజయసింహుఁడు దప్పించుకొని పోయినందులకు విక్రమాదిత్యుఁడందిన పరితాప మింతింతనరానిది. తనను నిర్బంధించిన సోదరుని శిక్షించుటకంటె విజయ సింహున కాశ్రయ మీఁబోవు విజయాదిత్యుని శిక్షింపవలయునని

త్రిపురజనకునితోఁ జెప్పెను. తత్క్షణమే వాహినిని పయనించి వేంగీదేశమును నేలకుఁ దేవలయునని యాతనిసంకల్పము. కాని వాహినీ శబ్దము స్త్రీలింగమగుటచేత నాడువారితోఁ బ్రయాణమువలె యూఱకనే దినములు గడచిపోవుచుండెను. ప్రక్రమముని కాలొకచో నిలుచుటలేదు. కర్కశ కంఠయగు త్రిపురసుందరితోనైన యాతఁడు సరిగ మాటాడలేదనినచో నాతని యుత్సుకత కొంత తెలిపినటులగును.

ఎట్టకేలకు వారు పయనమైరి. పల్లవ చళుక్య సేనలు లేకుండినను చోళవరూధిని లెక్కింపరానిదై యుండినది. సర్వసేనాధిపత్య మీయకుండినను విక్రమాదిత్యుఁడు వహించియే యుండెను. నటరాజవర్మ సాధారణ సేనానివలె వారిని వెంబడించుచుండెను. ఆతని వదనమునందటు దీనత గాని మందహాసతగాని యుండలేదు. రాఁబోవు సమరము నందతఁడు సంపూర్ణాభిమానముతో బోరాడుననుట సంశయాస్పదము. కతిపయ దినములకు వారు కృష్ణానదీప్రాంత నిబిడారణ్యముల కరుదెంచిరి. పిదప కృష్ణానదిని దాటు నుత్సుకతతో నడవి నిర్గమించిరి. మోహరించి యుండిన సేనను చూచి విభ్రాంతులైరి. ఒక్క నటరాజవర్మ ముఖము తప్ప నితరుల వదనము లన్నియు మ్లానములైన వనినచోఁ జాలును.

అచ్చెరువున కాశ్రయ మొసఁగిన వీరరాజేంద్రుఁడు దన వరూధిని పురోభాగమందు నిలచియుండ నొకశరమతని

పాదములకడ పడెను. దానియందు పత్రము నతఁడు గొని యిటు చదువ సాగెను.

"సార్వభౌమత నభిలషించు చోళరాజా! ఆశావిష్టుఁడగు రాజు వృద్ధి కరుదెంచుననిరిగాని,

'అసంతుష్టో ద్విజో నష్టః । సంతుష్టో నచపార్థివః'

దురాశాపీడితుఁడగు తేఁడు దుఃఖమందును. ఎవని సహాయమున నాహవమ్లుని గెలువగలిగితివో యట్టివాని నొకయువివేక మాటలబట్టి చాలకాలము నిర్బంధమునం దుంచితివి సరికదా అటు సహాయపడినవాని దేశమునే యువ్వెత్తుగ గొన నరుదెంచితివి. ఇట్టి యన్యాయము జరుగుచుండ జూచుట సజ్జన లక్షణము కాదు. అందువలన నిన్నెదిరింప నే నరుదెంచితిని. నీసోదరుని సంతానము హరించుటవలన గలిగిన పాపమునకు ప్రాయశ్చిత్తము నేడనుభవింప జేయ దైవ మనుగ్రహించును గాక!

'రాజ నారాయణ వనకేసరి'

క్రోధవివశుఁడై చదువు వీరరాజేంద్రుని పురుషవేషధారిణియగు త్రిపురతో విక్రముఁడు డాసెను. వీరరాజేంద్రు కరములనుండి యాతాళపత్రమును గొని చదివి విక్రముఁడు దండతాడిత భుజంగమువలె మండిపడెను. తత్క్షణమే మహానసుఁడై సమీప వర్తియగు నటరాజవర్మతో సమరమునకు సైన్యమును గడంగ నాజ్ఞాపించెను. నటరాజవర్మ యశ్వము

నుండి దిగుచు "మహావీరా! ప్రయాణపు బడలికగల సైన్య మెటు పోరునని తలంచితి"రని నిందాగర్భముగఁ బలికెను.

"అధికప్రసంగ మవసరములేదు" అనుచు త్రిపురతో నటువాసెను.

ఆనాఁడే సమర మారంభమయ్యెను. విక్రమ వీర రాజేంద్రులు మధ్యందిన మార్తాండులవలె ప్రళయకాల రుద్రులవలె పోరాడిరనినను వారి సమరక్రీడ వర్ణించినటు కాదు. వనకేసరి వీరవర్గము ముందునకు రానేలేదు. వారి సేనాపతులు రామసింహుని ప్రోత్సాహమున జననష్టము కానటు పోరాడుచుండిరి. సూర్యుఁడస్తాద్రిఁ జేరునప్పటికి సమర మాగిపోయెను. చోళసేనకంటె చళుక్యసేనయందే జననష్టమెక్కుడు గలిగినది. కాని చోళసేన పథాయాసము రామసింహుని చాతుర్య కారితమగు సమరాయాసముచే వివశమై పోయెను. ఒక తృణసహాయముననైన వారిని కూలవేయవచ్చును.

దినకరుఁడు గగనేందిరనలంకరించెను. శవనివహముపై నాతని వెలుగుపడి వింతశోభ నాపాలికలికిఁ గలుగఁ జేయుచుండెను. యుద్ధ మారంభ మయ్యెను. ఎటఁజూచినను వీరరాజేంద్ర విక్రములే యుండిరి. వారంతటి దీక్షతోఁ బోరుటకు వారి శౌర్యమును నరాతి నిరాసంబే కారణంబై యుండును. విజయసింహాదు లున్నతాశ్వముల నధిరోహించి రామసింహుని డాసిరి. నూతనోత్సాహముతో తన సేనను

దొమ్మియుద్ధమునకుం కడంగ నాజ్ఞాపించెను. సంకుల సమర మారంభ మయ్యెను. అప్పటి యాహావమును వర్ణించు టలవిగానిపని.

వీరరాజేంద్రవిజయులును మధుసూదన విక్రములును ద్వంద్వయుద్ధము నారంభించిరి. ఒకరికొకరు తీసిపోవువారు గారు. గడియలకొలఁది పోరాడిరి. అట్టిచో మధుసూదను నశ్వము నొకచోళుఁడు శూలముతోఁ బొడిచెను. దానినుండి ప్రక్కకు దుముకులోపల నది పడుట వలనఁ దప్పించుకొన జాలకపోయెను. యుద్ధధర్మమును వదలి విక్రమాదిత్యుఁడు కరవాలము నెత్తెను. ఆ కరవాలము చేతినివదలి పదిగజముల దూరమునఁ బడిపోయెను. వనకేసరియట ప్రత్యక్షమయ్యెను. “మఱియొక్కకైదువు నందుకొనుము” అనుచు నా శూరుఁడు వారువమును దోలగించి మధుసూదనునకు సహాయుపడెను. అంత విక్రమునితో

“ఔరా! ఇంతటిశూరుఁడవా? విక్రమా! ననుమించిన వీరుని నీశ్యాలకు నొసర్పనెంచి వనకేసరి గాక పరకేసరియని పిలువసాగితివి కాబోలును? ఆ పిఱికిపందకు వేరైన యుండ వలయునని తలంచితివా? రమ్ము. వనకేసరి యెంతటి పరాక్రమవంతుడో చూచి యాపేరును మార్తువుగాని” అనెను.

కరవాలసంఘట్టన శబ్దమయ్యెను. మారుతుని వాలు తగులనటు లతిచమత్కారముగ పోరుచుండిరి. సమీప వర్తితులగు భటులాయుధముల నేలవైచి యటు చూచుచు

నిలచిరి. వనకేసరి ఖడ్గప్రచాలనవైఖరి నంతయు నేకరువు పెట్టి నాలుగైదుమారులు గాయపఱచెను. విక్రముఁ డలసి పోయి రెండు మారులు పడఁబోయెను.

“విశ్రాంతి కావలయునా?” అని వనకేసరియను లోపల కరవాలద్వయ మాతని నిరుపార్శ్వముల గ్రుచ్చుకొనెను. అంతలో విక్రముఁ డొకింత సేదదేరెను.

నటరాజవర్మ వనకేసరీవిక్రముల పోరుజూచుచు నిలచియుండెను. అపుడు విక్రముఁడు క్షతగాత్రుఁడగుటచూచి సంతసింపక పోలేదు కాని యాతని సహజశౌర్య మాతని నుద్రేకపూరితు నొనరించినది. వనకేసరి పరాక్రమాతిశయమును గూర్చి యాతఁడు వినియుండెను. అది కేవలమసహ్యమై యుండినది. వానితో ద్వంద్వయుద్ధ మొనరింప బలుమారు లెంచి యుండెను.

విక్రమునకు సహాయపడ బోవలయునా వలదా యనుకొనుచుండెను. అంతలో పురుషవేషధారిణియగు త్రిపుర యరుదెంచి విక్రమునిఁజూపి చేయిపట్టి లాగెను. తాఁ బ్రేమించిన కాంతలాగుట నతఁడు ముందునకేఁగి వనకేసగిని కత్తితోఁ దాకెను.

వనకేసరి విషయమును గమనించి తటాలున వెనుక కడుగిడెను. త్రిపుర వాలుగ్రుచ్చుకొనక పోలేదు. దానినతఁ డపుడు గమనింపలేదు. ఆయిరువురతో నొక యఱగడియ పోరునప్పటి కలసటతీర్చుకొని విక్రముఁడాతనిపై కరుగు

దెంచెను. వనకేసరి యతి చమత్కారముగ వారినుండి తప్పించుకొనుచుండెను. మనశూరుఁడొక్కగాయము నందు లోపల విక్రమ నటరాజులు మఱి రెండు గాయములనందిరి. ఆ యనసు పమర మింకెంత కాలము జరుగుచుండెడిదో గాని యీ పరిస్థితులు సంపూర్ణముగ మారిపోయెను.

త్రిపురసుందరి పైకెత్తబడెను. నటరాజు ముగ్గురును విక్రము నిద్దరును వీరులు కరవాలముతో బాహున సిద్ధపడి యుండిరి. వనకేసరి యదిచూచి హాసముతో "శర్మగారూ! మీరెత్తినది కాంత యనెను. అవును. అటులెత్తినది బిందు మాధవశర్మయే. ఎత్తఁబడినది త్రిపురకదా! ఆ విప్రుఁడు కాంతను పైకెత్తినందుల కసహ్యపడి పనికిరాని వస్తువును వదలినటు వదలివైచెను. త్రిపుర నడుము లవిరునటు క్రిందపడి నిలువ నశక్తయై యటుచూచుచుండెను.

వనకేసరి తన సహాయులఁజూచి "కీర్తివర్మ మధుసూదనులారా! ఆ ముగ్గురెవరు? ఓహో! మీరా?" అని యట్టహాస మొనరించెను. అంతలో విజయసింహ రామసింహులు లరుదెంచి వీరరాజేంద్రుని బలాయనమును దెలిపిరి.

"మీ యిరువురున్నచోట జయము నకుఁ గొదువయా" యని త్రిపురను లేపుచు వనకేసరియని "త్రిపురా! అటు చూడుము! నీసోదరి మధురాంతకదేవి. ఆమె వాసంతికా దేవి. పల్లవరాజతనయ అదిగో ఆమె. మదాలస సింహపుర

నాథుని తనూభవ. స్త్రీలు సమరమున కరుదెంచిన పిదప నాకీ కరవాలమెందులకు ?" అని నిలచెను.

ఉన్నటులుండి యట కరుదెంచిన వీరులు వనకేసరినిఁ బట్టుకొనిరి. వనకేసరి సహాయుఁ డరుదెంచి "వలదు, మీ కెందులకాశ్రమ ?" అనుచు వనకేసరి ముఖముపై నుండు రక్తాంబరమును దొలగించెను. విక్రమ నటరాజులే యాశ్చర్య పడిరనిన దో వనకేసరిని పట్టుకొనిన వారి విషయము జెప్పనేల ? వీరలోకమా ! మీ మిత్రుఁడు సారంగధరుఁడు నమస్కరించువాడు" అని వనకేసరి యనెను.

"తనయా ! సారంగధరా ! ఎంతటి చతురుఁడవు ! భీరునివలె నెంత చక్కఁగ నటించితివి" అనెను.

"అమ్మా ! వీరునివలె నుండిమాత్రము చేయునదేమి? పితృవ్యుని శిక్షించుటెటుల ?

"అవును తనయా! క్షమాభిక్ష కావలయును" అనుచు నలసిన యాకృతితో విజయాదిత్యుడట కరుదెంచెను.

"ఇదేమి తండ్రీ ! ఎందుల కిటు లరుదెంచితిరి ?"

"ఏమున్నది. నాయనా ! ఆ క్రూరుఁడు నారాయణ భట్టు నను పురి వెడలఁగొట్టెను."

"ఆఁ—" అని యట సమావేశితులందఱు ననిరి.

"మఱిలెండు. ఆ బ్రాహ్మణబ్రువుని ఖండించి మఱి విశ్రాంతి నందుదము"

"ఒక్కింత విశ్రాంతి యవసరమని వనకేసరి సహాయుఁడనెను."

"ఔను. మఱచితిని. మిత్రులారా! ఈ మహాశయుఁడు రణధవళుఁడను కళింగుఁడు ; మాజనకుని మిత్రుఁడు"

"నా గురువు"

"మిత్రుఁడు కాఁడు. సేవకుఁడు" అని రణధవళుఁడనెను.

"నా ప్రతికార్యము నాతని సహాయమున నైనది"

"కాని తనయా! ఆనాఁడు నీ వస్త్రములఁ జూచితిని గాని యీ యంబరములగుపడలేదే!"

"తల్లీ! మీరు వాని లోపలిభాగమును జూడలేదు."

"అటులనా!" అని యాపె స్మిత మొనరించెను.

వారి యానందముతో మనకవసరములేదు. వనకేసరి సారంగధరుఁడని కొందఱు తెలిసియుండుట వలన భావములంతగ వర్ణనీయములు గావు.

ఉపసంహారము.

సారంగధరుఁడందిన గాయములకు, రణధవళుఁడు వనౌషధులతోఁ గట్టులఁగట్టెను. వాసంతిక తన విశాలమగు కందోయితో నా రాకుమారునకుఁ బరిచర్య యొనర్చుచుండినది. రత్నసింహునిచే బట్టువడిననాఁటి తనచర్య, ఆ చిత్తరువునుజించి పారవైచినచర్య, భావవీధిని బాయకుండెను. అకార్యము సారంగధరుఁడు గమనింపకుండినచోఁ నింతగ

నామె వ్యధనంది యుండెడిదికాదు. మధురాంతక మంజుల లతని నైజమెఱింగిన వారగుట వింతపడవలసిన యావశ్యకత లేకుండినది.

రామసింహుల సాధిపత్యమున మరల యానేన పయన మారంభించెను. విజయవాడయందు సత్కరింపఁబడి రాజమహేంద్రవరమును సకాలమున డాసిరి. రాజమహేంద్రవరదుర్గము నెటుల వశమొనర్చు కొనటాయని యావీరు లాలోచించు కొనుచుండిరి. ఆ పురిని సమీపించుపఱకు నొక నిశ్చయమునకు వారు వచ్చియుండలేదు. పురద్వారములు తెఱువఁబడియుండఁబట్టి, వారికచ్చెరువు గలుగకపోలేదు. నారాయణభట్టు పురరక్షణమునం దప్రమత్తుఁడై యుండునని వారనకొని యుండలేదు.

సైనిక కోలాహలము పురమున వినిపించినంతనే కొందఱు పురుషులు పురినిర్గమించిరి. వారు విరోధభావమున వచ్చుచుండిరేమో యని యిక్కడివారు జాగ్రత్తపడక పోలేదు. కాని వారుసమీపించినంత సారంగధరుఁ డశ్వమును దిగెను. అదిచూచి వీరులందఱు నటులొనరించిరి.

“ కళింగనాయకునకు సారంగధరుఁడు నమస్కరించు వాఁడు ”

“ వత్సా! చక్రవర్తివిగమ్ము. ”

“ అదిగో! మాతనయ కాదంబరి నను రక్షింప తన మిత్రులతో కంచినివీడి యుద్ధరంగమున కరుదెంచినది ”

వాక్యము ముగియకముందే పితాసుతులు పరిష్వంగ సుఖమనుభవించు చుండిరి. ఆహా! పితృవాత్సల్యమహిమ నెవరు వర్ణింపఁగలరు? ఒక యుఱగడియకు పైగాఁ గాలము గడచిపోయినది. సారంగధరుఁ డేదియో యనఁబోవుచుండ రణార్దవుఁడు.

"వత్సా! సారంగధరా! నే నీపురి సమాచారముల గమనించుచునే యుంటిని. నాఁడు నీవటు ధైర్యము సెప్పిన మీఁద నీ నిగూఢవర్తనావశ్యకత కెంతయు నలరి నీపితృవ్యుని పై నొకకన్ను బెట్టుకొనియే యుంటిని. నారాయణభట్టు దుస్తంత్రము లేనాఁటి కానాఁడు నాకెఱుక పడుచుండినవి. అందువలన విజయాదిత్యుఁడు పలాయితుఁ డయ్యెనని తెలిసి నంత సముచితసేనతో నరుదెంచి యీ బ్రాహ్మణ బ్రువుని బంధించివైచితిని."

"రాజచంద్రా! మీఋణము నెటు తీర్చుకొందును?"

"నా ఋణమా! సారంగధరా! ఏల యీమాటలు? నా సచివసేనానుల ద్రోహమును వెలిబుచ్చి నా రాజ్యమును నిష్కంటక మొనర్చితివి. నాతనయ నొసంగి నా మానసము నకుఁ బ్రశాంతి నొసంగితివి. వజ్రహస్తునిమైత్రియు నాకొసంగుటకు నీవ కారణమని రణధవళుని వలన తెలియనయ్యెను."

"ఓ! ఈప్రశంసలకు గాలమున్నదిలెండు పోదము."

రణధవళుఁడు కళింగ విషయములు మధుసూద నాదుల కెఱుకపఱచుచుండ నెల్లరు రాజమహేంద్రవరమును

ప్రవేశించిరి. పురము సారంగధరుని రాకను బొందిన యానందము వర్ణనాతీతము.

ఒక శుభ ముహూర్తమున సారంగధరుఁడు వేంగీదేశమునకుఁ బట్టాభిషిక్తుఁడయ్యెను. అటజరిగిన విషయములన్నియు వ్రాయు టతివిస్తరమగును. సారంగధరుఁడు రాజనారాయణ కులోత్తుంగ దేవుఁడను బిరుదమున వ్యవహరింపబడుచుండెను. మధురాంతకదేవి, వాసంతిక, కాదంబరిలను వివాహమయ్యెనని చెప్ప నవసరము.

కీర్తివర్మ వైజయంతి యందుండినపుడు తిరువణ్ణామలై యందలి యోగివలన జ్ఞానోపదేశ మందిన వాఁడగుటవలన తన సోదరితో పల్లవరాజ్యమును సారంగధరుని వశమొనర్చి సర్వసంగ పరిత్యాగియై వెడలిపోయెను. మధుసూదనవర్మ సర్వసేనాధిపత్యము వహించి రాజమహేంద్ర వరమునందే యుండిపోయెను. మధురలాలస, విజయాదిత్యులొక భవనమునందుండిరి. రామసింహ విజయసింహులు పల్లవ, చాళుక్య రాజ్య మధ్యభాగముల నేలుచు సారంగధరునకుసామంతులై యుండ నియమింపఁ బడిరి. అందులకు వారియ్యకొనరైరిగాని ఫలము లేదయ్యెను. ఆ వీరద్వయమున కది శిక్షగఁ దోచినది. కాని వారిరువురును రాజమహేంద్ర వరమునందే వత్సరమునందుఁ జాలకాల ముండిరనినచో సత్యమునకు దూరము కాదు. రణధవళుని వెంటగొని రణార్ణవుఁడు నాలుగైదు మాసములకుఁ బిదప కళింగమున కేఁగెను.

1069 వ సంవత్సరము వీరరాజేంద్రుఁడు పరలోకగమన మొనరించెను. సేనాబలయుతుఁడగు నటరాజవర్మ రాజరాజును ధరాపాలనమునకుంచి సర్వాధికారముల వహించెను. త్రిపురసుందరితో విక్రముఁడా దేశమును వదలి పోయెను. విజయసింహ రామసింహుల రాజ్యముల నాక్రమింప కపటోపాయము లొనరించెను సోమేశ్వరుని దండింప కులోత్తుంగుఁడు వెళ్లెను. ఆసమయమున పశ్చిమ చాళుక్య సేన యూప్రాంతములందు ప్రచ్ఛన్నుఁడై యుండిన విక్రమాదిత్యుని నాయకత్వమును వహించెను.

1069 లో నాయుద్ధము పొసఁగినది. అందు జయాపజయములు నిర్ణయింపరానివై యుండినవి. విక్రమాదిత్యుఁడు సంధి నభిలషించెను. కులోత్తుంగుఁడు రాజమహేంద్రవరము జేరి నంతన విక్రమాదిత్యుఁడు తన సేనతోఁ జోళదేశముపై నేఁగి రాజరాజ నడరాజవర్మలఁ జంపి తన శ్యాలకుఁడగు పరకేసరి వర్మను రాజ్యాధినాథు నొనరించెను.

కులోత్తుంగుఁడిదివిని మండిపడి సకల వాహిని పరివృతుఁడై యేఁగి పరకేసరి వర్మను తఱిమి నటరాజ వర్మపక్షము వారభిలషించుటనుబట్టి చోళదేశమున 1076 సంవత్సరాంతమున కులోత్తుంగ చోళదేవి చక్రవర్తియనుపేర పట్టభద్రుఁడయ్యెను. మూఁడు తరములనుండి చోళదేశకన్యల వివాహమైన వారగుట నా రాజ్యాధిపత్యాధికారమునుగల వాడయ్యెను.

1080 వరకును నిష్ఫలముగ ఆరవ విక్రమాదిత్యుఁడు చోళ దేశమునకై యత్నించెనుగాని వ్యర్థ మనోరథు డయ్యెను. అంతస్థిరముగ నొకసంధి చేసికొని సౌమనస్యతతో నుండెను. విజయాదిత్యుఁడు వేంగి దేశమునకు రాజప్రతినిధియై యుండెను. అతఁడట చాలకాల ముండలేదు.

సారంగధరుఁడు కాడు. కులోత్తుంగ చోళదేవచక్రవర్తి తన జ్యేష్ఠతనయుని రాజేంద్రునట ప్రతినిధిగా బంపెను. తనతనయను రాజసుందరిని కళింగనాయకుఁడగు వజ్రహస్తుని తనయునకు రాజరాజునకు నొసంగి యా దేశమునుండి తొందర కలుగనటు లొనరించుకొనెను.

పాఠక మహాశయులు క్షమింపవలయును. ఇందుఁ జెప్పిన యంశములతోఁ గథ పెంచవలసి యుండెను. కాని మన యాంధ్రప్రభువు తమిళప్రభువై పోయెనను విరక్తియే వ్రాయనీయ దయ్యెను. అట తమిళకవుల దగ్గఱ తీసెననియు వారినుండి కబ్బములనందెననియుఁ జరిత్రలు సెప్పుచున్నవి. ఆంధ్రశబ్ద చింతామణిపై నభిమానముగల యతఁడాంధ్ర కన్నెను వదలిన మీద మనమేల యాతని గుఱించి చదువ వలయును? ఆతని పట్టమహిషి తమిళ కాంత యగుటిందులకు కారణమని మహాత్ముఁడు త్యాగరాజుగారి. "ఎంత నేర్చిన, ఎంత చదివిన. ఎంతవారలైన కాంతదాసులే!" అను పదజాలము స్మరించి యింతటితోఁ జాలింతము సెలవు.

(శ్రీరామచంద్రార్పణమస్తు)